

స్పెయిన్ ఉగ్రదాడిలో 13 మంది మృతి 5లో

Estd. 1938
ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

సంపుటి: 60 • సంచిక: 224 • శుక్రవారం 18 ఆగస్టు 2017 • విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ ఏకాదశి ఉ.8.32 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: ఆరుద్ర రా. 8.32 వరకు, అనంతరం పునర్వసు; అమృతకాలం: ఉ. 11.35 నుండి 1.05 వరకు; వర్జ్యం: ఉ. 6.19 నుంచి 7.49 వరకు వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు, తదుపరి మ. 12.32 నుండి 1.23 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు

మెరిసిన బంగారం... వెండి



- మళ్లీ రూ.30 వేలకు పసిడి • రూ.40 వేలకు వెండి
- కలిసొచ్చిన బులియన్ సెంటిమెంట్ 6లో

టెలికామ్‌లో జాబ్స్ వెల్లువ!



- వచ్చే ఏడాది 30 లక్షల ఉద్యోగాలు
- అసోచామ్- కేపీఎంజీ అధ్యయనం 6లో



అమ్మ మృతిపై కమిషన్

- తమిళనాడు సీఎం ప్రకటన
- అన్నాడీఎంకే వర్గాల విలీనానికి మొదటి మెట్టు

చెన్నై: దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మృతిపై న్యాయవిచారణకు ఆ రాష్ట్ర సీఎం ఈ పళనిస్వామి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆదేశాలు జారీ చేసారు. పదవీ విరమణ చేసిన మద్రాస్ హైకోర్టు జడ్జి విచారణ కమిషన్‌కు నేతృత్వం వహిస్తారని ఈపీఎస్ ప్రకటించారు. జయ నివాసం పోయెస్ గార్డెన్‌ను కూడా ఒక స్మారక చిహ్నంగా మారుస్తామని చెప్పారు. సచివాలయంలో హడావిడిగా 7వ పేజీలో...

నాబార్డు నిబంధనాలతో

పోలవరంకు జాప్యం?!



- చక్ర భ్రమణంలో రుణాల ప్రక్రియ • పాటిస్తూ పోతే తీవ్ర ఆలస్యమే • కేంద్రానికి వదిలేస్తే త్వరితగతిన పనులు
- జల విద్యుత్ కేంద్రం వ్యయాన్నీ ప్రాజెక్టులో చేర్చాలి • ఎత్తిపోతల వ్యయాన్ని రాబట్టాలి • కేంద్రమే నేరుగా నిధులిచ్చేలా చూడాలి • అప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు కల సార్ధకం

(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

పోలవరం బహుళార్ధకసాధక ప్రాజెక్ట్ నిర్మాణానికవసరమైన రుణాన్ని అందించాలంటూ నాబార్డ్‌కు కేంద్రమంత్రివర్గం ఆదేశాలిచ్చింది. ఇందుకవసరమైన నిధుల సమీకరణక్కూడా అనుమతులు జారీ చేసింది. నాబార్డ్ సమీకరించిన నిధుల్నుంచి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి రుణాలిస్తుంది. ఈ మేరకు కేంద్రం ఈ నిధుల్ని తిరిగి నాబార్డ్‌కు చెల్లిస్తుంది. ఇదంతా ఓ భ్రమణంలా జరుగుతుంది. అయితే ఈ క్రమంలో పోలవరం నిర్మాణం తీవ్ర జాప్యమౌతోంది. సహజంగానే ఒక బ్యాంక్ ఏ ప్రాజెక్ట్‌కు రుణాన్ని విడుదల చేయాలన్నా సవాలక్ష నిబంధనలుంటాయి. వాటన్నింటిని ఖచ్చితంగా పాటిస్తేనే నిధులు విడుదలౌతాయి. బ్యాంక్ మంజూరు చేసిన రుణానికి సంబంధించి చేపట్టే నిర్మాణంలో ప్రతి అంశం వద్ద ఖచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిదానికి లెక్కలు ఖచ్చితంగా ఉండాలి. నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా నిర్మాణాలు సాగాలి. ప్రతిచోట పలు కీలకాంశాల్లో నిష్ణాతుల పరిశీలనలుండాలి. ఇందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలందినతర్వాతే బ్యాంక్ ఆ మొత్తాన్ని విడుదల చేస్తుంది. ఆ తర్వాత ప్రతి రూపాయికి వినియోగపు వివరాల్ని విధిగా అందించాల్సుంటుంది. ఆ తర్వాత తిరిగి రెండోవిడత రుణం మంజూరౌతుంది. ఇదంతా నిబంధనల మేరకు సక్రమంగానే జరుగుతుంది. అయితే నిధుల మంజూరు, విడుదల విషయంలోనే అనూహ్య జాప్యం నెలకొంటుంది. ఓ వైపు 2018నాటికి పోలవరం నుంచి గ్రావిటీ ద్వారా సాగునీరిస్తామంటూ ప్రభుత్వం పదే పదే ప్రకటనలిస్తోంది. 2019నాటికి 3వ పేజీలో...



అవినీతి అంతం నా పంతం

- అప్పటివరకూ నిద్రపోను
- నీతి ఆయోగ్ నిర్వహించిన సమావేశంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో వ్యవస్థీకృతమైన అవినీతిని నిర్మూలించడానికి తమ ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందనీ,అవినీతిని అంతమొందించే వరకూ నిద్రపోనని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఆయన గురువారం ఇక్కడ స్టార్టప్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుద్దేశించి ప్రసంగిస్తూ, పెద్ద కరెన్సీని రద్దుచేయడం ఈ దిశలో తీసుకున్న చర్యేనని అన్నారు. స్టార్టప్ ఔత్సాహిక 7వ పేజీలో...

ఉప ఎన్నిక వాయిదాకు వైకాపా కుట్ర!

- శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు కుయుక్తులు • ప్రజలు అప్రమత్తంగా ఉండాలి • కుట్రలు, కుయుక్తులను తిప్పికొట్టాలి
- విజయం మనదే.. మెజారిటీపైనే దృష్టి • సమన్వయ భేటీలో చంద్రబాబు

హైదరాబాద్/అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉపఎన్నికలో శాంతిభద్రతలకు విఘాతం సృష్టించి తద్వారా ఈ ఎన్నికను వాయిదా వేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఒకవేళ ఇది జరగని పక్షంలో ఓటర్లకు భారీగా డబ్బులు పంచుతూ ఆ దృశ్యాలను వీడియో బంధించి డబ్బులు పంచుతున్నది అధికార పార్టీ అని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి తద్వారా ఉపఎన్నికను రద్దు చేసే ప్రయత్నాన్ని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నంద్యాల ఉప ఎన్నికకు సంబంధించి గురువారం తన నివాసంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు సీఎంగా ఉన్న జయలలిత మరణించాక ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్‌కేనగర్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వచ్చాయని ఈ ఎన్నికలో ధన ప్రవాహం అధికంగా ఉండడంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ విష యాన్ని గుర్తించి ఉపఎన్నికను రద్దు చేసిందని ఆయన గుర్తుచేశారు. ఇదే తరహాలో నంద్యాల ఉపఎన్నికలోనూ జగన్ ఈ కుట్ర చేసేందుకు ప్రణాళికలు రూపొం దిస్తున్నారని ఆ పార్టీ వేసే వలలో తెదేపా నేతలెవరూ పడొద్దని హితవు పలికారు. ఉపఎన్నికలో జగన్ ఉదయం వేళల్లో ప్రచారం నిర్వహించి రాత్రి నిర్వహిస్తున్న అంతర్గత సమావేశాల్లో ఎలాగైనా సరే ఉపఎన్నికను రద్దు చేయాలన్న అంశంపై ప్రధానంగా మాట్లాడుతున్నారని సమన్వయ 7వ పేజీలో...



గెలుపు బాధ్యత నాదే

- చంద్రబాబుకు గంగుల హామీ • నేటి నుంచి నంద్యాల్లో ప్రచారం • పార్టీలో సీనియార్టీని గౌరవిస్తాం: సీఎం 7లో

మూడున్నరేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల అవినీతి!

- వైఎస్ పథకాలు నిర్వీర్యం
- మహాసంగ్రామంలో ధర్మానిదే విజయం
- దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడండి
- నంద్యాల రోడ్ షోలో జగన్మోహన్ రెడ్డి



నంద్యాల, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనహితం కోసం ప్రవేశపెట్టిన అనేక పథకాలను నిర్వీర్యం చేశారని వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. ఎంతో ఆదరణ పొందన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటి పథకాలకు సైతం టీడీపీ పాలనలో గ్రహణం పట్టిందని ధ్వజమెత్తారు. నంద్యాల 7వ పేజీలో...



మోడీకి తిరుగే లేదు



- ఎన్డీయేకి 349 సీట్లు
- కాంగ్రెస్‌కి 47 వస్తే గొప్ప!
- బెస్ట్ పీఎం మోడీయే • సీఎంల్లో మమతే బెస్ట్
- నితీష్ ఆమె తర్వాతే • ఇండియా టుడే- కార్వీ సర్వే

7లో

హవ్వ! ఇంత నిర్లక్ష్యమా?!

- గోదాముల్లో ముక్కుతున్న యూరియా బస్తాలు
- వృథాగా ఏడు వేల టన్నులు
- నాసిరకం సరుకని ఆరోపణలు
- కొనుగోలు చేయని రైతాంగం
- ఇప్పటికే రూ.కోట్లలో అద్దె చెల్లింపు



విజయనగరం-కెఎన్ఎన్ బ్యూరో: సీజన్లో రైతుల అవసరాలకై విక్రయించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 2014-15 సంవత్సరంలో కొనుగోలు చేసిన యూరియా కథ మార్క్‌ఫెడ్ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన యూరియాలో ఏడు వేల మెట్రిక్ టన్నులు స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాములతో పాటు ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన గోదాముల్లో నిల్వ వుంచారు. వాస్తవానికి ఎంత మొత్తంలో కొనుగోలు చేశారో చెప్పేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు వెనుకాడుతున్న వైనం కూడా మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఏది ఏమైనప్పటికీ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు కెయుపి రమణి అందించిన కొద్ది పాటి వివరాల ప్రకారం 7వ పేజీలో...



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన పెయిడ్ ఆర్టికల్స్‌పై చర్యలు తీసుకోండి

• ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నంద్యాల ఉపఎన్నికలో సాక్షి దినపత్రిక పెయిడ్ ఆర్టికల్స్ ప్రచురిస్తోందని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను తెలుగుదేశం పార్టీ కోరింది. ఓటమి భయంతోనే వందల కోట్ల పంపిణీ అనే హెడ్‌లైన్‌తో బుధవారం మొదటిపేజీలో ఒక వ్యాసాన్ని ప్రచురించారని, ఇది పూర్తిగా ఓ పార్టీకి అనుకూలంగా ఉందని ఆరోపిస్తూ తెదేపా కార్యాలయ సమన్వయ కార్యదర్శి టి.డి.జనార్దన్‌రావు గురువారం ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేశారు. నంద్యాల ఉపఎన్నికలో తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వందలకోట్లు పంపిణీ చేస్తున్నా రంటూ ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండానే తప్పుడు ఆరోపణతో ఆ పత్రిక లో వార్తలు ప్రచురిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ తప్పుడు వార్తలు, వ్యాసాలన్నీ వైసీపీ ప్రచారానికి అనుకూలంగా ఉన్నాయని, ఆ పార్టీకి ఓ కరపత్రంలాగా ఆ పత్రిక పని చేస్తుందని ఆయన ఆరోపించారు.ఇలాంటి పెయిడ్ ఆర్టికల్స్‌ను ప్రచురించకుండా సాక్షి దినపత్రికను ఆదేశించాల్సిందిగా ఎన్నికల సంఘానికి ఆయన కోరారు.

నంద్యాల ఉపఎన్నిక టీడీపీ ఇన్‌ఛార్జ్‌లుగా మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికలకు సంబంధించి పార్టీ బాధ్యతలను మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అప్పగించారు. గురువారం ఈ మేరకు విజయవాడలో వారిని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో నంద్యాల ఎన్నికలకు పార్టీ ఏ స్థాయిలో సిద్ధం అయ్యిందో అర్థం చేసుకోవచ్చుననీ పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ నెల 23వ తేదీ ఎన్నిక రోజు వరకూ వారు నంద్యాల్లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి విజయానికి ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోకూడదని పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే నేరుగా ముఖ్యమంత్రి తనయున్ని రంగంలోకి దింపుతోంది. ఇప్పటికే ఎన్నికల తేది నుంచి నంద్యాల్లోనే ఉంటాననీ గతంలోనే మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. ప్రస్తుతం ఇరువురు మంత్రులను ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లుగా పార్టీ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే కాకినాడ ఎన్నికలకు సంబంధించి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించింది.

తల్లిదండ్రులు లేని పిల్లలపై జగన్ కక్ష సాధింపు

• భూ బకాసురులు శిల్పా సోదరులు
• మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి



నంద్యాల (బండిఆత్మకూరు), కెఎన్ఎన్ : రాష్ట్ర ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి తీరు తల్లిదండ్రులు లేని భూమా అఖిలప్రియ, భూమా బ్రహ్మానందరెడ్డిలపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్లు ఉందని, రాష్ట్ర ప్రతిపక్ష నేత హోదాలో నంద్యాల ఉప ఎన్నికలు ఇం టింటి ప్రచారంలో పాల్గొనడం సిగ్గుచేటని రాష్ట్రమంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ జూపూడి ప్రభాకర్‌లు విమర్శించారు. గురువారం నంద్యాలలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమా వేశంలో మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తాను దళితులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను వక్రీకరించారన్నారు. శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాల మార్కెట్‌లోని చిరు వ్యాపారులను తీవ్ర ఇబ్బంది లకు గురిచేశారని మండిపడ్డారు. శిల్పా సహకార్, శిల్పా మహిళా సహకార్‌లకు కేవలం నెలకు రూ. 2 వేలు, రూ. 3 వేలతోనే బాడుగలు చెల్లిస్తున్నారని, మార్కెట్‌లో మాత్రం చిరు వ్యాపారులు నెలకు రూ. 15 వేల నుంచి రూ. 18 వేల వరకు చెల్లిస్తున్నా రన్నారు. తన సొంత గ్రామంలో దళిత కాలనీ చివరి భాగంలోనే తన సొం త ఇల్లు ఉందని మంత్రి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నా రు. స్వర్గీయ భూమా నాగిరెడ్డి ఆత్మ సంతృ ప్తి కలగా లని, ఆయన ఆశయాలు నెరవేర్చేందుకే మంత్రులు పర్యటిస్తున్నామన్నారు. జగన్మోహన్‌రెడ్డి తమ అభ్యర్థిగా శిల్పా మోహన్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ నుంచి తెచ్చుకొని బరిలో దించారన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడు తూ వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోనే ఓటర్లను ప్రలోభ పెడుతూ డబ్బులు పంపిణీ చేశారని ఆరోపించారు. అంతేకాకుండా ఓటర్ల వివరాలు తీసు కుని, వారి ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని వైకాపా నేతలు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ శిల్పా సోదరులు దళితుల వద్ద భూములు లాక్కున్నారని, వారి అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయన్నారు.

నంద్యాల ఉపఎన్నికను రద్దు చేయాలి

• ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

అమరావతి, ఆంధ్రప్రభ : ఒక్క ఉప ఎన్నికకు భయపడి అధికార,ప్రతిపక్ష పార్టీలు విచ్చలవిడిగా డబ్బు పంచుతున్నారని, సత్వరమే ఈ చర్యకు అడ్డుకట్ట వేయాలని లేనిపక్షంలో నంద్యాల ఉప ఎన్నికను రద్దుపర్చాలని ఏపీ పీసీసీ చీఫ్ ఎన్ రఘువీరా రెడ్డి డిమాండ్‌చేశారు. గురువారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ, ఇప్పటి నుండైనా మీరు నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికజరుపుతారా..జరపండి..లేకపోతే..ఎన్నిక రద్దు చేయండని ఆయన ఎన్నికల కమిషన్‌ను కోరారు. ప్రజాస్వామ్యాన్ని ఒక్క ఎలక్షన్‌లోనే కాపాడలేని ప్రభుత్వ యంత్రాంగం ఉంటే రేపటి రోజున సాధారణ ఎన్నికల్లో ఈ యంత్రాంగం ఏమి చేయగలదని ఆయన ప్రశ్నించారు.

అధికార యంత్రాంగమంతా అక్కడేనా..?

రాష్ట్రాన్ని అనేకమైన సమస్యలు పట్టి పీడిస్తున్నా వాటన్నింటినీ గిలికొదిలేసి మూడు నెలలుగా ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నంద్యాలలోనే మకాం వేసిందని ఫలితంగా రాష్ట్రంలో పాలన పడకేసిందని రఘువీరా రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వానికి సంబంధించినవారంతా నంద్యాలలో ఉన్నారని, వ్యవసాయ శాఖామంత్రి గత రెండు నెలలుగా అక్కడే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికే మూడు సార్లు అక్కడ పర్యటించారని చెప్పారు. ప్రతిపక్షనేత జగన్ అయితే పది రోజులుగా నంద్యాలలోనే మకాం వేసి ప్రచారం చేస్తున్నారన్నారు. నంద్యాలలో ఉభయ పార్టీలు విచ్చలవిడిగా డబ్బును ఖర్చుచేస్తున్నాయని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయన్నారు. నేతల మాటలకైతే సప్త సముద్రాలు దాటిపోయాయన్నారు. తమది ప్రజాదరణ కలిగిన పార్టీ అని అటు చంద్రబాబు, ఇటు జగన్ పదేపదే చెబుతుంటారని, అదే నిజమైతే ఎందుకిన్ని బాధలు పడుతున్నారో జవాబు చెప్పాలని డిమాండ్‌చేశారు. ఇద్దరూ మోడీకి సరెండర్ అయ్యారన్నారు. ప్రత్యేక హోదా అంశంపై చిత్తశుద్ధితో ఆదినుండి పోరాడుతున్నది తామేనని ఆయన స్పష్టంచేశారు. నిజంగా చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్షం వేసి నంద్యాల ఉప ఎన్నికల అనంతరం ఈ అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్ళాలని ఆయన డిమాండ్ చేశారు.

దళితులపై రాష్ట్ర క్యాబినెట్‌లోని మంత్రి చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. సమాజంలో కోటి జనాభాకుపైగా ఉన్న దళితులపట్ల ఒక బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న మంత్రి మాట్లాడాల్సిన మాటలేనా ఇవి అని ఆయన ప్రశ్నించారు.

బాబు వ్యూహాలతో ప్రకంపనలు

• మలుపులు తిరుగుతున్న నంద్యాల రాజకీయం
• టీడీపీ గూటికి మరికొందరు? • అంతుచిక్కని అధినేత అంతరంగం
• గ్రూపుల సమన్వయంలో మంత్రుల తలమునకలు

నంద్యాల, ఆంధ్రప్రభ : నంద్యాలలో పరిణామాలు మలుపులు తిరుగుతున్నాయి. పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ ఎలాగైనా పాగా వేయాలని పాలకపక్షం సర్వసన్నద్ధమవుతుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న వ్యూహాలతో నంద్యాలకు చెందిన నేతలకు దిమ్మ తిరుగుతోంది. అయితే ముఖ్యమంత్రి వ్యూహాలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయోననే చర్చ నంద్యాల వర్గాలలో జరుగుతోంది. తాజాగా మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డిని టీడీపీలో చేర్చుకోవడాన్ని మంత్రి అఖిలప్రియ జీర్ణించుకోలేకపోతున్నారు. గంగుల ప్రతాపరెడ్డి రాకతో తమ రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయనే అభిప్రాయంతో ఆమె వున్నారు. ఇదే విషయమై నంద్యాలలో వున్న కొందరు మంత్రుల వద్ద ఆమె ప్రస్తావించినట్టు సమాచారం. కాగా గత కొంతకాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా వున్న ప్రతాపరెడ్డికి వచ్చే ఎన్నికలలో ఎం.పి. టికెట్ ఇచ్చే వ్యూహంతోనే ముఖ్యమంత్రి పార్టీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. ఇప్పటికే ఒకసారి వీల్‌చైర్‌లో కూర్చుని ప్రచారం చేసిన నంద్యాల ఎం.పి. ఎస్.పి.వై.రెడ్డికి కూడా తాజా పరిణామాలు ఒక హెచ్చరికగా భావిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహం ఒకవైపు స్వపక్షంలో, మరోవైపు విపక్షంలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. గెలుపు తమదే అనే ధీమాతో వున్న వైసీపీ బాబు వ్యూహాలతో అయోమయంలో పడుతోంది. అదే విధంగా నాలుగు గ్రూపులుగా వున్న టీడీపీ నాయకులు సైతం ముఖ్యమంత్రి వ్యూహం అర్థం కాక తికమకపడుతున్నారు. నంద్యాల ఎన్నికలను అంతా తానై నడిపిస్తున్న ముఖ్యమంత్రి అన్ని గ్రూపులు ఒక్కతాటిపైకి వచ్చి విజయం కోసం పనిచేయాలని ఇప్పటికే నిర్దేశించారు.

రెండు వర్గాలు కలిసే ప్రసక్తే లేదు: మంత్రి అఖిలప్రియ

భూమా, గంగుల వర్గాలు కలిసే ప్రసక్తే లేదని మరోవైపు రాష్ట్ర మంత్రి అఖిలప్రియ స్పష్టం చేశారు. గురువారం ఆమె ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ ఇప్పటికే నంద్యాలలో టీడీపీ విజయం ఖాయమైందని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులలో గంగుల ప్రతాపరెడ్డి రాకవల్ల లాభం, నష్టం ఏమీ వుండబోదని భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఏ నిర్ణయమైనా బాగా ఆలోచించి తీసుకుంటారనే నమ్మకం తమకు వుందన్నారు. ఇంతవరకు గంగుల, భూమా వర్గాలు కలిసి పనిచేసిన సందర్భాలు రాలేదని, ఇక ముందు కూడా వస్తాయని తాము భావించడం లేదన్నారు.



మంత్రుల మంతనాలు

ప్రతాపరెడ్డి పార్టీలో చేరిక అనంతర పరిణామాలను నంద్యాలలో మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాల్వ శ్రీనివాసులు గురువారం సాయంత్రం సమీక్షించారు. మంత్రి అఖిలప్రియతోనూ మాట్లాడారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆమెను మంత్రులు కోరారు. అయితే గంగుల కుటుంబంతో తమ వర్గానికి అసలు పొడగిట్టదనే రీతిలో అఖిలప్రియ బదులిచ్చినట్టు తెలిసింది. వచ్చే సాధారణ ఎన్నికలలో ఎం.పి. పదవికి పోటీచేయాలనేయోచనలో వున్న సజ్జల శ్రీధర్ రెడ్డితో కూడా మంత్రులు మాట్లాడినట్టు తెలిసింది. గంగుల ప్రతాపరెడ్డిని పార్టీలోకి తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులను వారు ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డికి వివరించారు.

ఎమ్మెల్సీ పదవి?

ఇదిలా వుండగా ఎంపీ ఎస్.పి.వై. రెడ్డి అల్లుడు అయిన సజ్జల శ్రీధర్ రెడ్డికి శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని సమాచారం. ఈ మేరకు గురువారం సి.ఎం నుంచి ఆయనకు నిర్దిష్టమైన హామీ లభించిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

మరికొందరు?

ఇదిలా వుండగా పోలింగ్‌కు మరో అయిదు రోజుల గడువు మాత్రమే వుండగా, మరికొందరిని పార్టీలోకి ఆహ్వానించే దిశగా టీడీపీ నాయకత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఒక ఎమ్మెల్సీతోపాటు రూరల్ ప్రాంతంలో విపక్షానికి ఆయువుపట్టుగా వున్న నేతతో పాటు కొందరు జిల్లా స్థాయి నాయకులను పార్టీలోకి తీసుకునే విధంగా మంతనాలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి వ్యూహంపై స్వపక్షంతో పాటు విపక్షంలోనూ పరిణామాలు అంతుబట్టని పరిస్థితులు నెలకొన్నాయి.



ఇంటింటి ప్రచారంలో మంత్రి శిద్దా రాఘవరావు తదితరులు



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న వైసీపీ అధినేత జగన్

25 వేల మెజార్టీతో టీడీపీ గెలుపు ఖాయం

• మంత్రి శిద్దా రాఘవరావు

నంద్యాల, కెఎన్ఎన్ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని జగన్ అడుగడుగునా అడ్డుకున్నారని మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. అభివృద్ధి నిరోధకుడుగా జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ నంద్యాలలో మకాం వేశారని, ఎన్ని ప్రయత్నాలు చేసినా తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఘన విజయం సాధిస్తారని అన్నారు. ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన 10వ వార్డుతోపాటు బొంతల వీధి, కాటన్, దాల్ మిల్ అసోసియేషన్ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపాకు అన్ని వర్గాల్లో లభిస్తున్న ఆదరణ, మద్దతు చూసి వైకాపా డీలా పడిపోయిందన్నారు. తెదేపా అభ్యర్థి 25 వేలకు పైగా మెజార్టీతో గెలుస్తారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పాలనలో నంద్యాలలో ఎటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగలేదన్నారు. దివంగత భూమా నాగిరెడ్డి కుటుంబానికి తెదేపా అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులకు తెదేపా ప్రభుత్వంలో ఇచ్చిన వచ్చిన గుర్తింపు మరే ప్రభుత్వంలో రాలేదన్నారు. ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి సముచిత స్థానం ఇచ్చి గౌరవించారన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. నంద్యాలలో అభివృద్ధి నిరోధకులకు మధ్య జరుగుతున్న పోరాటంగా అభివర్ణించారు. ఆయన వెంట గంగిశెట్టి విజయ్ కుమార్‌లు ఉన్నారు.

ఉపఎన్నిక తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతు

మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి,ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఓటమి పాలవుతామనే భయంతో కొట్టుమిట్టాడుతోందని, ఉప ఎన్నిక ఫలితాల అనంతరం ఆపార్టీ రాష్ట్రంలో అడ్రస్ లేకుండా పోవడం ఖాయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డితో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సుమారు గంటన్నరపాటు సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ సిఎం సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరతారని మంత్రి వెల్లడించారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైకాపా ఓటమి పాలవుతుందన్న భయంతోనే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని మంత్రి దుయ్యబట్టారు. వైసిపి కుట్రలకు సంబంధించిన అన్ని అంశాను ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఉప ఎన్నికలసమయంలో దాదాపు 10 రోజులపాటు అక్కడే మకాం వేసి ప్రచారంలో పాల్గొన్న ఏకైక ప్రతిపక్షనేతగా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రికార్డు సాధించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రిని కాల్చి చంపాలని, ఉరి తీయమంటూ జగన్ అశాంతిని రేకెత్తించే కుట్రలకు పాల్పడ్డారని అచ్చెన్నాయుడు అనుమానం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా నంద్యాల మాజీ పార్లమెంట్ సభ్యుడు గంగుల ప్రతాప్‌రెడ్డి అధికార పార్టీలో చేరుతున్నారన్న ప్రచారానికి త్వరలో ముగింపు ఉంటుందన్నారు. అయితే గంగుల చేరికపై మంత్రి భూమా అఖిలప్రియ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్న వార్తలపై మంత్రి అచ్చెన్నాయుడిని ప్రశ్నించగా, ఈ విషయంలో ముఖ్యమంత్రి ఇరువురితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారన్నారు. ఏది ఏమైనా గంగుల పార్టీలో చేరడం తెదేపాకు లాభమే అని ఆయన అన్నారు.

బాబువన్నీ కుట్రలు

• మంత్రి అఖిలప్రియ తెలుసుకోవాలి • పవన్ తటస్థ వైఖరి వైకాపాకు లాభం
• రాయలచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



నంద్యాల (పాణ్యం), కెఎన్ఎన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ ఆలోచన కుతంత్రాల వైఖరిని పర్యాటక మంత్రి అఖిలప్రియ ఇప్పుడైనా తెలుసుకోవాలని రాయచోటి వైసీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆళ్ళగడ్డలో భూమా, గంగుల కుటుంబాల మధ్య రాజకీయ రణరంగం నడుస్తుంటే నంద్యాల ఉప ఎన్నికలసమయంలో గంగుల ప్రతాప్‌రెడ్డి, చంద్రబాబు భేటీ కావడంతో స్థానిక భూమా కుటుంబీకులు నిర్ఘాంతపోయారని, కార్యకర్తలు అంశాన్ని జీర్ణించు కోలేకపోతున్నారన్నారు. మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తున్న చంద్రబాబు మీ అంతర్గత మోసానికి ప్రత్యక్షం కేబినెట్‌లో ఒక మంత్రి కానీ, ఒక ఎమ్మెల్యే కానీ లేకపోవడమేనన్నారు. భూమా నాగిరెడ్డి కుటుంబానికి వైసీపీ అధినేత జగన్మో హన్‌రెడ్డి సముచిత ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎంతో మనశ్శాంతితో రాజకీయ జీవితాన్ని అనుభవించేలా చేశారన్నారు. ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చి కొమ్ములు వాడి అన్నట్లుగా చంద్రబాబును నమ్మి మోసపోయిన వారిలో భూమా అఖిలప్రియ ఉన్నారన్నారు. ఇలా వెన్నుపోటు రాజకీయాలు ముఖ్యమంత్రికి మొదటి నుంచి అలవాటేనన్నారు. కాకపోతే కార్యకర్తలు కేడర్‌కు భద్రత లేకుండా పోతుందేమోనని భయపడుతున్నారు. గతంలో మంత్రి అఖిలప్రియ కార్యకర్తలకోసమే చంద్ర బాబు అండన చేరానని చెప్పారు. మరి ఈనాడు ఏ మొహం పెట్టుకొని ఈ రాజకీయ పరిణామా లను కార్యకర్తలకు చెబు తారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 2014లో టీడీపీకి పరోక్షంగా మద్దతు ఇచ్చి గెలుపునకు కారణమయయ్యారు. అంత మన స్సు పెట్టిన వ్యక్తి జరిగిన మూడు సంవత్సరాల చంద్రబాబు రాజకీయ పాలనను పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. పాలనలో విలువలు లేవని, నిజాయితీ కొరవ డిందని, మాట కట్టుబాటు లేదని గుర్తించిన పవన్ తటస్థంగా ఉండటం వైసీపీకి కనబడని మానసిక బలమన్నా రు. పవన్ అభిమానులు అంతర్గతంగా వైసీపీ శ్రేణులతో అనుబంధంగా ఉన్నారన్నారు.

ఓటమి భయంతోనే జగన్ ఇంటింటి ప్రచారం

• రోజాకు తన వృత్తిలో సాంప్రదాయం గుర్తుకు రాలేదా? • భూమా బ్రహ్మానందరెడ్డికి ప్రజల విశేష ఆదరణ • ఎమ్మెల్యేలు అనిత, మీసాల గీత


నంద్యాల (బండిఆత్మకూరు), కెఎన్ఎన్ : తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందని, దీంతోనే రాష్ట్ర ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డికి కూడా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత, విజయనగరం ఎమ్మెల్యే మీసాల గీతలు విమర్శించారు. గురువారం నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు మంత్రి అఖిలప్రియ చుడీదార్‌పై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సాంప్రదాయం గురించి రోజా మాట్లాడటమా అని ధ్వజమెత్తారు. రోజాకు తన వృత్తిలో తాను వేసే వస్త్రధారణపై సాంప్రదాయం గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నించారు. అసెంబ్లీ సాంప్రదాయాలకు విరుద్ధంగా తెలుగుదేశం నాయకులకు చంద్రబాబు నాయుడు స్క్రిప్ట్ రాసిస్తే చదువుతున్నారని మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోజాకు జగన్మోహన్‌రెడ్డి అలాగే స్క్రిప్ట్ రాసి ఇస్తున్నారా అని మండిపడ్డారు. రోజా పీతల సుజాతను అవమానించినప్పుడు దళితులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. అనంతరం మీసాల గీత మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం కాపు జాతికి ఒరగపెట్టింది ఏమీ లేదని విమర్శించారు. కాపులపై ముద్రగడకు అంత ప్రేమ ఉంటే మరి ఆనాడు మంత్రిగా ఉన్న సమయంలో ఇంటి వద్దకు వచ్చిన కాపులను పలకరించిన పాపాన పోలేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



ఊళ్లలో ఎత్తులు... వార్డుల్లో పైఎత్తులు

• ప్రత్యర్థి బలహీనతలపై పార్టీల ఫోకస్ • పట్టు నిలుపుకునేందుకు పకడ్బందీ ప్రణాళికలు

నంద్యాల, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికలకు గడువు సమీపిస్తున్నకొద్దీ రాజకీయ ముఖచిత్రం మారుతోంది. గత ఎన్నికలలో లభించిన ఓట్ల ఆధారంగా ప్రధాన పక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. గత ఎన్నికలలో తమకు ఎక్కువ ఓట్లు ఎక్కడ వచ్చాయి, ప్రత్యర్థి బలం ఎక్కడ వుంది, ఈసారి తమకు ఎక్కువ రావాలంటే ఏమి చేయాలనే దిశగా కసరత్తు ప్రారంభమైంది. గతంలోకన్నా భిన్నంగా నంద్యాల పట్టణంలోని ఓట్లు ఒక ఎత్తు అయితే, గ్రామీణ ప్రాంత ఓటర్లు మరో ఎత్తుగా భావిస్తున్నారు. టౌన్, రూరల్ మధ్య పోటా పోటీ గా జరుగుతున్న పోరు నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. నంద్యాల పట్టణంతో పాటు గోస్పాడు నంద్యాల రూరల్ నియోజకవర్గంలో వున్నాయి. గత సాధారణ ఎన్నికల సందర్భంగా జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తరువాత గోస్పాడు మండలం ఆళ్ళగడ్డ నుంచి నంద్యాలలో కలిసింది. అయితే గత ఎన్నికలలో నంద్యాల పట్టణంలో శిల్పా మోహన్ రెడ్డి, భూమా నాగిరెడ్డి వర్గాలు చెరి సమానంగా ఓట్లు రాబట్టుకున్నాయి. విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి భూమా నాగిరెడ్డి మెజారిటీ 3,604 ఓట్లు మాత్రమే. ఇందులో నంద్యాల రూరల్ మండలంలో ఓట్లు 2,648 వచ్చాయి. అదే విధంగా గోస్పాడు మండల పరిధిలో గెలిచిన అభ్యర్థి మెజారిటీ కేవలం 757 ఓట్లు మాత్రమే. ఈ నేపథ్యంలోనే నంద్యాల టౌన్ పరిధిని మినహాయిస్తే, రూరల్ పరిధిలో వచ్చిన మెజారిటీతోనే భూమా నాగిరెడ్డి విజయం సాధించారు. దీంతో గ్రామాల్లో తమ ఓటు బ్యాంకు చెక్కుచెదరిపోకుండా ఇరు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. నంద్యాల పట్టణంలోని 42 వార్డులు , మండలాల పరిధిలోని 35 గ్రామాలు కలుపుకుంటే నంద్యాల మొత్తం ఓటర్లు 2.19 లక్షలు . ఇందులో ఒక్క నంద్యాల పట్టణంలో 1.35 లక్షల మంది ఓటర్లు వున్నారు. ఏ పార్టీ గెలవాలన్నా ఈ పట్టణ ఓటర్ల తీర్పే కీలకం. అయితే వీరు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనేది అంచనా వేయడం కష్టంగా పరిణమించింది. గ్రామాలలో అయితే వర్గాలవారీగా ఓట్లు ఎటు పోల్ అవుతాయో చెప్పవచ్చు. కానీ పట్టణ ఓటర్ల నాడి తెలుసుకోలేక పార్టీలన్నీ తంటాలు పడుతున్నాయి. నంద్యాల రూరల్ పరిధిలో 55 వేలు, గోస్పాడులోని 29 వేల ఓట్లతో గ్రామీణ ఓటర్లు మొత్తం 84 వేల మంది వున్నారు. 1.35 లక్షల ఓటర్లు అంటే 62 శాతం పట్టణంలోనే వున్నారు. దీంతో అర్బన్, రూరల్ ప్రాంతాల ఓటింగ్ తీరు వేర్వేరుగా వుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి ఎవరు వచ్చినా తొలుత గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రారంభిస్తున్నారు. పట్టుకోసం గట్టిగా ప్రయత్నిస్తున్న ప్రధాన పక్షాలు ఆపరేషన్ ఆకర్ష్ పేరుతో వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. సామాజిక సమీకరణల ప్రాతిపదికన నంద్యాల పట్టణంలో ప్రచారంచేస్తున్నారు.




అదే విధంగా రూరల్ ప్రాంతాలలో సామాజిక వర్గాలతో పాటు తమతో కలిసి వచ్చే వివిధ గ్రూపులకు చెందిన నాయకులపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నారు. నంద్యాల పట్టణంలో ప్రధాన పార్టీలు ప్రధానంగా మైనారిటీ, వైశ్య, ఓసీ, బీసీ, బలిజ, ఎస్సీ సామాజిక వర్గాలపై ప్రత్యేకమైన ఫోకస్‌ను పెట్టడం జరిగింది. ఈ పరిస్థితులలో నంద్యాల అర్బన్ ప్రాంతాలలో పోటీ నువ్వా, నేనా అన్న ట్టుగా సాగుతోంది. అధికారపక్షానికి చెందిన మంత్రులతో పాటు వైఎస్సార్‌సిపికి చెం దిన ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రత్యేకంగా దృష్టి సారించారు. మెజారిటీ రాక పోయినా అర్బన్ ప్రాంతంలో సరిసమానంగా ఓట్లు రాబట్టాలనే దిశగా ప్రచారం కొనసాగుతోంది. కాగా రూరల్ ప్రాంతాలలోనూ పోటీ రసవత్తరంగా మారింది. గోస్పాడు మండలపరిధిలోని పర్వతపురం, కానాలపల్లి, ఎస్.నాగులవరం, నెహ్రూ నగర్, ఎం.చింతకుంట్ల, జూలేపల్లి, పసురపాడు, తేల్లపురితోపాటు వంటి వెలగల, గోస్పాడు, జిల్లెల, యల్లూరు, గ్రామాలపై వైఎస్సార్‌సిపి ప్రత్యేకమైన ఫోకస్ పెట్టింది. అలాగే బి.వి.నగర్, యల్లూరు, పర్వతపురం, దీబగుంట్ల, కానాలపల్లి, ఎస్. కులూరు, గోస్పాడు, ఎం.కృష్ణాపురం, జిల్లెల, పర్వతపురం, కానాలపల్లి, పసుర పాడు, ఎస్.నాగులవరం, జూలేపల్లి వంటి గ్రామాలపై తెలుగుదేశం పార్టీ దృష్టి సారించింది. నంద్యాల రూరల్ పరిధిలో పోలూరు, మునగాల, రాయమల్‌పురం, పులిమద్ది, బీమవరం, కొత్తపల్లి, బిల్లాలపురం, పెద్దకొట్టాల, క్రాంతినగర్, ఉడు ములపురం, పాండురంగపురం, మిట్నాల, బ్రాహ్మణపల్లి, పుసులూరు, గుంతనాల, కానాల, హెచ్.ఎస్.కొట్టాల, రైతునగరం, పొన్నాపురం, పొన్నాపురం కాలనీ, చాబో లుతో పాటు ప్రాంతాలపై వైసీపీ దృష్టిపెట్టింది. రూరల్ పరిధిలోని చాబోలు, పొన్నా పురం కాలన, అయ్యలూరు, రైతునగరం, కానాల, కొత్తపల్లి, బిల్లాలపురం, వెంక టేశ్వరపురం, చాపిరేవుల, మిట్నాల , క్రాంతినగర్ పెద్దకొట్టాల వంటి ప్రాంతా లపై తెలుగుదేశం పార్టీ దృష్టిసారించింది. వైసీపీ కూడా అర్బన్, రూరల్ ప్రాంతాలు గా ఎన్నికల వ్యూహాన్ని అమలు చేయడం జరుగుతోంది. కాగా తెలుగుదేశం పార్టీ కూడా అర్బన్, రూరల్ ప్రాంతాలకు వేర్వేరుగా వ్యూహాలను అమలు చేస్తోంది. ప్రతి గడప కు పార్టీ పథకాలు చేరేలా ప్రచారం నిర్వహిస్తోంది. నంద్యాల అర్బన్‌తోపాటు గ్రామీణ ప్రాంతాలైన నంద్యాల రూరల్, గోస్పాడులో కూడా మెజారిటీ సాధించే దిశగా వ్యూహరచన చేస్తోంది.

నాబార్డు ని'బంధనాల'తో
పోల'వరం'కు జాప్యం?!

(మొదటిపేజీ తరువాయి)

పోలవరాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి జాతికంకితం చేస్తామని కూడా చంద్రబాబు ప్రకటిస్తున్నార.ు ఇంతవరకు బానేఉన్నా బ్యాంక్ ద్వారా రుణాలు మంజూరుచేయించుకుని బ్యాంక్ నియమ నిబంధనలన్నీ తూచ తప్పకుండా పాటిస్తూ నిర్మాణం సాగిస్తే అదిప్పట్లో పూర్తికాదు. అనుకున్న సమయానికి కొంత భాగాన్ని కూడా నిర్మించే అవకాశముండదు. అదే నేరుగా కేంద్రమే ప్రాజెక్ట్ నిర్మాణాన్ని చేపట్టుంటే మరింత వేగంగా పనులు జరిగేవి. అలాగే నిధులు కూడా వివిధ రూపాల్లో వచ్చి చేరుండేవి. అయితే నిర్మాణాన్ని తామే చేపడతామంటూ రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఇదే ఈ సరికొత్త తలనొప్పులకు దారితీస్తోంది.



వాస్తవానికి పోలవరం గత ఎనిమిది దశాబ్ధాల తెలుగుప్రజల చిరకాల వాంఛ. వైఎస్ హయాంలో దీనికి కుడి, ఎడమకాలువల నిర్మాణం చేపట్టారు. అయితే ప్రధాన ప్రాజెక్ట్ జోలికివూత్రం వెళ్ళలేదు. ఈ దశలో రాష్ట్ర విభజన అనివార్యమైంది. ఉభయప్రాంతాల ప్రజలు చెమటోడ్చి పెట్టుబడులు పెట్టి అభివృద్ధిపర్చుకున్న హైదరాబాద్ నగరం పూర్తిగా తెలంగాణాకే ఇవ్వాలని అప్పటికేంద్రం నిర్ణయించింది. ఇందుకు బదులుగా పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయహోదా కల్పించేందుకు సమ్మతించింది. ఈవిధంగా పోలవరానికి ఈ హోదా దక్కింది. అంతేతప్ప ప్రజల డిమాండ్ మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోలేదు. అయితే ఈ అంశాన్ని రాష్ట్రపునర్విభజన చట్టంలో పేర్కొన్నప్పటికీ అనంతరం ఏర్పడిన ఎన్‌డిఎ ప్రభుత్వం దీని అమలుకు అనేకనిబంధనలు విధించింది. ప్రాజెక్ట్ అంటే అటూ ఇటూ తవ్వే కాలువల్తో తమకు సంబంధంలేదంది. కేవలం నదికి అడ్డంగా కట్టే ఆనకట్ట నిర్మాణానికయ్యే వ్యయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అదికూడా 2014 జూన్ 2వ తేదీ నాటికున్న వ్యయ అంచనాల మేరకే నిధులిచ్చేందుకు సమ్మతిచ్చింది. ప్రపంచంలో ఎక్కడ భారీ ప్రాజెక్టులు నిర్మించినా అందులో జలవిద్యుత్ కేంద్రాన్ని కూడా నెలకొల్పుతారు. వేగంగా వచ్చిపడే నీటి నుంచి విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యతనిస్తారు. అలాగే పోలవరం డిజైన్లో 960మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం కూడా ఉంది. అయితే కేంద్రం దీంతో కూడా తమకు సంబంధంలేదని తేల్చేసింది. ఇక ఆనకట్ట నిర్మాణం వరకే చెల్లింపులు చేసేందుకు ముందుకొచ్చింది. అంతవరకూ బాగానే ఉన్నా ఈ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేందుకు ముందుకురావడంతో మరో మెలికెట్టింది. నాబార్డ్ రుణం సమకూర్చేలా ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు మొత్తాన్ని కేంద్రం నాబార్డ్‌కు చెల్లిస్తామనిపేర్కొంది. సహజంగా జాతీయ హోదా పొందిన ప్రాజెక్టుల నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలి. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 90శాతం కేంద్రం భరిస్తే మిగిలిన పదిశాతాన్ని సదరు రాష్ట్రప్రభుత్వాలు పెట్టుబడిగా పెట్టాలి.

ఈ క్రమంలో మొత్తం ప్రాజెక్ట్ వ్యయాన్ని భరించడంతో పాటు అంతవరకు చేసిన వ్యయంలో పదిశాతం వాటాను మినహాయించి మిగిలిన సొమ్మును రాష్ట్రానికి జమ చేయాలి. అయితే నిర్మాణ క్రమాన్ని తామే చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకురావడంతో ఈ వెసులుబాట్లన్నింటిని కేంద్రం పక్కనపెట్టేసింది. నిర్మాణ బాధ్యతను రాష్ట్రానికే అప్పగించింది. రాష్ట్రం కూడా ఈ ఒక్క అవకాశంతోనే ఉబ్బితబ్బుయింది తప్ప మిగిలిన అంశాల జోలికి పోవడంలేదు. ఇప్పటికే నాబార్డ్ సువూరు 2800కోట్ల ఆర్ధికసాయాన్ని పోలవరానికి అందించింది. మరో 2600కోట్లు త్వరలోనే అందజేయనుంది. అయితే ఇందుకోసం ముఖ్యమంత్రి పదే పదే ఢిల్లీకెళ్ళి సంబంధిత మంత్రి ఉమాభారతిని ప్రాధేయపడాల్సొస్తోంది. అదే ప్రాజెక్ట్ నిర్మాణ క్రమంలో రాష్ట్రం కల్పించుకోకుండా కేంద్రాన్నే పూర్తి చేయమని నిర్దేశించుంటే పరిస్థితి మరోలా ఉండేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గడువులోగా పనులెందుకు పూర్తికావడంలేదంటూ కేంద్రాన్ని రాష్ట్రం నిలదీసే పరిస్థితుండేది. అలాగే నిర్మాణ క్రమంలో లోపాల్ని ఎత్తిచూపే అవకాశాలు కూడా రాష్ట్రం వద్దే ఉండేవి. కానీ ఇప్పుడు కేంద్రమే నిర్మాణ జాప్యంపై రాష్ట్రాన్ని నిలదీస్తున్న పరిస్థితేర్పడింది. పైగా నిర్మాణంలోని నాణ్యతాప్రమాణాలపై కేంద్రం విచారణలు చేపడుతోంది. నిర్మాణపరంగా వెల్లువెత్తే ప్రతి అంశంపైన రాష్ట్రం నుంచి వివరణలు కోరుతోంది.

జాతీయ హోదా విధివిధానాలకనుగుణంగా మొత్తం ప్రాజెక్ట్ నిర్మాణంలో 90శాతాన్ని కేంద్రమే భరించేలా ఒప్పించాలి. అలగే జలవిద్యుత్ కేంద్రం నిర్మాణ వ్యయాన్ని కూడా ప్రాజెక్ట్‌లో చేర్చాలి. అలాగే ఇరువైపులా కాలువలపై నిర్మించిన భారీ ఎత్తిపోతల పథకాల నిర్మాణ వ్యయాన్ని కూడా కేంద్రం తిరిగి చెల్లించాలి. అప్పుడే హైదరాబాద్‌ను పోగొట్టుకున్నందుకు ప్రతిఫలంగా యుపిఎ మంజూరు చేసిన పోలవరం జాతీయ హోదాకు సార్ధకతేర్పడుతుంది. చిన్న చిన్న వెసులబాట్ల కోసం భారీ ప్రయోజనాల్ని ప్రభుత్వం వదులుకుంటే భవిష్యత్‌లో తీరని నష్టానికి జవాబుదారికాకతప్పదని పరిశీలకులు సూచిస్తున్నారు.కేంద్రం కూడా నాబార్డ్ ద్వారా కాకుండా నేరుగా నిధులిస్తే నిర్మాణ క్రమంలో జాప్యం తగ్గుతుంది. చంద్రబాబు ఆశించిన విధంగా నిర్దిష్ట సమయానికి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుందని వీరు పేర్కొంటున్నారు.

నిరుపయోగ బోరుబావులను మూసేయండి

యువతకు సీఎం చంద్రబాబు పిలుపు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో నిరుపయోగంగా ఉన్న బోరుబావులను తక్షణమే మూసివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. గుంటూరుజిల్లా వినుకొండ మండలం ఉమ్మిడివరంలో బోరుబావిలో పడిన చిన్నారిని ప్రాణాలతో కాపాడిన ఘటనను ఒక కేస్‌స్టడీగా తీసుకొని ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించాలని సిఎం ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాల యంలోఉమ్మిడివరం బోరుబావి ఘటనలో ప్రాణాలతో బయటపడ్డ బాలుడు చంద్రశేఖర్‌ను వారి తల్లితండ్రులను మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్‌లు తమ వెంట తీసుకొని వచ్చి సిఎంను కలిశారు. ఈసందర్భంగా చంద్రబాబు బాలుడు చంద్రశేఖర్‌ను ఎత్తుకొని క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు జిల్లా బోరుబావి ఘటనలో మృత్యుంజయుడైన బాలుడు చంద్రశేఖర్‌కు ముఖ్యమంత్రి రూ.2 లక్షల ఆర్ధిక సహాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఫిక్సడ్ డిపాజిట్ రూపంలో చంద్రశేఖర్ తల్లితండ్రులకు అందజేయాలని సంబంధిత ఉన్నాతాధికారులను సిఎం ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో మరెక్కడా తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడైనా నిరుపయోగంగా ఉన్న బోరుబావులను యువత ఎవరైనా గుర్తించినట్లయితే తక్షణమే ఫొటోలు తీసి ప్రభుత్వానికి సోషల్ మీడియా ద్వారా పోస్టు చేయాలని సూచించారు. ఇలా చేసిన వారికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలను అందజేస్తుందని ప్రకటించారు. ఎవరైనా తమ వ్యవసాయ క్షేత్రాలు, నివాస ప్రాంతాలలో నిరుపయోగంగా ఉన్న బోరు బావులను నిర్లక్ష్యంగా వదిలేసి చిన్నారుల ప్రాణాలో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకంజ వేయదని హెచ్చరించారు. రాష్ట్రంలో నీళ్లు పడని బోర్లకు సంబంధించిన వివరాలను ఆయా జిల్లా యంత్రాంగం సేకరించిన తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. ఎప్పుడైనా ఇటువంటి విపత్తులు ఎదురైన సమయంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో వ్యవహరించి సమయానుకూల వ్యూహాలను అనుసరిస్తే సానుకూల ఫలితాలు వస్తాయని చెప్పడానికి గుంటూరు జిల్లా ఉమ్మిడివరంలో జరిగిన ఘటన చాటి చెప్పిందని సిఎం వ్యాఖ్యానించారు. సాధారణంగా ఇటువంటి ఉపద్రవాలు ఎదురైన సమయంలో ఎన్‌డిఆర్ఎఫ్, గ్రేహౌండ్స్, అక్టోపస్, ఫైర్ సర్వీసెస్, హెల్త్, పోలీస్, జిల్లా రెవెన్యూశాఖలు కలిసి సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు దక్కుతాయన్నారు. 15 అడుగుల మేర బోరుబావిఓ 11 గంటల పాటు జీవన పోరాటం చేసి మృత్యుంజయుడై తిరిగి వచ్చిన ఏడాది 9 నెలల చిన్నారి చంద్రశేఖర్‌ను ముఖ్యమంత్రి ఎత్తుకొని ముద్దాడి మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. చిన్నారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ రూ. 2 లక్షల ఆర్ధిక సహాయాన్ని సిఎం ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఫిక్సడ్ డిపాజిట్ చేసి 20 ఏళ్లకి రూ. 20 లక్షలు అయ్యాక అతనికి అందేలా ఏర్పాట్లు చేయాని ఉన్నతాధికారులకు సిఎం సూచించారు. బాలుడు చంద్రశేఖర్ తల్లితండ్రులతోపాటు మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

జనసేన విద్యార్థి, మహిళా విభాగాలు

అక్టోబర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన పవన్ కల్యాణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యార్థి, మహిళా విభాగాలను ఏర్పాటు చేసే యోచనలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఈ రెండు విభాగాలను త్వరలోనే నియమిస్తామని ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఈ రెండు విభాగాల ఏర్పాటుకు విధి విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా, విద్యార్థి విభాగాలను అక్టోబర్ నెలలో ఆచరణలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని ఒకవేళ వీలుకాని పక్షంలో ఈ ఏడాది చివరకు ఈ రెండు విభాగాల కమిటీలను ప్రకటిస్తామని చెప్పారు. ఇప్పటికే జనసేన సేవాదళ్ విభాగాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎంతోమంది జనసేన పార్టీకి సేవ చేసేందుకు మందుకు వస్తున్నారని విద్యార్థి, మహిళలు సైతం అనుబంధ విభాగాలను ఏర్పాటు చేయాలంటూ కోరుతున్నారని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నుంచి తాను క్రియాశీలకంగా రాజకీయాల్లో ఉంటానని చెప్పిన సంగతి తెలిసిందే. అనుబంధ విభాగాలన్నింటినీ బలోపేతంచేసి వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలన్న యోచనలో పవన్ కళ్యాణ్ ఉన్నారు. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు తాము సిద్ధమవుతున్నామని ఈలోపు జరిగే ఏ ఎన్నికలోనూ తాము పాల్గొనబోమని ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. నంద్యాల ఉపఎన్నిక, కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికకు తాము దూరంగా ఉంటామని ప్రకటించారు.

నగర సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడలపై కళాత్మక చిత్రాలు

● బహిరంగ ప్రదేశాలు గోడలపై పోస్టర్ల నిషేధం ● పోస్టర్ ఫ్రీ సిటీగా రాజమహేంద్రవరం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో సుందరీకరణ, ఆనంద ఆదివారాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మనిషి జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ఈ రెండు ఉపయుక్తంగా ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెదడులో మెదిలిన ఆలోచనలకు అనుగుణంగా 13 జిల్లాల్లోని కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో స్వచ్ఛాంధ్ర, ఆనంద ఆదివారం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో 14 కార్పొరేషన్లు, 96 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలుండగా 5 మున్సిపాల్టీలు తప్ప, మిగిలిన అన్ని చోట్లా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో నెలకు రెండుసార్లు ఆనంద ఆదివారాలను నిర్వహిస్తూ అక్కడి ప్రజలు ఉత్సాహంగా పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా యోగా, నృత్యాలు, పలు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాన్ని ఆకట్టుకుంటున్నారు. ఈ కార్యక్రమాలను మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు సినీనటులు, క్రీడాకారులు పాల్గొని వారిలో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగంగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీలను పోస్టర్స్ రహిత నగరాలుగా తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. దీనిలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రహరీగోడలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, బస్‌స్టాప్‌లు, వాణిజ్య కూడళ్లల్లో పోస్టర్లు, పలు రకాలైన ప్రకటనలను నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కార్పొరేషన్లలో రూ.4 వేలు, మున్సిపాల్టీల్లో రూ.2 వేలు అపరాధ రుసుం కూడా వసూలు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టర్ రహిత నగరాల్లో రాజమహేంద్రవరం ఉత్తమ నగరంగా ఎంపికైంది. అదేవిధంగా విజయవాడ, నెల్లూరు, తిరుపతి నగరాలు కూడా పోస్టర్స్ రహితంగా చేయడంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వం, ప్రైవేటు భవనాలు, ప్రహరీగోడలు, వంతెనల పిల్లర్లపై ఆయా నగరాలకు అనుగుణంగా సుందరమైన, వినూత్నమైన చిత్రాలను రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో స్వచ్ఛాంధ్ర పథకంలో భాగంగా పోస్టర్లను నివారించి, పెయింటింగ్స్‌తో సుందరీకరిస్తున్నారు. స్థానికంగా ఉండే వనరులతో ఈ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా ఆయా మున్సిపాల్టీల్లో ఉండే స్వచ్ఛంధ సేవా సంస్థలు, రోటరీ, లయన్స్‌క్లబ్‌లు, ఎన్జీవోల భాగస్వామ్యంతో నగర సుందరీకరణను చేపడుతున్నారు. గోడలపై అందమైన చిత్రాలు, స్థానిక సంస్కృతికి అనుగు ణంగా పెయింటింగ్స్‌ను రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు 56 మున్సిపాల్టీల్లో ఈ కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన జరుగు తోంది. నాణ్యతలో లోపంలేకుండా ఈ కార్యక్రమా న్నిచేప డుతున్నారు. ముందుగా ఆయా పట్టణాల్లోని ముఖ్యకేంద్రాలను గుర్తించి, ఆ ప్రదేశాల్లో పోస్టర్లు తొలగించి పెయింటింగ్స్‌తో నింపుతున్నారు. కళాత్మకత ఉట్టిపడేవిధంగా అక్కడి చిత్రకారులతో చిత్రాలను వేయిస్తున్నారు.

గవర్నర్ నరసింహన్‌తో
కేంద్ర మంత్రి సుజనా భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి వై.సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) గురువారం రాజ్‌భవన్‌లో ఉభయ రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ కూడా గవర్నర్‌తో భేటీ అయ్యారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా చేపట్టిన ఉద్యోగ నియామకాల ప్రక్రియకు సంబంధించి నివేదికను సమర్పించారు. సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన మేరకు లక్షా 12 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ రేస్తే ప్రభుత్వ ఖజానాపై పడే ఆర్థిక భారం, పరిపాలనా విధానాల్లో మెరుగు, ప్రజల్లో పెరుగనున్న నమ్మకం తదితర అంశాలపై చర్చించినట్లు తెలు స్తోంది.

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలకు హైకోర్టు పచ్చజెండా

● ఎన్నికలపై స్టే నిరాకరణ ● తుది తీర్పునకు లోబడి ఎన్నికల ఫలితాలు

హైజరాబాద్,ఆంధ్రప్రభ : కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వాహణకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. ఎన్నికల ప్రక్రియపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేయాలంటూ దాఖలైన అనుబంధ వ్యాజ్యాలను హైకోర్టు కొట్టి వేసింది. ఈ పిటిషన్లపై కోర్టు ఇచ్చే తుది తీర్పునకు కట్టుబడి ఎన్నికల ఫలితాలుంటాయని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రదాన పిటిషన్లపై ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తోపాటు ఏపీ సర్కారును హైకోర్టు ఆదేశించింది.

ఈ ఎన్నికల పిటిషన్లను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్ రావు ఈ వ్యాజ్యాలపై గురువారం మరోసారి విచారణ చేపట్టి, ఈ మేరకు మధ్యంత ర ఉత్తర్వులు జారీ చేశారు తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు. కాకినాడ నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించేందుకు సీట్ల నిర్ధారణ,వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ఖరారు కు సంబంధించి మున్సిపల్ శాఖ ఈ నెల 2న జారీ చేసిన జీ వో,అందుకు అనుగుణంగా ఈ నెల 3న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ను సవాలు చేస్తూ హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. హైకోర్టు ఇటీవల రెండు వార్డులకు చెందిన మూడు గ్రామాలను కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయడాన్ని నిలుపుదల చేసిందని పిటిషనర్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ లో 50 వార్డులుండగా ప్రస్తుతం కేవలం 48 వార్డులకు మాత్రమే ఎన్నికలు చట్ట విరుద్ధంగా ప్రకటించాలని పిటిషనర్లు అభ్యర్థించారు. మరో వైపు కాకినాడ మేయర్ పదవిని ఏ రిజర్వేషన్ అభ్యర్థికి కేటాయించారో కూడా స్పష్టత లేకుండానే ఎన్నికలు జరపడం సరికాదని మరో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్లపై గత 10న విచారణ జరిపిన న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే వ్యవహారంలో నిర్ణయాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే. అయితే గురువారం జరిపిన విచారణ సందర్భంగా .. ఎన్నికలను ఆపాలంటూ దాఖలైన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టి వేశారు. ప్రధా న పిటిషన్లపై తదుపరి విచారణ సెప్టెంబర్ రెండవ వారానికి వాయిదా వేశారు. ఈ సంగర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి . శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ .. .ఒక సారి ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత ఆ ప్రక్రియను నిలువరిం చడానికి చట్ట నిబంధనలు అనుమతించవని విన్నవించారు. ఏపీ ఏజీ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ చేసిన వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించారు. ఎన్నికల ప్రక్రియ పై స్టే విధించాలంటూ దాఖలైన రెండు వ్యాజ్యాలను న్యాయమూర్తి కొట్టి వేశారు. తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా వేశారు

ఆయేషా కేసు పునర్విచారణపై కోర్టులో పిటిషన్

● వాదనలు వినిపించిన ప్రభుత్వ న్యాయ సలహాదారు ● విచారణ నేటికి వాయిదా ● డీజీపీని కలిసిన సిట్ బృందం



అమరావతి, ఆంధ్రప్రభ : ఉమ్మడి రాష్ట్రాల్లో సంచలనం కలిగించిన ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నియమించినట్లు విజయవాడలోని నాలుగో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం ప్రభుత్వ ముఖ్య న్యాయసలహాదారు పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వం సిట్ అధిపతిగా విశాఖపట్టణం రేంజ్ డిఐజీ శ్రీకాంత్‌తో పాటు డీఎస్పీలు హైమావతి, లక్ష్మీ, ఇన్‌స్పెక్టర్ సహేరా బేగంను నియమించినట్లు కోర్టుకు వివరాలు అందజేశారు. 2007 అక్టోబర్‌లో పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని శ్రీదుర్గా హాస్టల్‌లో ఆయేషా మీరా హత్య, అత్యాచారం కేసుపై రాజకీయ ప్రకంపనల నేపథ్యంలో అప్పటి పోలీసు కమిషనర్ సీ.వీ.ఆనంద్ ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు ఇబ్రహీంపట్నంతో పాటు పశ్చిమ కృష్ణాలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలను జల్లెడ పట్టారు. పాత కేసుల్లోని నేరస్తులతో పాటు పాతికేళ్ల లోపు యువకులను అదుపులోకి తీసుకొని పోలీసు తరహా విచారణ నిర్వహించారు. అనేక మందిని విచారించినప్పటికీ పోలీసులకు తగిన ఆధారాలు దొరకలేదు. సత్యశోధన పరీక్షలకు సైతం పోలీసులు నిర్ణయించారు. ఈ క్రమంలోనే నందిగామ మండలం అనాసాగరం గ్రామానికి చెందిన పిడతల సత్యంబాబును నిందితునిగా పేర్కొంటూ అరెస్టు చేశారు. అప్పట్లో ఆయేషా మీరా తల్లిదండ్రులతో పాటు ప్రజా, విద్యార్థి సంఘాలు సత్యంబాబును అరెస్టు చేయడం పట్ల పోలీసుల చర్యలను తప్పుబట్టారు. ఆయేషా మీరా తల్లిదండ్రలు సీబీఐ విచారణకు డిమాండ్ చేయడంతో పాటు మాజీమంత్రి కోనేరు రంగారావు కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేశారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కేసు పునర్విచారణ చేపట్టనున్నట్లు ఆయేషా మీరా తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది మార్చి 31న ఆయేషా మీరా కేసులో అరెస్టు చేసిన సత్యంబాబును నిర్ధోషిగా పేర్కొంటూ హైకోర్టు తీర్పును వెలువరించింది. ఇదే సమయంలో కేసు పునర్విచారణపై పలువార్లు ప్రభుత్వపరంగా చర్చలు జరిగాయి.కేసులో వాస్తవాల నిర్ధారణకు పునర్విచారణ కోరుతూ డీజీపీ నండూరి సాంబశివరావు ప్రభుత్వానికి లేఖ రాశారు. డీజీపీ లేఖ ఆధారంగా ఈ నెల 4న ప్రభుత్వం సిట్ ఏర్పాటుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విషయాన్ని గురువారం ప్రభుత్వ ముఖ్య సలహాదారు నాగ రఘు నాలుగో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో గురువారం సిట్ అధిపతి శ్రీకాంత్, ఇతర సభ్యులు డీజీపీ నండూరి సాంబశివరావును కలిశారు. అనంతరం ఆయనతో పాటు కలిసి మంగళగిరిలోని నూతన పోలీసు ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. కేసు పునర్విచారణ, సిట్ అధికారుల వివరాలతో కూడిన ఫిటీషన్‌ను ప్రభుత్వ న్యాయ సలహాదారు నాగ రఘు కోర్టుకు అందజేసి వాదనలు వినిపించారు. ఫిటీషన్‌పై తదుపరి వాదనల కోసం మేజిస్ట్రేట్ శుక్రవారానికి విచారణను వాయిదా వేశారు.

రూ. 200 కోట్లతో అర్చక సంక్షేమ నిధి

● జీతాలు తగ్గించే ఆలోచనే లేదు ● టీటీడీ నిధులు దేవాలయాలకే వినియోగం

● స్టేలపై కోర్టుకు వెళతాం ● దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

తిరుపతి, కెఎన్ఎన్ బ్యూరో: రాష్ట్రంలో అర్చకత్వంపై జీవించేవారి సంక్షేమం కోసం రూ. 200 కోట్లతో అర్చక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు వెల్లడించారు. స్థానికపద్మావతి అతిథి గృహంలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్చకుల జీతాలను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారాన్ని ఖండించారు. అటువంటి ఆలోచనే తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. దీప దూప నైవేధ్య పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా వివిధ చిన్న చిన్న దేవాలయాల్లో పనిచేసే 1,370 మంది అర్చకులకు రూ. 5 వేలు, 1,458 మంది అర్చకులకు రూ. 10 వేలు చొప్పున వేతనాలను చెల్లిస్తున్నామని తెలిపారు. 6ఎ కేటగిరి కింద ఉన్న పెద్ద దేవాలయాల్లో పనిచేసే అర్చకులు రూ. 10 వేలకన్నా ఎక్కువగానే జీతాలు ఇస్తున్నారన్నారు. కానీ రూ. 2 లక్షల లోపు ఆదాయం వచ్చే 6సి దేవాలయాల్లో పనిచేసే అర్చకులు తమను కూడా దేవాదాయశాఖ పరిధిలో జీతాలు ఇవ్వాలని కోరుతున్నారని పేర్కొంటూ ,వారి సంఖ్యను అధ్యయనం చేసి వారందరికీ కూడా జీతాలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇదికాక అర్చకత్వంపైనే ఆధారపడి జీవించే కుటుంబాల సంక్షేమం కోసం రూ. 200 కోట్లతో అర్చక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలనే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో ప్రభుత్వ గ్రాంటు రూపంలో రూ. 100 కోట్లు, దేవాదాయశాఖ విరాళరూపంలో రూ. 50 కోట్లు, టీటీడీ ద్వారా రూ. 50 కోట్లు చొప్పున సమీకరించాలనే ఆలోచన వుందని, త్వరలో పూర్తి స్థాయి ప్రణాళికలను తయారుచేసి ప్రకటిస్తామని మంత్రి మాణిక్యాలరావు తెలిపారు. రాష్ట్రంలో జీర్ణోద్ధరణకు నోచుకోని పురాతన ఆలయాల విషయంలో పురావస్తుశాఖ పరమైన సమస్యలు ఆటంకమవుతున్నాయన్నారు. అయితే ఈ విషయంలో పార్లమెంటు ద్వారా ప్రత్యేక చట్టం చేయించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. టీటీడీ నిధులను మళ్లిస్తారనే అంశంపై జారీ చేసే జీవీలపై కోర్టులు స్టేలు ఇస్తున్న అంశాన్ని ప్రస్తావించగా, టీటీడీ నిధులను ప్రభుత్వ అవసరావలకు వినియోగించడానికి మళ్లిస్తే తప్పవుతుంది కానీ దేవాలయాల అభివృద్ధికి, హిందూ ధర్మప్రచారాలకు విని యోగిస్తే తప్పెలా అవుతుందని ప్రశ్నిస్తూ ఆ స్టేలను తొలగింప చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అయినా ప్రభుత్వం సీజీఎఫ్ కోసం అడిగిన రూ. 25 కోట్ల నిధుల్లో ఒక్క పైసా కూడా టీటీడీ ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. దేవాలయాలకు కేటాయించే నిధుల్లో కేవలం 9 శాతం మాత్రమే దేవాదాయశాఖ తీసుకుంటుందని, మిగిలిన మొత్తంలో 11 శాతం జీతభత్యాలకు పోగా 80 శాతం నిధులు దేవాలయాల అవసరాలకు వినియోగిస్తున్నామని తెలిపారు. తిరుమలేశుని హుండీలో భక్తులు వేసినరద్దయిన పెద్దనోట్ల విషయం గురించి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ చెల్లవని తెలిసిన తర్వాత భక్తులు వాటిని హుండీలో వేయడాన్ని ఆయన తప్పు పట్టారు. అయినా ఈ విషయంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని సంప్రదిస్తామన్నారు. అందరికీ ప్రముఖ హిందూ దేవాలయాల సందర్శన అవకాశం కల్పించేదివ్యదర్శనం పథకానికి విశేష స్పందన లభిస్తోందని పేర్కొంటూ భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల దేవాలయాలకు విస్తరించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. టీటీడీ ధర్మకర్తల మండలిని త్వరలో నియమిస్తామని, ప్రభుత్వం నుంచి కావాల్సిన స్థల సేకరణ పూర్తి కాగానే తిరుపతి వద్ద నిర్మించే వకుళాపుర క్షేత్ర నిర్మాణం పనులు మొదలవుతాయని మంత్రి మాణిక్యాలరావు తెలిపారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 18 ఆగస్టు 2017

చారిత్రక తప్పిదాలు మార్క్సిస్టులకు అలవాటు!

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం చారిత్రక తప్పిదమని మార్క్సిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ యేచూరి తాజాగా ప్రకటించడం విడ్డూరమే.రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరిగిన పదిహేను మాసాల తర్వాత ఆయన ఈ వ్యాఖ్య చేయడానికి తాజాగా జరిగిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలే ప్రేరణ కావచ్చు. గత ఆదివారం తూర్పు మిడ్నపూర్‌తో సహా పలు జిల్లాల్లో ఏడు మునిసిపల్ సంస్థల్లోని 148 వార్డుల్లో 140 వార్డులను రాష్ట్రంలో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఆ మునిసిపల్ సంస్థల్లో ఒక్క వార్డులో కూడా గెలవకపోవడం రాష్ట్రంలో మార్క్సిస్టు పార్టీ దైన్య స్థితిని తెలియజేస్తోంది. మూడున్నర దశాబ్దాలు పైగా రాష్ట్రంలో తిరుగులేని రీతిలో అధికారంలో కొనసాగిన మార్క్సిస్టు పార్టీకి రాష్ట్రంలో ఇప్పుడు దిశానిర్దేశం చేసే నాయకులెవరూలేరు. పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య హయాంలోనే పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఇప్పుడు రాష్ట్రంలో పార్టీకి నేతృత్వం వహిస్తున్న సూర్యకాంత్ మిశ్రాకు పార్టీ శ్రేణులు,కార్యకర్తల సహకారం లేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. మార్క్సిస్టు ఫ్రంట్ అధినేతగా తనదైన రీతిలో పరిపాలన సాగించిన మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు గతంలో ప్రధానమంత్రి పదవిని చేపట్టే అవకాశం వచ్చినప్పుడు వెనక్కి తగ్గారు. అలా తగ్గడాన్ని ఆ పార్టీ ఆ తర్వాత చారిత్రక తప్పిదంగా అభివర్ణించింది.కాంగ్రెస్ మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ కేంద్రంలో అధికారంలో ఉన్నది కొద్ది కాలమే.ఆ సమయంలో ప్రధానమంత్రి పదవిని జ్యోతిబసుకి ఇవ్వజూపగా,ఆయన నిరాకరించారు. ఆ సమయంలో కేంద్రంలో చక్రం తిప్పిన తెలుగుదేశం అధ్యక్షుడు,ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కూడా అటువంటి ఆఫర్ వచ్చింది.అయితే,ఆయన తనసేవలు రాష్ట్రా నికే పరిమితమని బరిలోంచి తప్పుకున్నారు. జ్యోతిబసు,చంద్రబాబు ఇద్దరూ కూడా నిరాకరించడంతో కర్నాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి దేవెగౌడ ప్రధానమంత్రిగా కొద్ది కాలంపాటు బాధ్యతలు నిర్వహించారు.కాంగ్రెస్ ఇచ్చే మద్దతుపై అనుమానాలు ఉండటం వల్లనే జ్యోతి బసు ఆనాడు నిరాకరించారు.అయితే,2004 ఎన్నికల ముందు బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా దూరంగా ఉంచడం కోసం కాంగ్రెస్‌కు మార్క్సిస్టు పార్టీ దగ్గరైంది. యూపీఏ -1 ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇచ్చింది. మార్క్సిస్టు పార్టీ మొదటి నుంచి కాంగ్రెస్‌కు బద్ధవిరోధి. తమ ప్రధాన శత్రువు కాంగ్రెస్సేనని మార్క్సిస్టు నాయకులు తరచూ ప్రకటించేవారు.అలాంటి పార్టీలో ఒక్కసారిగా ఈ మార్పు రావడానికి ఆనాడు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న హరికిషన్‌సింగ్ సూర్జిత్ కారణం. ఆయనతో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఎక్కువ సన్నిహితంగా ఉండేవారు. బీహార్ ఎన్నికలకు ముందు బిజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి ఏర్పాటు కోసం జనతాదళ్(యు) నాయకుడు,ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ని ఒప్పించినట్టే, ఆనాడు సూర్జిత్‌ని లాలూయే ఒప్పించినట్టు కథనాలు వెలువడ్డాయి. ఆ విధంగా కాంగ్రెస్‌కి దగ్గరైన మార్క్సిస్టు పార్టీ యూపీఏ-1 ప్రభుత్వానికి చివరి సంవత్సరంలో మద్దతును ఉపసంహరించుకుంది.అమెరికాతో ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ పౌరఅణు ఒప్పందం కుదుర్చుకోవడానికి వెళ్ళినప్పుడు యూపీఏ-1 ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. అలా దూరమైన తర్వాత మళ్ళీ కాంగ్రెస్ వైపు మార్క్సిస్టు పార్టీ దృష్టి కేంద్రీకరించడానికి ప్రస్తుత ప్రధానకార్యదర్శి సీతారామ్ యేచూరి ఎత్తుగడే కారణం.పశ్చిమ బెంగాల్‌లో మరో సారి అధికారం కోసం తృణమూల్ కాంగ్రెస్ బరిలోకి దిగినప్పుడు ఆ పార్టీని ఓడించడం కోసం కాంగ్రెస్‌కి మార్క్సిస్టు పార్టీమద్దతుఇచ్చింది. మొత్తం 294 స్థానాల్లో తృణమూల్‌కి 211సీట్లు రాగా, కాంగ్రెస్‌కి 44,వామపక్ష ఫ్రంట్‌కి 32 సీట్లు వచ్చాయి.ఇప్పుడు ఏడు మునిసిపల్ సంస్థల్లో తృణమూల్ కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెల్చుకోగా, బిజేపీ ఆరు స్థానాలనూ, లెఫ్ట్ కూటమికి చెందిన ఫార్వార్డ్ బ్లాక్ ఒక స్థానాన్ని మాత్రమే గెల్చుకున్నాయి. కాంగ్రెస్ మాదిరిగానే మార్క్సిస్టు పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు.ఒకనాటి అధికార కూటమికి ఇది సరిపెట్టుకోలేని అవమానమే. కాంగ్రెస్‌తో పొత్తు వల్ల మార్క్సిస్టు పార్టీ నష్టపోయిందన్న వాస్తవాన్నిసీతారామ్ యేచూరి ఇప్పటికైనా తెలుసుకోవడం గమనార్హం.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పోరాడగల శక్తి తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీకి మాత్రమే ఉందని జనం విశ్వసించడం వల్లనే ఆమె పార్టీకి ప్రజలుఅత్యధిక స్థానాలు కట్టబెట్టారు.తృణమూల్ కాంగ్రెస్‌ని ఇబ్బందుల పాలు చేయడానికి కేంద్రంలో మోడీ ప్రభుత్వం సిబీఐ విచారణలు జరిపిస్తోందన్న విషయం జనం గ్రహించారు. అన్నింటినీ ఓర్చుకుంటూ ఇతరపార్టీలు కలిసొచ్చినా లేకపోయినా ఆమె పోరాటం సాగిస్తోందన్న అభిప్రాయం జనంలో నాటుకుంది. అయితే,పనిలోపనిగా బీజేపీకి కనీసం ఆరుస్థానాలైనా రావడం ఈ రెండు పార్టీల కార్యకర్తలు,నాయకుల మధ్య క్షేత్రస్థాయిలో లోపాయికారీగాఉన్న అవగాహన కారణం కావచ్చు.గతంలో వాజ్‌పేయి హయాంలో ఎన్‌డిఏలో మమత భాగస్వామిఅన్న సంగతి తెలిసిందే.

సేంద్రియ ఎరువులను ప్రోత్సహించాలి

వ్యవసాయ శాఖకూ, బయో కంపెనీలకూ మధ్య పదిహేనేళ్ళుగా పోరాటం సాగుతూనే ఉంది. పర్యావరణానికి హాని చేయని సురక్షితమైన సేంద్రీయ, బయో ఉత్పత్తులను బయో కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ మాత్రం నిరంతరం బయో కంపెనీలను వేధిస్తూనే ఉంది. రెండు దశాబ్దాలుగా బయో ఉత్పత్తుల వాడకం పెరిగింది. రైతు బయో ఉత్పత్తులు కావాలని అడిగి తీసుకునే స్థాయికి కంపెనీలు అభివృద్ధి చెందాయి. ఇది రసాయనిక ఎరువులు పురుగు మందుల కంపెనీలకు కంటకంగా మారింది. ప్రపంచంలో కొన్ని దేశాలలో పూర్తిగా రసాయనిక ఎరువులను పురుగు మందులను నిషేధించి, పూర్తిగా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. మన దేశంలో కూడా కొన్నిరాష్ట్రా లలో ఈ పరిస్థితి నెలకొని ఉంది. ఈ కారణంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందుల కంపెనీలు ప్రభుత్వ అధికారులను, మంత్రులను లోబరుచుకుని బయో కంపెనీలపై వేధింపులకు పాల్పడుతున్నారు.

ఉమ్మడి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం బయోకంపెనీలపై వ్యవసాయ శాఖకు ఏ విధమైన నియంత్రణ అధికారం లేదని, తీర్పునిచ్చింది. మళ్లీ 2008లో వ్యవసాయ శాఖ బయో ఉత్పత్తులు వ్యవసాయ క్షేత్రాలలో ఉపయోగించడం వల్ల రైతులకు నష్టం వాటిల్లే నకిలీ బయో ఉత్పత్తులను నియంత్రించే అధికారం తమకు ఇవ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని అర్థించింది. ఇందులోని అంతరార్థాన్ని గ్రహించని న్యాయస్థానం వ్యవసాయ శాఖకు బయో ఉత్పత్తుల్లో రసాయనాలను నిర్ధారించే పరీక్షలు నిర్వహించాలని, రసాయనాలు న్నట్లు తేలితే బయో ఉత్పత్తుల కంపెనీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. దీన్ని ఆధారం చేసుకొని వ్యవసాయ శాఖ అధికారులు బయో కంపెనీలపై తిరిగి పెత్తనం చేయడం మొదలుపెట్టారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రసాయనిక ఎరువులు వద్దని చెవినిల్లుకట్టుకొని సర్కార్‌కు మొరపెట్టుకుంటున్నా, ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి, సేంద్రీయ, బయో ఉత్పత్తులను ఆదరించాలని కోరుతున్నాను. **-డా. సి.వి.రత్నకుమార్**

మంచి మాట

ఇరుపక్షాల వాదనలూ వినకుండా తీసుకునే నిర్ణయాలెప్పుడూ సరైనవి కావు

● ఫోక్లిడెస్

ఎన్డీయేతో చెలిమి..

నితీశ్‌కి ధృతరాష్ట్రుని కౌగిలే!

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏలో చేరడం ఆయనకు ఏ విధంగానూ మేలు కాదు. ఎన్‌డిఏ ఆయనకు ధృతరాష్ట్రుని కౌగిలవుతుంది. దేశ మంతటా కమల వికాసం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆయన శిష్యుడు, బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా విసిరిన వలలో నితీశ్ చిక్కారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీబీఐ, ఆర్థిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)లను కాంగ్రెస్ కన్నా దారుణంగా ఉపయోగించుకుని ప్రత్యర్థులను బీజేపీ కూటమి ప్రభుత్వం బలహీనపరుస్తోంది. కాంగ్రెస్ రాజకీయాలనే బీజేపీ అనుసరిస్తోంది. పార్టీ ఫిరాయింపుల విషయమే తీసుకుంటే, కాంగ్రెస్ గతంలో కొన్ని విషయాల్లో నియమ నిబంధనల పేరిట తప్పుకునేది. ఇప్పుడు కమలనాథులు అటువంటి తేడా ఏమీ లేకుండా పార్టీ ఫిరాయింపులను నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారు. పాత విషయాలను అలా ఉంచితే, ఇటీవల గుజరాత్ శాసనసభ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో మూడో స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీజేపీ అనుసరించిన అనైతిక రాజకీయడ్రామా ఆ పార్టీ పట్ల కాస్తోకూస్తో అభిమానం ఉన్నవారిని కూడా ఆలోచనలో పడేసింది. రాష్ట్ర శాసనసభలోఉన్న బలాబలాలను బట్టి బీజేపీకి సునాయాసంగా దక్కేవి రెండు స్థానాలు మాత్రమే. మూడో స్థానాన్ని గెల్చుకోగలిగే సంఖ్యాబలం కాంగ్రెస్‌కి ఉంది. ఆ స్థానాన్ని కూడా కైవసం చేసుకోవడానికి ఎన్నికల ముందు బీజేపీ ఎన్నో కుప్పిగంతులేసింది. మాజీ మంత్రి శంకర్‌సింగ్ వాఘేలాకు ఎరవేసి తన వైపు తిప్పుకుంది. ఆయన మద్దతుదారులైన ఆరుగురు శాసనసభ్యులను తన వైపు మరల్చుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కనుక, ఎమ్మెల్యేలు ఏది కావాలంటే అది ఇవ్వగల శక్తి సామర్థ్యం బీజేపీకి ఉన్నాయి. అందునా ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అనుసరిస్తున్న ఫిరాయింపుల రాజకీయం మోడీ నడిపిస్తున్నదేనన్న అభిప్రాయం జనంలో ఏర్పడింది. గుజరాత్ శాసనసభకు 2018లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌ని పాతర వేయడానికి ఈ రాజ్యసభ ఎన్నికను రిహార్సిల్ గా చేసుకోవాలన్న ఆకాంక్షతో అమిత్ షా ఇంత నాటకం ఆడించారు.

ఎత్తుకు పై ఎత్తుగా కాంగ్రెస్ కూడా అంతకు అంత రాజకీయం చేసి మొత్తం మీద తన స్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థి అహ్మద్ పటేల్ కాకుండా ఉంటే, ఆ స్థానం కోసం అంతగా అడ్డగోలుయత్నాలు సాగించి ఉండేవారు కారు. పార్టీ ఫిరాయింపులను గుజరాత్‌తో సరిపెట్టకుండా, బీహార్‌లో కూడా ప్రోత్సహించేందుకు అమిత్ షా పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో నైతిక విలువల



గురించి గంభీరోపన్యాసాలు దంచేసే నితీశ్ కుమార్ బీజేపీ యత్నాలకు మద్దతు ఇవ్వక తప్పని స్థితిలోకి జారుకున్నారు. ఆయన మహాకూటమిలో ఉంటే కొంతైనా స్వేచ్ఛ ఉండేది ఇప్పుడు కేంద్రం నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోవడం ఆయన తరం కాదు.

నితీశ్ ధోరణి చూస్తుంటే 2020 వరకూ ఉన్న శాసనసభ కాలపరిమితికి ఏడాది ముందే అంటే, లోక్‌సభ ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఎన్నికలకు సిఫార్సు చేస్తారేమోననిపిస్తోంది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జనతాదళ్(యు) ఇప్పటికే చిక్కి శల్యమైంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి అది మరింత బలహీనపడవచ్చు. జనతాదళ్(యు)లో నితీశ్ కుమార్ వర్గం నాయకులు, కార్యకర్తలు క్రమంగా బీజేపీలో చేరిపోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వం పట్ల ఆకర్షితులై వారంతా బీజేపీలో చేరిపోవచ్చు. జనతాదళ్(యు) అనేది నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగినంత కాలమే ఉంటుంది. చీలికలు, పీలికలైన వర్గాల్లో ఏది అధికారంలో ఉంటే అదే అసలు పార్టీగా ముద్ర వేయించుకోవడం, అధికారం పోగానే అది కనుమరుగు కావడం భారత రాజకీయాల్లో సర్వసాధారణం. కర్నాటకలో జనతాదళ్(ఎస్) బీజేపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపినంత బలంగా ఇప్పుడు లేదు. జనతాదళ్(ఎస్) తో చేతులు కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరిచిన బీజేపీ ఆ పార్టీని చిరునామా లేకుండా చేయగలిగింది. రేపు జనతాదళ్(యు) పరిస్థితీ అదే. నితీశ్ కుమార్ తదుపరి ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చు. ఆయన రాజకీయాలకు దూరం కావచ్చు. అలా ఆయన ప్రకటించిన మరుక్షణమే, ఆయన నేతృత్వంలోని జనతాదళ్(యు) వర్గమంతా బీజేపీలో చేరిపోతుంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా మోడీ గెలుపొందే అవకాశాలే ఎక్కువగాకనిపిస్తున్నాయి. ఆయనకు అంత మెజారిటీ రాకపోయినా, తిరిగి ఆయనే ప్రధాని అవుతారన్న అభిప్రాయాన్ని కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా లాంటి వారే ఇప్పటికే ప్రకటించారు. ఆయన మాదిరిగానే బీహార్‌లో జనతా పరివార్ వర్గాలన్నీ క్రమంగా బీజేపీలో లీనమై పోవచ్చు. అంతిమంగా రాష్ట్రంలో బీజేపీదే పైచేయి అవుతుంది. మోడీ,అమిత్ ద్వయం అభిమతం కూడా అదే. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా లాలూ ప్రసాద్ నేతృత్వంలోని ఆర్‌జేడీయే అవుతుంది. ఆయననూ, కుమారుడు తేజస్వినీ కేసులవిచారణలో భాగంగా జైలుకి పంపితే ఆ పార్టీ కకావికలు కావచ్చు. ప్రతిపక్షాన్ని నామరూపాలు లేకుండా చేసి అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలన్న వ్యూహంతోనే కమలనాథులు ముందుకు సాగుతున్నారు. ఇదే వ్యూహాన్ని ఇతర రాష్ట్రా ల్లో ముఖ్యమంత్రులు ఇప్పటికే అనుసరిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీని బలహీనపర్చేందుకు ప్రయత్నించినప్పటికీ, ఇంత మరీ దిగజారిన రీతిలో వ్యవహరించలేదు. ఒడిషాలో కూడా బీజేడీని పక్కకు తప్పించి అధికారాన్ని కైవసం చేసుకునేందుకు కమలనా థులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. ముఖ్య మంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ వారి ప్రయత్నాలను సాగనివ్వడం లేదు. ఆయన కూడా వయసు మీద పడు తున్న దృష్ట్యా, బీజేపీ వ్యూహాలను ఎల్లకాలం ఎదుర్కోలేరు. ఈనేపథ్యంలో అటు నితీశ్‌నీ, ఇటు నవీన్ వంటి వారిని పక్కకు తప్పించి ఆయా రాష్ట్రాల్లో తమ పతాకాన్ని ఎగురవే యాలన్న వ్యూహంతో బీజేపీ ముందుకు సాగుతోంది. తమిళనాడులో అన్నా డిఎంకె వర్గాలు విలీనమయ్యేందుకు సిద్ధపడేట్టు చేసిన బీజేపీ భవిష్యత్‌లో అన్నా డిఎంకెని తమ పార్టీలో విలీనం చేసుకున్నా ఆశ్చర్యం లేదు. మొత్తంమీద దేశ మంతటా కమల వికాసమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న మోడీ, అమిత్ షా ద్వయంతో పొత్తు నితీశ్‌కి ధృతరాష్ట్రుని కౌగిలే అవుతుంది.

-ఎ.వి. స్వామి

వినాశనమే విలక్షణత

అసోంకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్న బ్రహ్మపుత్ర

చైనా, ఇండియా, బంగ్లాదేశ్‌ల మీదుగా ప్రవహించే బ్రహ్మపుత్రకు అనేక పేర్లున్నాయి. అసోంలోని బోడో ప్రాంతీయులు దానిని బర్లంగ్‌బుతుర్ అనీ, టిబెటన్లు యార్లంగ్ సాంగ్‌పో అనీ పిలుస్తారు. ఇందులో సాంగ్‌పో అంటే స్వచ్ఛమైన అని అర్థం. ఉత్తర అరుణాచల్ ప్రదేశ్‌లో బ్రహ్మపుత్ర రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. అక్కడి వారు దానిని సియాంగ్ నదిగా పిలుస్తారు. బంగ్లాదేశ్‌లో ప్రవేశించిన అనంతరం బ్రహ్మపుత్రను జమున అని పిలుస్తారు. ఈ దేశంలోనే ఇది ఆడ పేరును సంతరించుకుంది. బంగ్లాదేశ్‌లో మనం గంగగా పిలుచుకునే పద్మ నదితో బ్రహ్మపుత్ర మమేకమవుతుంది. బంగ్లాదేశ్ చివరి భాగంలో దాని పేరు మేఘనగా మారింది. ఆఖరుకు అది బంగాళాఖాతంలో కలుస్తుంది. హిమాలయాల్లోని ఉత్తర భాగంలో ఉన్న అంగ్సీ గ్లేషియర్ నుంచి బ్రహ్మపుత్ర జన్మించింది. టిబెట్‌లోని బురంగ్ కౌంటీలో ఈ గ్లేషియర్ ఉంది. పుట్టిన దగ్గర్నుంచి 1100 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రపంచంలో ఇది పదో అది పెద్ద నది. పొడవులో 15వది.

నదులకు సాధారణంగా ఆడ పేర్లే ఉంటాయి. బ్రహ్మపుత్ర మాత్రం పురుషుడి పేరు. అందువల్లనో ఏమో బ్రహ్మపుత్ర కోపాన్ని ప్రదర్శిస్తుంటుంది. విశృంఖలంగా ప్రవర్తిస్తుంది. ప్రతి ఏడాదీ గర్జిస్తూ..పరవళ్ళు తొక్కుతూ పంటల్నీ, మౌలిక వసతుల్నీ ధ్వంసం చేస్తుంటుంది. బ్రహ్మపుత్రులంతా చదువుకున్న వారు.. నెమ్మదితనంగా వ్యవహరించే వారూనూ. ఈ బ్రహ్మపుత్ర మాత్రం విలక్షణం. ప్రతీ ఏటా విశృం ఖలత్వాన్ని ప్రదర్శిస్తూ సమయాసమయాలు లేకుండా, వర్షాకాలం అనంతరం ఉప్పొంగి ప్రవహిస్తుంటుంది. అసోం రాష్ట్రం బ్రహ్మపుత్ర గర్జనలతో వణికిపోతోంది. అసోంలోని ద్వీపంలాంటి మజులీ జిల్లాను చూడండి. 1250 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మజులీ 20వ శతాబ్దం ఆరంభంలో ఏర్పడింది. బ్రహ్మపుత్ర వరదల ధాటికి అది 353 చదరపు కిలోమీటర్లకు కుంచించుకుపోయింది. ఈ ఏడాది సంభవించిన బ్రహ్మపుత్ర వరదలకు 82మంది మ రణించారు. 25లక్షల 42 వేల మంది వరదల ప్రభావానికి గురయ్యారు. ఉన్న 32 జిల్లాలలో 29 బ్రహ్మపుత్ర వరదలకు దెబ్బతిన్నాయి. కచార్, కరీంగంజ్, హైలకంది జిల్లాలు ప్రతి ఏటా విపరీతంగా దెబ్బతింటాయి. రాష్ట్రంలోని ఏడు శాతం భూభాగం తీవ్రంగా ప్రభావితమవుతుంది. 23శాతం కొంచెం ఇబ్బందిని ఎదుర్కొనే పరిస్థితులున్నాయి. గడిచిన మూడు నెలల్లో 4045 గ్రామాలు నీట మునిగాయి. వరదలు సంభవించిన సందర్భాలలో 70 పాళ్ళు అసోంకు గుర్తింపు తెచ్చిన కజిరంగ జాతీయ పార్కు నీట మునిగిపోతుంది. అనేక జంతువులు చని పోతుంటాయి. వరద నీటి నుంచి తప్పిం చుకోవడానికి కొన్ని జంతువులు ఎత్తయిన ప్రాంతాలకు తరలి వెళ్లిపోతుంటాయి. 3 లక్షల 85 వేల హెక్టార్ల మేరకు పొలాలు నీట మునిగిపోయాయి. ఒక్క కరీంగంజ్ జిల్లాలోనే 97వేల మంది వరద ప్రభావాని కి గురయ్యారు. బ్రహ్మ పుత్ర నది ఎందు కింత ఆగ్రహోదగ్రంగా మారుతోం ది? దానిని అదుపు చేయలేమా? దేశాల సరి హద్దుల్ని స్పృశిస్తూ ప్రవహించే బ్రహ్మ పుత్ర ఆసియా ఖండంలోనే అతి పెద్దదైనది. భూకంప పీడిత పర్వత ప్రాంతాలలో భూమికి ఏర్పడిన పగుళ్ళు, ఎత్తుపల్లాలు ఈ నదికి అటూ ఇటూ ఉండడం వరదల తీవ్రతకు ప్రధాన హేతువు. అస్థిరమైన భౌగోళిక స్వరూపం కారణంగా బ్రహ్మపుత్ర పరవళ్ళకు అడ్డూ..అదుపూ లేకుండా పోతోంది. నదీ గర్భంలో పెద్ద ఎత్తున ఒండ్రు మట్టి పేరుకుపోవడం, దాని మార్గంలో లోతైన మలుపులు వరద ఉద్ధృతికి కారణమని బ్రహ్మపుత్ర రివర్ బోర్డు తన తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. సహజ భౌగోళిక స్వరూపమూ..భారీ వర్షాలకు మానవ తప్పిదాలు తోడయ్యాయి. నదీ తీరాన్ని ఆక్రమించి, కట్టడాలు నిర్మించడం కూడా ఇందుకు దారితీస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ లోపించడం, ప్రణాళిక లేకుండా విస్తరిస్తున్న నగరాలు, కొండల్ని పిండి చేసేయడం, అడవుల్ని నరికేయడం కూడా బ్రహ్మ పుత్ర ఆగ్రహాన్ని రెట్టింపు చేస్తున్నాయి. కొండల్ని తవ్వేయడం, అడవుల్ని నరికేయడం వల్ల ఆ ప్రాంతంలోని మట్టి, ఇసుక నదీ గర్భంలోకి చేరుతున్నాయి. చెట్లు భూమిలోని మట్టిని పట్టుకుని స్థిరంగా ఉంచుతాయి. దీనివల్ల నీటి వల్ల భూమి కోత తప్పుతుంది.



బ్రహ్మపుత్ర పరవళ్లతో కజిరంగ పార్కులోని జంతువులకు ఇలాంటి పరిస్థితి సర్వ సాధారణం

ప్రపంచంలోనే పెద్ద నది బ్రహ్మపుత్ర..

బ్రహ్మపుత్ర నది ప్రపంచంలో అతి పెద్దదే కాకుండా, మట్టిని మోసుకెళ్ళే నదుల్లో రెండో స్థానంలో ఉంది. చెట్టు కొట్టేసి, కొండల్ని తవ్వేయడం వల్ల మట్టి నదీ గర్భంలో చేరిపోతోంది. ఇది బ్రహ్మపుత్ర నీటి మట్టాన్ని విపరీతంగా పెంచేస్తోంది. క్రమేపీ నది తన గమనాన్ని మార్చుకుంది. ఇళ్ళలోకి ప్రవేశించింది. ఊళ్ళకు ఊళ్ళనూ, ప్రాణాలనూ చుట్టేస్తోంది. నదీ తీరంలో ఉన్న అడవులు, స్థానిక జల వనరులను మానవ జోక్యం ఒక పద్ధతి ప్రకారం నాశనం చేసేస్తోంది. ఆ ప్రాంతంలో విపత్తును పెంచేస్తూ, రక్షణ కవచాన్ని తుంచేస్తోంది.

మానవ తప్పిదాల మాట అటుంచితే, కేంద్రంలోని ప్రభుత్వాల నిరాశక్తత అసోంలో ఏటా విపత్తులకు కారణమవుతోంది. ఏళ్ళుగా కేంద్ర ప్రభుత్వాలు అసోంను నిర్లక్ష్యం చేశాయి... చేస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక మంది తాము భారత్‌కు చెందిన వారం కామని ఈ కారణంగానే భావిస్తుంటారు. న్యూఢిల్లీలో గద్దెనెక్కిన పెద్దలే ఈ పరిస్థితికి కారణభూతులవుతున్నారు. నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం మాత్రమే బ్రహ్మపుత్ర వరదలూ, అసోం కష్టాలపై దృష్టి సారిస్తోంది. ఈ రాష్ట్రంపైనే కాక ఈశాన్య ప్రాంతాన్ని సునిశితంగా పరిశీలిస్తోంది.

ముఖ్యమంత్రీ వరద బాధితుడే..

అసోం జనజీవన స్రవంతిలో వరదలూ ఒక భాగమై పోయాయి. ఈ ఏడాది, 2012లో సంభవించిన వరదలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. నాగాలాండ్ ముఖ్యమంత్రి టి. ఆర్. జీలియంగ్, కొంతమంది ఎమ్మెల్యేలను పడవలలో తరలించాల్సి వచ్చిందంటే తీవ్రత ఎంతుందో ఊహించుకోవచ్చు. ప్రధాని నరేంద్ర మోడీ అసోం పర్యటన ఇప్పుడు ఆ రాష్ట్రానికి ఆశాజనకంగా మారింది. నిద్రపోతున్న అధికారులను తట్టిలేపింది. అధికార యంత్రాంగాన్ని న్యూఢిల్లీ అప్రమత్తం చేసింది. ప్రకృతి విలయాలను ఎదుర్కొనేందుకు యుద్ధ ప్రాతిపదికపై సిద్ధమయ్యేలా చేసింది. అసోంలో బీజేపీ, అసోం గణ పరిషద్, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ కూటమి పాలిస్తోంది. బ్రహ్మపుత్ర ఆగ్ర హం.. పర్యవసానాలపై ఆ కూటమి ప్రధానికి సవివరమైన నివేదికను సమర్పించింది. 1954 నుంచి ఏటా 8వేల హెక్టార్ల భూమి కోతకు గురవుతోందనీ, 4 లక్షల 27వేల హెక్టార్ల పంట నష్టం వాటిల్లుతోందనీ, ఇది అసోం రాష్ట్ర భూభాగంలో ఏడుశాతమనీ అందులో పేర్కొంది. భగీరథుడు గంగమ్మకు దారి చూపినట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బ్రహ్మపుత్రను అదుపుచేసి, వరదను అరికట్టగలిగితే ఈశాన్య రాష్ట్రాలు ఏళ్ళ తరబ డి బీజేపీ ఏలుబడిలో ఉంటాయని చెప్పాల్సిన అవసరం ప్రత్యేకంగా లేదు.


-శంకర్ రాజ్,
సీనియర్ పాత్రికేయుడు

'పచ్చగడ్డి'తో పల్లెకు కళ!

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న పచ్చగడ్డి పెంపకం పథకం పల్లెసీమల్లో పచ్చదనం నింపటంతో పాటు, పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు కూడా విరజిమ్మబోతుంది. పాడి పరిశ్రమ అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహద పడబోతుంది. సన్న - చిన్నకారు రైతులందరికీ సానుకూల ఫలితాలనందించే అంశాలు ఈ పథకంలో ఉన్నాయి. పాడి - పంట అనేది మనకు అనాదిగా వస్తున్న నినాదం. సస్యవిప్లవం మొదలు కాకముందు, రసాయన ఎరువు ల వాడకం అసలు లేని రోజుల్లో పశువుల మలమూ త్రాలతో తయారైన పెంట పోగునే ప్రతిరైతు విధిగా పైరుకు ఎరువుగా వాడేవాడు. కాలక్రమంలో రసాయన ఎరువులు వాడకం పెరగటం, పైర్లు చీడ, పీడలకు లోనుకావడం, వాటిని అదుపు చేయటానికి రసాయన మందుల వాడకం ప్రజలను అనారోగ్యం పాలుచేస్తోంది. పాలు బలవర్ధకమైన ఆహారం. ఆ పాలు తాగాలంటే పశువులుండాలి. పశువులుండాలంటే పచ్చగడ్డి ఉండాలి. పచ్చగడ్డి కొరత ఏర్ప డటంతో, పశుసంతతి తగ్గింది. పాల ఉత్పత్తి తగ్గింది. పర్యవసానంగా బలవర్ధకమైన పాలు సామాన్యులకే కాదు, బడాబాబులకూ అందకుండా పోతున్నాయి. ఈ అనర్థా లన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పచ్చగడ్డి పెంపకం పథకం స్వస్తి పలక బోతుంది. ఆరోగ్య కరమైన పాలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం తప్పుతుంది. ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించగలుగుతారు. ప్రతి రైతుకు ఎరువులు ఖర్చు, క్రిమిసంహారక మందుల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ఇలాంటి అత్యున్నత ఆరోగ్య పథకం ప్రవేశపెట్టిన ఘనత నవ్యాంధ్రప్రదేశ్‌దే నన్న నిస్సంశయంగా చెప్పవచ్చు. ఈ పథకంలో భాగస్వామిగా మారిన ప్రతి ఒక్కరికి ఎకరానికి రూ.20 లు ప్రభుత్వం చెల్లిస్తుంది. సన్న - చిన్న కారు రైతులకు ఈ పథకంలో ప్రాధాన్యత కల్పిస్తారు. రాష్ట్రంలోని 13 వేల గ్రామ పం చాయతీల్లో ఈ పథకం ప్రారంభించాలని అధికారులు యత్నిస్తున్నారు. తొలి దశలో 65 వేల ఎకరాల్లో పచ్చగడ్డి పెంపకం పథకం ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరు గుతున్నాయి. ఇప్పటికే 43 వేల ఎకరాల్లో ఈ పథకం ప్రారంభించినట్లు అధికారులు చెపుతున్నారు. అపురూపం గా పెంచుకొనే పశువులకు పచ్చగడ్డి కాదు, ఎండుగడ్డి కూడా దొరకని సందర్భాలు అన్ని జిల్లాల్లోనూ ఉన్నా యి. పచ్చగడ్డి పెంపకంపై వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు సరిపోతుందా? అనే సందేహం రాకమా నదు. నిజం చెప్పాలంటే ఇది సున్నితమైన అంశం కూ డా. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న పశుగ్రాసా లు ఎకరానికి మొదటికోతకు రెండు నుంచి నాలుగు టన్నుల దిగుబడి నిస్తాయి. తరువాత కోతలకు దిగుబడి పెరుగుతుంది. ఏడాదిలో 3, 4 కోతలకు దిగుబడినిచ్చే రకాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఏ రకం సాగు చేసినా, ఏ విధంగా సాగుచేసినా ఎకరానికి ఏడాదిలో 8 నుంచి 10 టన్నుల దిగుబడి సాధించవ చ్చు. కోత అనంతరం గడ్డిని కిలో ఒక రూపాయికి అమ్మి నా ఎకరంలో ఏడాది ఆదాయం లక్షకు పైబడి ఉంటుం ది. ప్రభుత్వ పథకానికి స్పందించి పచ్చగడ్డి పెంపకానికి ముందుకు వచ్చేవారికి ఇతోధిక సహాయం అందించే భాగంగా, ముందుగా పశుసంతతి ని వృద్ధి చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఈ రెండూ జోడెద్దుల్లా ముందు కు సాగినపుడు పాడి- పంట వృద్ధి చెంది, పుష్టికరమైన ఆహార ఉత్పత్తి జరిగి, ప్రజలు ఆరోగ్య వంతంగా జీవిం చగలుగుతారు.

-దాసరి ఆళ్వారస్వామి

క్యా 'బాత్' హై! రాహుల్ జీ!!



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కంటే వంగీ బాత్ బాగుందంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం నవ్వులు పూయించింది. బెంగళూరులో ఇందిర క్యాంటిన్ల ప్రారంభం కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలంతా ఓ క్యాంటిన్లో వంగీ బాత్ తిన్నారు. ఆ సందర్భంగా రాహుల్ పై వ్యాఖ్య చేశారు. అదే కార్యక్రమంలో ఆయన ఇందిర క్యాంటిన్లను అమ్మ క్యాంటిన్లని నోరుజారారు. తరువాత సద్దుకున్నారు. అమ్మ అనగానే గుర్తొచ్చేది జయలలిత అనే విషయం తెలిసిందే కదా. ఇదే కార్యక్రమంలో ఆయన **మనకు కావలసింది స్వచ్ఛ భారత్ కాదనీ సత్య భారత్ అనీ** కూడా అన్నారు. ఇంత జరిగినా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఏమీ పట్టనట్లు వంగీ బాత్ తినడంలో బిజీగా కనిపించారు.

ఇది ప్రజా ప్రభుత్వమేనా

రాష్ట్రంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నవారికి ఉచితంగానూ, నామమాత్రపు ధరలకు క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది తీవ్ర గర్హనీయమేకాక ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగపరచడమే అవుతుంది. పేదల ముసుగులో పార్టీ నాయకులకు, వారి తాబేదార్లకు ప్రజల ఆస్థిని దోచిపెట్టడం తప్ప మరేమీ కాదు. నిజంగా ప్రజల కోసమే అయితే, చట్టాలపై గౌరవంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోకుండా, వేలకొద్దీ అద్దెలు చెల్లిస్తూ, అద్దె ఇళ్ళల్లో నివశిస్తున్న పేదల మాటేమిటి? అంటే ప్రభుత్వం ఒకరిని - వారి ఖర్మానికి వారిని ఒదిలేసి, చట్టవ్యతిరేకులకు అండగా నిలవడమేగా! ఇది నిజంగా ప్రజాప్రభుత్వమేనా? మనది ప్రజాస్వామ్యమేనా అనేసందేహాలు కలుగుతున్నాయి. ఇప్పటికే రైతు రుణమాఫీ, చంద్ర కానుకలు వంటి నిరర్థక, అనుత్పాదక పథకాల ద్వారా ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు.

వీరుభొట్ల పేరయ్య శాస్త్రి
విజయవాడ

అభిప్రాయం

రాజమండ్రి ఓఎన్జీసీకి వరుసగా

మూడవసారి అవార్డ్

●గనుల తవ్వకాల్లో అత్యల్ప గాయాలు రేటు నమోదు ●2013 సంవత్సరంలో నేషనల్ సేఫ్టీ అవార్డుల ఎంపిక ●రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా ప్రదానం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ విభాగం వరుసగా మూడోసారి ప్రతిష్టాత్మక నేషనల్ సేఫ్టీ అవార్డు (మైన్స్) అందుకుంది. 2013 సంవత్సరానికి గాను ప్రకటించిన నేషనల్ సేఫ్టీ అవార్డుల్లో రాజమండ్రి అసెట్ విభాగం ఈ ఘనత సాధించింది. అంతకంటే ముందు 2011, 2012 సంవత్సరాల్లోనూ ఈ జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ డీఎంఆర్ శేఖర్ ఈ అవార్డును అందుకున్నారు. చమురు, సహజవాయువు వెలికితీయడం కోసం నిర్వహించే డ్రిల్లింగ్ కార్యక్రమాల్లో అత్యల్ప గాయాల రేటు నమోదు చేసినందుకు ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ విభాగం ఈ అవార్డు కోసం ఎంపికైంది.

భద్రతే పరమావధి: రాష్ట్రపతి కోవింద్

కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో 2013, 2014 సంవత్సరాలకు గాను అవార్డులను రాష్ట్రపతి కోవింద్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషుల భద్రత, ప్రాణ రక్షణ అన్నింటికంటే ముఖ్యమైనదని గనుల పరిశ్రమనుద్దేశించి అన్నారు.

సురక్షిత మైనింగ్ నినాదం కావాలి: దత్తాత్రేయ

అనంతరం కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మైనింగ్ రంగం పారిశ్రామికీకరణలో చోదక శక్తిగా పనిచేస్తుందని, దేశాన్ని అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ క్రమంలో కార్మికులను సమస్యల్లో పడేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు.

చైనా బెదరింపులు కాగితం మీదే

●నిజంగా యుద్ధం జరగదని అంచనాలు ●అందుకు తగినట్లే మీడియాలో బెదరిస్తున్న డ్రాగన్ ●భారత్, భూటాన్ల మధ్య విభేదాలకూ విఫలయత్నం ● భారత్ సైన్యం చైనాకు లెక్కకాదన్న మిలిటరీ నిపుణుడు ●లడఖ్‌లో ఘర్షణ జరిగినట్లు తమకు సమాచారం లేదన్న చైనా ●యుద్ధమంటూ జరిగితే.. అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో ఏకకాలంలో?

న్యూఢిల్లీ/బీజింగ్: భారత్, చైనాల మధ్య డొక్లాం వివాదాన్ని రోజుకొకరు ఆ దేశంలో రేపుతున్నారు. అయితే.. వాళ్లెంత గాండ్రించినా కాగితానికే పరిమితమని, సరిహద్దుల్లో తొసుకోవడం, బ్యానర్ డ్రిల్ చేయడం తప్ప మరేమీ జరగదని నిపుణలు చెబుతున్నారు. అందుకు తగినట్లుగానే, లడాక్‌లో ఘర్షణ పడినట్లు తమకేమీ తెలియదని చైనా విదేశాంగ, రక్షణ శాఖలు ప్రకటించాయి. అయితే అధికార మీడియా మాత్రం భారత్‌ను బెదిరిస్తూనే ఉంది. తాజాగా చైనాలో మిలిటరీ వ్యవహారాల నిపుణుడు గ్జు గువాంగ్యు భారత్‌ను హెచ్చరించినట్లు చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ ప్రచురించింది. చైనా ప్రభుత్వానికి ఆయుధ నియంత్రణ, నిరాయుధీకరణ విషయంలో ఈయన సీనియర్ సలహాదారు. చైనా నేవీలో ఈయన రియర్ అడ్మిరల్‌గా పని చేసి పదవీ విరమణ చేసారు. గువాంగ్యు ప్రకారం.. చైనా సైన్యం పీఎల్ఏ ధాటికి భారత సైన్యం నిలువలేదు. ఇంకా చెప్పాలంటే భారత సైన్యాన్ని నిలువరించడం లేదా తరిమేయడం చైనా పీఎల్ఏకు ఒక లెక్క కాదని కూడా అన్నారు. అయితే.. రానున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం మీద మాత్రం డొఖ్లా ప్రభావం ఉండకూడదని అభిప్రాయబడ్డారు. భారత్‌కు చైనా కొద్ది రోజులు గడువిస్తుందని, ఆ తరువాత చేయాల్సింది చేస్తుందని గువాంగ్యు అన్నారు. చైనా పెట్టుకున్న డెడ్‌లైన్ తరువాత కూడా డొక్లాంలో భారత దళాలు ఉంటే వాటి పని పీఎల్ఏ పడుతుందని, భారత్ ఫలితం అనుభవిస్తుందని గువాంగ్యు అన్నారు. అంతే కాక యుద్ధానికి సిద్ధమవాలని ఆయన పీఎల్ఏకు పత్రికాముఖంగా సలహా కూడా ఇచ్చారు. భారత్ ఎదురు తిరుగుతోందని, పూర్తిస్థాయి యుద్ధానికి సన్నద్ధం కాక తప్పదని ఆయన అన్నారు.



(ఫైల్ ఫొటో)

రెండు నెలలుగా భారత్, చైనా, భూటాన్ సరిహద్దుల్లోని త్రికూడలిలో భారత్-చైనా దళాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. అయితే.. ఇటీవల డొక్లాం విషయంలో చైనాతో ప్రతిష్టంభన విషయంలో మార్పు వచ్చినట్లు అర్థం వచ్చేలా రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ మాట్లాడారు. దీన్ని బట్టి డొక్లాం వివాదాన్ని తెగేదాకా లాగకూడదని చైనా ఉన్నప్పటికీ, వెనక్కు తగ్గేముందు రకరకాల బెదిరింపులతో భారత్‌ను భయపెట్టడానికి ప్రయత్నిస్తోందని రక్షణ నిపుణులు అభిప్రాయబడుతున్నారు. భారత్ వ్యూహకర్తల అభిప్రాయమూ అలాగే ఉన్నా, దౌత్యపరంగా ఆ దేశంపై పైచేయి సాధించడంతో యుద్ధం వచ్చే అవకాశాలు తగ్గిపోయాయి. అంతర్జాతీయ సమాజం ముందు పాక్, ఉత్తర కొరియా తప్ప మరే మిత్ర దేశాలూ లేని దేశంగా చైనా మిగిలిపోయేలా చేయడంలో భారత్ సఫలీకృతమైంది. అందుకే తాను డిఫెన్స్‌లో పడే డొక్లాంను వదిలేసి లడాఖ్‌లో భారత్ సైన్యం మీద పడడానికి చైనా ప్రయత్నించింది. అక్కడ సోనయాంగ్ తటాకంలో ఇటీవలి వరకూ చైనదే పైచేయిగా ఉండేది. అయితే.. ఇటీవల అక్కడ గస్తీ కోసం అమెరికన్ మోటార్ బోట్లను భారత సైన్యం కొనుగోలు చేయడంతో మనం కూడా చైనాను బాగా నిలువరించగలుగుతున్నాం. దీంతో ఏం చేయాలో చైనాకు పాలుపోవడం లేదని భారత విదేశాంగ నిపుణుల అంచనాగా ఉంది.

వాణిజ్య యుద్ధానికీ చైనా దూరమే!

ఇప్పటి వరకూ ప్రభుత్వంలో నేరుగా బాధ్యులు కాని వారితోనే అధికార మీడియాలో ప్రకటనలు ఇప్పిస్తూ భారత్‌పై చైనా చేస్తున్న మానసిక యుద్ధానికి ఫలితం గతంలోలా ఇప్పుడు కనిపించడం లేదు. పైగా అంతర్జాతీయ సమాజం ముందు చైనా పొగరుబోతు దేశంగా భారత్ నిరూపించగలిగింది. ఇక్కడ రెండు దేశాల సైన్యాలూ ఘర్షణలు పడినా, పరిధి దాటడం లేదని గమనించాలని రక్షణ నిపుణులు చెబుతున్నారు. దీంతో సరిహద్దుల్లో బెదిరిస్తూనే వాణిజ్య యుద్ధానికి చైనా తెరతీస్తోంది. భారత్ చైనాకు చేస్తున్న ఎగుమతులకంటే, దిగుమతులే ఎక్కువ. అంటే వాణిజ్యంలో భారత్ కంటే చైనాకే మన వల్ల లాభం. అయితే.. ఆ లాభం చాలా తక్కువని, మా జీడీపీలో భారత్‌తో వాణిజ్యం రెండు శాతం మాత్రమేనని చైనా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. లక్షలాది కోట్ల వాణిజ్యాన్ని, భవిష్యత్తో పెరిగే అవకాశాన్ని చైనా అంత తేలికగా వదులుకోదని అందరికీ తెలిసిందే. అయితే.. భారత్‌లోని గత ప్రభుత్వాల మాదిరిగా కాక, ప్రస్తుత ప్రభుత్వం ప్రదర్శిస్తున్న గడసరితనం, దౌత్య నైపుణ్యం చైనాకు మింగుడు పడడం లేదు.

దీంతో ఈ వివాదానికి కారణం భారత్, భూటాన్‌ల మధ్య సత్సంబంధాలేనని, వాటిని చెడగొట్టేస్తే సరిపోతుందని చైనా భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు సమయం పడుతుంది కాబట్టి భారత్‌ను సరిహద్దుల్లో బెదిరిస్తోంది. కాలం తీరి విశ్రాంతి తీసుకుంటున్న నిపుణులతో లేక మీడియా పులులతో అధికార మీడియాలో ప్రకటనలు ఇప్పిస్తోంది. ఆర్థిక వేత్తల ద్వారా భారత్‌తో వాణిజ్యం తమకు పెద్ద ప్రయోజనమేమీ కాదని, తమతో గొడవ పెట్టుకుంటే నష్టపోయేది భారతేనని బింకాలు పోతోంది. అందుకు సమాధానంగా భారత్ చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న 93 వస్తువులపై సుంకాలు విధించేసరికి వారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లైంది. సమయానికి అమెరికా కూడా ఉత్తర కొరియాపై విరుచుకుపడడంతో, ట్రంప్‌ను శాంతింపజేసేందుకు జిన్‌పింగ్ కృషి చేయాల్సి వచ్చింది. భారతతో అమెరికా, జపాన్‌ల నావికా విన్యాసాలను కూడా చైనా పరిగణనలోకి తీసుకుని బెదిరిస్తోంది. దీంతో చైనా మానసిక యుద్ధమే చేస్తుందని, అసలు యుద్ధం కాదు కదా, భారత్‌తో వాణిజ్య యుద్ధం చేయాలన్నా, అమెరికా కొరివితో తల గోక్కోవడమేనని చెబుతున్నారు. దీంతో యుద్ధమంటూ వస్తే భారత్, అమెరికా, జపాన్, అస్ట్రేలియాలతో చైనా ఏకకాలంలో యుద్ధః చేయాల్సి ఉంటుందని, ఆ పరిస్థితి ఆ దేశం కొనితెచ్చుకోదని నిపుణుల అంచనా.

అమెరికా నుంచి క్రూడ్ దిగుమతి మొదలు

దక్షిణ కొరియా, చైనా, జపాన్ సరసన భారత్ - టెక్సాస్ గవర్నర్‌తో నవజ్యోత్‌సింగ్ క్రూడ్ ఆయిల్ ఎగుమతి ఒప్పందం



వాషింగ్టన్ : అగ్రరాజ్యం అమె రికా నుంచి భారత్‌కు క్రూడ్ దిగు మతి షురూ కానుంది. దీంతో ఇరు దేశాల మధ్య సరికొత్త స్నేహ బంధం మొదలవనుంది. సెప్టెంబర్ మొదటి వారం నుంచి అగ్రరాజ్యం క్రూడ్ ఆయిల్ భారత్‌కు దిగుమతి అవుతు ందని అమెరికాలోని టెక్సాస్ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబౌట్ పేర్కొన్నారు. ఇప్పటికే పలు కీలక అంశాలపై కలసి చేస్తున్న రెండు దేశాలు, తాజాగా క్రూడ్ ఆయిల్ సరఫరాతో ఓ నూతన శకాన్ని ఆరంభించనుందన్నారు. ఆయిల్ దిగుమతితో భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద దిగుమతిదారుగా రికార్డు నమోదు చేసుకోనుంది. ఇప్పటికే ఆ జాబితాలో దక్షిణ కొరియా, జపాన్, చైనా తదితర దేశాలున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని భారత అమెరికా రాయబారి నవజ్యోత్‌సింగ్ ట్విట్టర్ ద్వారా ఇటీవల తెలిపారు. టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబౌట్‌తో ఒప్పంద ప్రతిని కూడా విడుదల చేశారు. రెండు మిలియన్ బ్యారెల్‌కు వంద మిలియన్ డాలర్లు భారత్ చెల్లించనున్నట్లు వివరించారు. భవితష్యత్‌లో వినియోగం పెరిగితే మరింత ఎక్కువగా దిగుమతి చేసుకుంటామని చెప్పారు.

సికింద్రాబాద్ స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతాం

కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి రాజెన్ గోహైన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతామని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రాజెన్ గోహైన్ వెల్లడించారు. స్వచ్ రైల్ – స్వచ్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మిషన్ క్లీన్ లెస్ డ్రైవ్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజెన్ గోహైన్ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు రైల్వేలో స్వచ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్‌లు పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. రాబోయే రోజుల్లో అన్ని రైల్వే స్టేషన్‌లలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని అమలు చేస్తామని మంత్రి తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఏపీ భవన్ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలని ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. ఏపీ భవన్ ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు క షి చేయాలని కోరారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీలోని ఏపీ భవన్ కార్యాలయ ప్రాంగణం, నర్సింగ్ హాస్టల్ క్వార్టర్స్, పటౌడీ హౌస్ ప్రాంగణాల పరిశుభ్రత కార్యక్రమాన్ని రెసిడెంట్ కమిషనర్ చేపట్టారు.

ముగిసిన జర్నలిస్టుల త్రివర్ణ పతాక జైత్రయాత్ర

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, జాతీయ సమైక్యతను చాటి చెప్పే ఉద్దేశంతో వివిధ రాష్ట్రాల జర్నలిస్టులు చేపట్టిన త్రివర్ణ పతాక జైత్రయాత్ర విజయవంతంగా ముగిసింది.ఈ నెల 13న ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే)ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి శ్రీనగర్ వెళ్తుండగా మార్గమధ్యంలో జమ్మూ కాశ్మీర్ సరిహద్దులోని లకన్ పూర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. చివరకు పోలీసుల భద్రత మధ్య పాత్రికేయులు జమ్మూ కాశ్మీర్‌లోని కాట్రా వైష్ణో దేవి ఆలయానికి చేరుకున్నారు. మళ్లీ అక్కణ్నుంచి ప్రారంభమైన యాత్ర హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని కాంగ్రా జిల్లాలోని హిల్ టాప్ ప్రాంతం వరకూ కొనసాగింది. కాంగ్రా జిల్లా సరిహద్దులో జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో జర్నలిస్టులు చేపట్టిన త్రివర్ణపతాక జైత్రయాత్ర ముగిసింది. తెలంగాణా వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పి.ఆనందం, ఐఎఫ్‌డబ్ల్యూజే వర్కింగ్ కమిటీ సభ్యులు,జార్ఖండ్, తమిళనాడు, బీహార్ రాష్ట్రాలకు చెందిన జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేశారు.

స్పెయిన్ ఉగ్రదాడిలో

13 మంది మృతి

మాడ్రిడ్ : సాయంత్రం ఐదు గంటలు. అది పర్యాటకానికి ప్రసిద్ధిగాంచిన బార్సిలోనా సిటీ. నగరంలోని రాంబ్లస్ ప్రాంత కూడలి వద్ద ఎవరి పనుల్లో వారు బీజీబీజీగా నడుస్తూ తమ గమ్యాలవైపు సాగుతున్నారు. ఇంతలో బడేల్‌మని పెద్ద శబ్దం. రెప్పపాటు కాలంలోనే విధ్వంసం సృష్టించిన ట్రక్కు దాడి. ఏం జరిగిందో అని తేరుకునేలోపే దద్దరిల్లిన తుపాకుల మోతలు. చిందరవందరగా పడివున్న శవాలు. దాడితో ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలు... హాహాకారాలు. ఈ బీతావాహ వాతావరణం గురువారం స్పెయిన్‌లోని బార్సిలోనాలో చోటు చేసుకుంది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే లాస్ రాంబ్లస్ ప్రాంతంలోని కూడలి వద్ద ముష్కరులు దాడికి యత్నించారు. పుట్‌పాత్‌పై నడుకుంటూ వెళుతున్న వారిని తెలుపు రంగు వ్యాన్‌తో ఇద్దరు తీవ్రవాదులు ఢీకొట్టారు. అనంతరం తుపాకులతో పాదాచారులపైకి తీవ్రంగా విరుచుకుపడ్డారు. ముష్కరులు జరిపిన కాల్పుల్లో 13 మంది అమాయకులు మృతి చెందగా, 15 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు రెడ్ అలర్ట్ ప్రకటించినట్లుచెప్పారు. తప్పించుకున్న ముష్కరుల కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు.

బీహార్‌లో ఇంకా తగ్గని వరద ఉధృతి

●98 మంది మృతి ●3.59 లక్షల మంది స్థానచలనం

పట్నా: బీహార్‌లో వరద బీభత్సం మరింత పెరిగింది. గురువారం నాటికి మరణాలు 98కి చేరగా, 15 జిల్లాల్లో93 లక్షల మంది జనం ప్రభావితమయ్యారు. పలు పరీక్షలు వాయిదా పడగా, పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. నేపాల్‌లోనూ, రాష్ట్రంలోని ఈశాన్యం ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల 15 జిల్లాలను వరదలు ముంచెత్తుతున్నాయి.

బుధవారం వరకూ 14 జిల్లాలే వరదకు గురి కాగా, గురువారం నాటికి సహర్సను కూడా వరద ముంచెత్తింది. దక్షిణ బీహార్‌లో మరింత వర్షపాతాన్ని వాతావరణ సంస్థ అంచనా వేయగా, ఉత్తర బీహార్‌లో మాత్రం తక్కువ వర్షపాతమే నమోదు కానుంది. వరద బాధితులను ఆదుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 104ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆస్పత్రుల్లో పాముకాటు, రేబీస్ ఇంజక్షన్లను నిలువ ఉంచారు. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రత్యయ్ అమృత్ ప్రకారం.. 3.59 లక్షల మంది ఇప్పటి వరకూ సురక్షిత ప్రదేశాలకు తరలించారు. వారిలో 2.13 లక్షల మందిని పునరావాస కేంద్రాల్లో ఉంచారు. ముంపు ప్రాంతాల్లో హెలికాప్టర్ల నుంచి ఆహార పొట్లాలు వదులుతున్నారు. పడవ ఆంబులెన్సులను కూడా ఏర్పాటు చేసామని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్కే మహాజన్ ప్రకటించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు వరద బాధితులకు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వరద ఉధృతి తగ్గకపోవడంతో ముజఫ్ఫర్‌పూర్‌లోని బీహార్ యూనివర్సిటీ పునఃప్రారంభాన్ని వాయిదా వేసారు. ఇది శుక్రవారం పునఃప్రారంభం కావాల్సి ఉంది.ఇప్పటి వరకూ 39 రైళ్లు రద్దయ్యాయి. మళ్లో రైళ్లు దరిమళ్లించడమో లేక ప్రయాణ మార్గం కుదించడమో జరిగింది. తమ దళాలు 25 మంది గర్భిణులను, 55 జంతువులను రక్షించాయని ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ విజయ్ సిన్హా చెప్పారు.



అసోం, బెంగాల్‌లలో వరద బీభత్సం

మొత్తం 155 మంది మృతి - పలు రైళ్ల రద్దు

గువాహతి: అసోం రాష్ట్రంలో వరద ఉధృతి ఇంకా తగ్గుముఖం పట్టలేదు. దీంతో మరణించిన వారి సంఖ్య 123కి పెరగ్గా, 33.45 లక్షల మంది ప్ర భావితులయ్యారు. రాష్ట్రంలోని 24 జిల్లాలను వరద ముంచెత్తగా, 2,970 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 1.43 లక్షల హెక్టార్లలో పంట నష్టమైంది. మొత్తం 1.38 లక్షల మందిని పునరావా స కేంద్రాలకు తరలించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యి. రాష్ట్రంలో పలు రహదారులు, వంతెనలు వరద తాకిడికి ధ్వంసమయ్యాయి. గువాహతి, నిమాటిఘాగట్, తేజ్‌పూర్, గోయల్‌పారా, ధుబ్రిలలో బ్రహ్మపుత్ర నది ప్రమాదస్థాయికి మించి ప్రవహిస్తోంది. పశ్చిమ బెంగాల్లోనూ వరదల పరిస్థితి ఏ మాత్రం మెరుగవలేదు. ఇప్పటి వరకూ వరదలకు 32 మంది బలి కాగా, 14 లక్షల మంది బాధితులయ్యారు. ఈ రాష్ట్రంలోనూ పలు రైళ్లను దారి మళ్లించడం, రద్దు చేయడం లేదా మధ్యలోనే ఆపేయడం జరుగుతోంది. పాముకాటుకు గురై ఈ ప్రాంతాల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు.

మోడీజీ.. మాకు సత్య భారత్ కావాలి

బీజేపీ పాలనపై రాహుల్‌గాంధీ ధ్వజం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ మూడున్నరేండ్ల పరిపాలనపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ స్వచ్ఛ జపం చేస్తున్నారని, కానీ ప్రజలు మాత్రం సత్య భారత్ కోరుకుంటున్నారని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో దేశ ప్రజానీకానికి బీజేపీ ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని ఆరోపించారు. గురువారం న్యూ ఢిల్లీ జేడీ(యూ) రెబల్ నాయకుడు శరద్ యాదవ్ నిర్వహించిన ఎన్డీయేతర పక్షాల సమావేశంలో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు మోడీ 'మేకిన్ ఇండియా' నినాదమిచ్చారని... ఇప్పుడు పరిస్థితి చూస్తే మాత్రం వస్తువులన్నీ 'మేడిన్ చైనా'వి ఉంటున్నాయన్నారు. ఈ లెక్కన మోడీ 'మేకిన్ ఇండియా' పూర్తిగా ఫెయిలైనట్లు చెప్పారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకురాలేకపోయిందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్‌తో తమకు భావజాల విబేధాలున్నాయని చెప్పారు. ఇదే దేశం మాదే అని ఆర్ఎస్ఎస్ చెబుతుందని.... తాము ఈ దేశానికి చెందినవారని కాంగ్రెస్ వ్యాఖ్యానిస్తున్నట్లు వివరించారు.



జాతీయగీతం పాడని మదర్సాలపై జాతీయ భద్రతా చట్టం


బరైలీ (యూపీ): ఉత్తరప్రదేశ్ ఆదేశాలను పాటించని మదర్సాలపై చర్యలు తీసుకోనున్నారు. బరైలీలోని కొన్ని మదర్సాలు స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ గీతం ఆలపించాలని, సంబరాలను వీడియో తీయాలన్న ప్రభుత్వ ఆదేశాలనూ ధిక్కరించాయి. దీంతో జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)కింద వీటి మీదకేసులు నమోదయ్యే అవకాశం ఉంది. ఏ మదర్సా అయినా ప్రభుత్వ ఆదేశాలను పాటించలేదని, జెండా ఎగురవేయలేదని, జాతీయ గీతం ఆలపించలేదని తెలిస్తే, తాము చర్యలు తీసుకుంటామని బరైలీ కమిషనర్ చెప్పారు. ఎన్ఎస్ఏ కింద ఈ చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ చట్టం ప్రకారం నిందితులను బెయిల్ లేకుండా చేయెుచ్చు. దేశభద్రతకు ప్రమాదమన్న అంశం మీద నిందితులను ఈ చట్టం కింద అరెస్టు చేస్తారు. చాలా వరకూ మదర్సాలు ఆదేశాలను పాటించినా కొన్ని మాత్రం పాటించలేదు. కొంత మంది మత పెద్దలు ఆదేశాలను పాటించవద్దని పిలుపునివ్వడంతో కొన్ని మదర్సాలు మాత్రం ఆదేశాలను ధిక్కరించాయని తెలుస్తోంది.

లండన్‌లో హిందూ, యూదు లెస్బియన్ల వివాహం



లండన్ : లండన్‌లో హిందూ, యూదు మతానికి చెందిన తొలి మహిళా లెస్బియన్ వివాహం జరిగింది. భారత మూలాలున్న బ్రిటన్ జాతీయురాలు, అమెరికాకు చెందిన యూదు మహిళను పెళ్ళి చేసుకుంది. ఈ వివాహం యూకేలో ఇరువురి కుటుంబీకుల మధ్య జరిగింది. లండన్‌కు చెందిన కళావతి మిస్త్రీ (48), అమెరికాలో టెక్సాస్ నగరంలో మిరియం జెఫర్‌సన్‌ను ఓ కోర్సు శిక్షణ నిమిత్తం ఇరవై సంవత్సరాల క్రితం కలుసుకుంది. అలా వీరి మధ్య చిగురించిన స్నేహబంధం కోర్సు ముగిసి ఉద్యోగాల్లోకి వెళ్ళాక కూడా కొనసాగుతోంది. యవ్వన వయస్సు రాగానే తను స్వలింగ సంపర్కులిరాలినన్న విషయాన్ని కళావతి గ్రహించింది. అయితే, వెంటనే ఈ విషయం కుటుంబీకులు, సన్నిహితులు, స్నేహితులకు చెప్పడానికి చాలాకాలం ఇబ్బంది పడ్డానని కళావతి వెల్లడించింది. అదే సమయంలో స్నేహితురాలైన మిరియం కూడా లెస్బియన్ అని తెలియడంతో ఇద్దరూ ఒక్కటయ్యేందుకు అంగీకారం కుదిరింది. దీంతో, తమ వివాహానికి ఇరు కుటుంబాలు ఒప్పుకున్నాయని కళావతి చెప్పింది. ఈయేడాది జనవరిలో టెక్సాస్ రాష్ట్రం శాన్ ఆంటోనియాలో యూదు మతస్థురాలైన మిరియం ఇంటి సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. గత వారం కూడా వీరు హిందూ సంప్రదాయం ప్రకారం ఏకమయ్యారు.

జాతి వివక్ష హింసను ఖండించిన సత్యా నాదెళ్ళ



వాషింగ్టన్ : వర్జీనియాలో జాతి వివక్షపై జరిగిన అల్లర్లను మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యా నాదెళ్ళ తీవ్రంగా ఖండించారు. భయంకరమైన హింసాత్మక ఘటనలు తనను ఎంతగానో బాధించాయన్నారు. నాగరికతకు పేరున్న అమెరికా వంటి దేశానికి ఇటువంటి సంఘటనలు ఎంతో అవమానకరమన్నారు. ఈ మేరకు ఆయన తన కంపెనీలోని ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా ఈ సందేశాన్ని అందజేసినట్లు మైక్రోసాఫ్ట్ కంపెనీ బృందం తెలిపింది. ద్వేషానికి అమెరికాలో స్థానం లేదని వ్యాఖ్యానించారు. దాడుల్లో మరణించిన 32 ఏండ్ల మహిళ ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఇటువంటి దాడులు భవిష్యత్‌లో చోటు చేసుకోకుండా అమెరికా ప్రజానీకమంతా సంఘటితంగా ముందుకెళ్ళాలని సూచించారు. కాగా, ఈ ఘటనను ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఖండించారు. సామాన్యుల హక్కులు, వారిపై జరుగుతున్న అణచివేతను ప్రశ్నించేందుకు తాము రూపొందించినఫేస్బుక్ ఉపయోగపడుతందని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమని వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆపిల్ సీఈఓ కూడా ఒక ప్రకటనలో వర్జీనియా అల్లర్లను ఖండించారు.

మల్టీకలర్ ఎంఆర్ఐతో

సులువుగా వ్యాధి నిర్ధారణ

వాషింగ్టన్: మల్టీకలర్ ఎంఆర్ఐతో ఇక నుంచి సులువుగా వ్యాధిని నిర్ధారించవచ్చని ఇటీవల వాషింగ్టన్‌కు చెందిన అధ్యయనకారులు కనుగొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎంఆర్ఐ కేవలం ఒకే రంగులో చూపిస్తుందని చెప్పారు. దీంతో, అవయవాల లోపలి భాగాన్ని సంబంధిత వైద్యులు పూర్తిగా పరిశీలించే అవకాశం ఉండటం లేదన్నారు. కానీ, తాము కనుగొన్న మల్టీ కలర్ ఎంఆర్ఐ స్కానింగ్ మాత్రం అవయవాలు, కండరాలను పలు రంగులలో స్పష్టంగా చూపిస్తుందని వాషింగ్టన్‌లోని వెస్టరన్ రిజర్వ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధ్యయనకారులు వెల్లడించారు. మానవ శరీర నిర్మాణాన్ని పూర్తిగా అధ్యయనం చేసేందుకు తాము రూపొందించిన ఎంఆర్ఐ పద్ధతి ఉపయోగ పడుతుందన్నారు. దాంతో, రోగ నిర్ధారణ వైద్యులకు సులవు అవుతుందని ప్రముఖ అధ్యయనకారుడు ప్రొఫెసర్ చెరిస్ ఫ్లాస్క్ తెలిపారు. తమ అధ్యయనం సైంటిఫిక్ రిపోర్ట్స్ అనే జర్నల్‌లో ప్రచురితమైనట్లు చెప్పారు.

Andhraprabha business 2017

బిజినెస్

BUSINESS

వడ్డీరేట్లు తగ్గుతాయ్: కిద్వాయ్



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉందని వెటరన్ బ్యాంకర్ నైనా లాల్ కిద్వాయ్ పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్‌బీఐ పాలసీ ప్రయోజనాలను ఖాతాదారులకు చేరేలా బ్యాంకర్లపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఇటీవల రెపో రేటును 6శాతం నుంచి 0.25 శాతం ఆర్బీఐ తగ్గించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది. రెపో రేటు తగ్గింపు గత పదినెలల్లో ఇదే తొలిసారి. తద్వారా పాలసీ రేట్లు ఏడేళ్ల కనిష్టానికి చేరాయి. మొత్తంగా వడ్డీరేట్ల తగ్గింపునకు సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే కేవలం ఆర్‌బీఐ మాత్రమే వడ్డీరేట్లను తగ్గిస్తే లక్ష్యాలు నెరవేరవు. ఆ మేరకు ప్రయోజనాలను బ్యాంకులు పారిశ్రామిక రంగానికి బదలాయించాలి. మొండి బకాయిలు, నష్టాలను అధిగమించడంలో బ్యాంకుల సమర్థతపైనా దృష్టిసారించాలని అని కిద్వాయ్ అభిప్రాయ పడ్డారు. మొండిబకాయిల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు చేపట్టనుండటం మంచి పరిణామం. బ్యాంకింగ్ రంగంలో ఎన్‌పీఏలు క్రమంగా తగ్గుముఖం పడతాయని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు. కిద్వాయ్ ఫిక్కీ చైర్మన్‌గా, హెచ్ఎస్‌బీసీ ఇండియా అధినేతగా గతంలో బాధ్యతలు నిర్వర్తించారు. దేశవ్యాప్తంగా బ్యాంకులకు 8 లక్షల కోట్ల రూపాయల మొండిబకాయిలు ఉన్నాయి. కాగా, ఒక్క ప్రభుత్వ రంగంలోని బ్యాంకుల ఎన్‌పీఏలు రూ. 6 లక్షల కోట్లు ఉన్నాయి.

పొదుపు వడ్డీ గోరంతే..

- సేవింగ్స్ ఖాతా సొమ్ముపై వడ్డీ తగ్గించిన బ్యాంకులు
- ఎస్‌బీఐ బాటలో హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, యెస్‌బ్యాంక్



న్యూఢిల్లీ: మధ్య తరగతి పొదుపు ఆశలపై బ్యాంకులు నీళ్లు చల్లుతున్నాయి. వేతన జీవులతోపాటు, సాధారణ మధ్యతరగతి ప్రజానీకం కష్టార్జిత మదుపుపై బ్యాంకులు వడ్డీరేట్లను మరింత తగ్గించాయి. దీంతో పొదుపు ఖాతాల్లోని మొత్తాలపై వస్తున్న కొద్దోగొప్ప ఆదాయానికి గండిపడి నట్లయింది. మొన్న సేవింగ్స్ ఖాతాల్లోని సొమ్ముపై ఎస్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించగా, ఇప్పుడు హెచ్‌డీఎఫ్‌సీ, యెస్ బ్యాంకులు కూడా అదే బాటలో సాగుతున్నాయి. ఆగస్టు రెండు నాటి మానిటరీ పాలసీలో ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించడానికి ముందే జులై31న ఎస్‌బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటన చేసింది. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సైతం పొదుపు ఖాతాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటిదాకా నాలుగు శాతంగా ఉన్న సేవింగ్స్ ఖాతా వడ్డీ రేట్లను 0.5శాతం మేరకు తగిస్తూ హెచ్‌డీఎఫ్ నిర్ణయం తీసుకుంది. అయితే ఇది 50 లక్షల లోపు డిపాజిట్లకు మాత్రమే. అంతకంటే పెద్దమొత్తాలపై ఎప్పటిలాగే 4 శాతం వడ్డీరేటు వర్తిస్తుందని, కొత్త వడ్డీరేట్లు ఆగస్టు 19నుంచి అమలవుతాయని పేర్కొంది.

దేశీయ ప్రభుత్వరంగ దిగ్గజ బ్యాంకు తొలిసారి వడ్డీరేట్ల కోతకు తెరతీసింది. సేవింగ్స్ ఖాతాల్లోని కోటి రూపాయల మొత్తంపై 0.50 శాతం వడ్డీని తగ్గిస్తూ 3.5శాతానికి పరిమితం చేసింది. కోటికిపైగా ఉన్న సొమ్ముకు మాత్రం నాలుగు శాతం వడ్డీరేటు వర్తిస్తుందని తెలిపింది.

ప్రైవేటురంగంలోని యెస్ బ్యాంక్ కూడా ఎస్‌బీఐ బాటనే అనుసరించింది. పొదుపు ఖాతాలపై ఐదు శాతంగా ఉన్న వడ్డీరేటులో ఒక శాతం కోత విధిస్తున్నట్లు బుధవారం నాడు ప్రకటిచింది. లక్ష రూపాయల లోపు ఖాతాలకు ఈ నిర్ణయం వర్తిస్తుందని, లక్షరూపాయలకు పైగా ఉన్న సొమ్ముకు 6శాతం వడ్డీ చెల్లిస్తామని తెలిపింది. పెద్ద మొత్తాలకు ఇదివరకు 6.5 శాతంగా చెల్లిస్తున్న వడ్డీని 6.25 శాతానికి పరిమితం చేసింది. బ్యాంక్‌ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, కర్నాటక బ్యాంక్, ఇండియన్ బ్యాంకులు కూడా పొదుపు ఖాతాలపై వడ్డీకి కోత విధించాయి. నాలుగు శాతం వడ్డీరేటును 3.5శాతానికి తగ్గించేలా చర్యలు తీసుకున్నాయి.

రింగింగ్ జాబ్స్

- 2018 నాటికి టెలికంలో 30 లక్షల ఉద్యోగాలు
- 4జీ, డిజిటల్, స్మార్ట్‌ఫోన్ల విప్లవాలతో కొలువుల డిమాండ్



న్యూఢిల్లీ: పోటీ తీవ్రత నేపథ్యంలో ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టెలికాం రంగం లక్షలాది ఉద్యోగ అవకాశాలకు కేరాఫ్‌గా మారబోతోంది. 4 జీ టెక్నాలజీ విస్తృత వినియోగం దేశీయంగా మార్కెట్ విస్తరణకు వీలు కల్పిస్తోంది. అదే సమయంలో డిజిటల్ విప్లవం మూలంగా వాలెట్ల ప్రాచుర్యం పెరగడం, స్మార్ట్‌ఫోన్ల వినియోగం సర్వసాధారణం కావడం వంటి పరిణామాలు టెలికాం రంగంలో టెక్నాలజీకి మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఈ రంగంలో 2018 చివరినాటికి దాదాపు 30 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని అసోచామ్-కేపీఎంజీ సంయుక్త అధ్యయనం ఒకటి వెల్లడించింది.

ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్న 5జీ, ఎం2ఎం, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఐసీటీ) పరిణామ క్రమంతో ఈరంగంలో ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయని తెలిపింది. 2021 నాటికి సుమారు 8.7 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని అసోచామ్-కేపీఎంజీ సర్వే అంచనా వేసింది. ప్రస్తుతం టెలికాం రంగానికి అందుబాటులో ఉన్న మానవ వనరులు అంతంతమాత్రమే. నైపుణ్య అవసరాలను తీర్చేందుకు ఇదెంతమాత్రం సరిపోదు. భవిష్యత్ అవసరాలకు గణనీయ సంఖ్యలో మానవ వనరుల అసవరం ఉంది. ఇన్‌ఫ్రా, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో నిపుణులైన సిబ్బంది కొరతను అధిగమించాల్సిన అవసరం ఉంది. సైబర్ భద్రత నిపుణులు, అప్లికేషన్ డెవలపర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నీషియన్స్, హ్యాండ్‌సెట్ టెక్నీషియన్స్‌కు పరిశ్రమలో మండి డిమాండ్ ఉంటుంది. అదేవిధంగా ఇప్పటికే ఉన్న సిబ్బంది భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవడం కూడా ప్రధానమని ఈ అధ్యయనం తెలిపింది.

డిమాండ్‌కు అనుగుణంగా నిపుణులను సమకూర్చుకునేందుకు టెలికాం సెక్టార్ స్కిల్ కౌన్సెల్ ప్రత్యేక ఏర్పాట్లును చేసుకుంటోంది. ప్రత్యేక నైపుణ్య కార్యక్రమాలను చేపడుతూ, మానవ వనరుల సమర్థతను పెంపొందించే చర్యలు చేపడుతూ, సుస్థిర ప్రగతిని కొనసాగించే ప్రణాళికలు అమలు చేస్తున్నది. సబ్‌స్క్రైబింగ్ ఆధారంగా టెలికాం సెక్టార్ వార్షిక స్థూల అభివృద్ధి రేటు 19.6 శాతంగా ఉంది. అదే క్రమంలో గత కొన్ని సంత్సరాల గణాంకాల ప్రకారం ఆదాయ వృద్ధి 7.07 శాతంగా ఉంది. టెలికాం ప్రొవైడర్లు ప్రస్తుతవ్యవస్థను ఆధునికీకరిస్తూనే, కొత్తగా పెట్టుబడులు పెడుతున్నారు. ఆపరేటర్ల మూలధన వ్యయాలు తొలి త్రైమాసికానికి 85 వేల కోట్లుగా నమోదైందని అసోచామ్- కేపీఎంజీ అధ్యయనం వివరించింది.

మూడోరోజూ లాభాల్లోనే..

ముంబై: గతవారం వరుస నష్టాలను మూటగట్టుకున్న ఇండియన్ స్టాక్ మార్కెట్లు ఈవారం సానుకూల ధోరణిని కొనసాగిస్తున్నాయి. వరుసగా మూడోరోజూ నిఫ్టీ-50 సూచీ లాభాల్లోనే ముగిసింది. గువారం ఒడిదొడుగుల మధ్య సాగిన సూచీ ముగింపులో 7 పాయింట్లు పెరిగి 9904.15 వద్ద ముగిసింది. ఐటీ, మీడియా రంగ షేర్లలో కొనుగోళ్లు జరిగాయి. దేశీయ కొనుగోళ్ల మద్దతు మార్కెట్‌ను ముందుక ు నడిపించింది. ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్ ప్రపోసల్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ సంస్థ షేరు 4.68 శాతం లాభపడి రూ. 1020.85కి ఎగిసింది. ఎన్‌టీపీసీ 3.94శాతం, కోల్‌ఇండియా 3.78 శాతం, వేదాంత 2.56 శాతం, భారతి ఎయిర్ టెల్ 2.11 శాతం పెరిగాయి. సిప్లా 2.92 శాతం, అదాని పోర్ట్స్ 2.08 శాతం, ఏసీసీ 1.72 శాతం, మారుతి 1.54 శాతం, అరబిందో ఫార్మా 1.46 శాతం మేర నష్టపోయాయి. ప్రారంభంలో లాభాల్లో సాగిన నిఫ్టీ ఒక దశలో 9945.55 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో 9883.75 పాయింట్ల కనిష్టాన్ని చేరి చివర్లో కోలుకుంది. గత మూడు సెషన్లలో నిఫ్టీ 193.35 పాయింట్లు వృద్ధి చెందింది.

మిస్త్రీ సంస్థలతో టాటా డీల్స్ రద్దు



న్యూఢిల్లీ: కొత్త చీఫ్ ఎన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో టాటా గ్రూప్ కీలక నిర్ణయం తీసుకు న్నట్లు సమాచారం. గతంలో టాటా గ్రూపు చైర్మన్ గా వ్యవహరించిన సైరస్ మిస్త్రీ కుటుంబ కంపెనీలైన షాపూర్జీ పల్లోంజి గ్రూప్‌తో అన్ని రకాల లావాదేవీలను రద్దు చేసుకోవాలని టాటా సన్స్‌బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు సమ్మేళన సంస్థలకు మార్గ దర్శకాలు జారీచేసిందని టాటా గ్రూపు వర్గాలు తెలిపాయి. కాగా, తాజా నిర్ణయంపై ఎస్‌పీ గ్రూపు స్పందించింది. మిస్త్రీ చైర్మన్‌గా ఉన్నప్పుడే ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ రంగాలకు సంబంధించిన టాటా కంపెనీల కాంట్రాక్టులు జీరో దశకు చేరుకున్నాయని, ఒకవేళ అరకొర ఏమైనా పెండింగ్‌లో ఉన్నా వాటి విలువ చాలా తక్కువగా ఉంటుందని తెలిపింది. 2012-13లో 1,125 కోట్ల రూపాయలుగా ఉన్న ఆర్డర్లు 2015-16 నాటికి సున్నాకు చేరాయని తెలిపింది. గతేడాది మిస్త్రీకి, టాటా గ్రూపునకు మధ్య వివాదం తలెత్తిన నేపథ్యంలో ఈ రెండు గ్రూపుల మధ్య వ్యాపార సంబంధాలు కూడా తగ్గుతూ వచ్చాయి. టాటాసన్స్‌లో 18.4 శాతం వాటాతో అతిపెద్ద షేర్‌హోల్డర్‌గా ఎస్పీ గ్రూపు ఉంది. గతేడాది బోర్డు రూమ్ వార్ తర్వాత టాటా గ్రూపు, సైరస్ మిస్త్రీ కోర్టులో పరస్పరం పోరాడుతున్నారు.

ఓఎన్‌జీసీకి సేఫ్టీ అవార్డు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ విభాగం వరుసగా మూడోసారి ప్రతిష్టాత్మక నేషనల్ సేఫ్టీ అవార్డు (మైన్స్) అందుకుంది. 2013 సంవత్సరానికి గాను ప్రకటించిన నేషనల్ సేఫ్టీ అవార్డుల్లో రాజమండ్రి అసెట్ విభాగం ఈ ఘనత సాధించింది. అంతకంటే ముందు 2011, 2012 సంవత్స రాల్లోనూ ఈ జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎంఆర్ శేఖర్ ఈ అవార్డును అందుకున్నారు. చమురు, సహజవాయువు వెలికితీయడం కోసం నిర్వహించే డ్రిల్లింగ్ కార్యక్రమాల్లో అత్యల్ప గాయాల రేటు నమోదు చేసినందుకు ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ విభాగం ఈ అవార్డు కోసం ఎంపికైంది. కార్మికులు గాయపడే సందర్భాలు చాలా తక్కువగా నమోదవుతున్నాయి.

సియాజ్-ఎస్ ధర రూ.9.39 లక్షలు



న్యూఢిల్లీ: దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి ఇండియా గురువారం స్పోర్టీ వెర్షన్ కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. మధ్యస్థాయి సేడాన్ తరహాలో ఉండే సియాజ్ మోడల్ పెట్రోల్ వెర్షన్ ధర రూ. 9.39 (ఢిల్లీ ఎక్స్ షోరూం) లక్షలుగా నిర్ణయించింది. డీజిల్ వెర్షన్ స్మార్ట్‌హైబ్రిడ్ బ్లాక్ ప్రీమియం ఇంటీరియర్ బ్లాక్ కలర్‌లో ఉంటుంది. గ్రే క్రోమ్ ఫినిషింగ్‌తో ఆకర్షనీయంగా ఉండే సియాజ్-ఎస్ ధర రూ. 11.55 లక్షలు. దీని ఇంధన సామర్థ్యం లీటర్‌కు 28.09 కి.మీ.

సియాజ్-ఎస్ ప్రవేశంతో స్పోర్టీ లైఫ్‌ను ఎంజాయ్ చెయ్యాలనుకునే ప్రీమియం తరగతికి ఇది అన్నివిధాల సౌకర్యంగా ఉంటుందని మారుతి సుజుకి ఇండియా సీనియర్ కార్యనిర్వహణాదికారి (మార్కెటింగ్ అండ్ సేల్స్) ఆర్ ఎస్ కల్సి ఒక ప్రకటనలో తెలిపారు. 2014 అక్టోబర్‌లో విడుదలైన సియాజ్‌కు మంచి డిమాండ్ లభించిందని, దేశవ్యాప్తంగా 1.7 లక్షల కార్లను విక్రయించామని పేర్కొన్నారు.

ఇన్ఫీ బైబ్యాక్ ఆఫర్



న్యూఢిల్లీ: దేశీయంగా రెండవ అతి పెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్‌కు సిద్ధమైంది. ఈ మేరకు ప్రతిపాదనను రేపు (శని వారం) జరగనున్న బోర్డు సమావేశం ముందు ఉంచను న్నారు. దాదాపు 13వేల కోట్ల షేర్లను కొనుగోలు చేయాలని సంస్థ నిర్ణయించింది. ఇలా బైబ్యాక్ ప్రతిపాదన తీసుకు రావడం ఇన్ఫీ 36 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి. సంస్థ వ్యవస్థాపకులు, హైప్రొఫైల్ మాజీ ఎగ్జిక్యూటివ్‌ల దీర్ఘకాలిక డిమాండ్ మేరకు ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. డివిడెండ్ లేదా షేర్ల బైబ్యాక్ ద్వారా షేర్‌హోల్డర్లకు 13వేల కోట్లను చెల్లిస్తామని గత ఏప్రిల్‌లో ఇన్ఫీ ప్రకటించింది. జూన్ 30 నాటికి ఇన్ఫీ బుక్ వ్యాల్యూ 3.5 బిలియన్ డాలర్లుగా ఉంది. వివిధ దేశాల్లోని స్టాక్‌మార్కెట్లలో లిస్టింగ్ కంపెనీగా ఉన్నందున, ఆయా దేశాల్లోని చట్టాలకు అనుగుణంగా షేర్ హోల్డర్ల అనుమతులు పొందాల్సి ఉందని సంస్థ చైర్మన్ ఆర్ శేషసాయి చెప్పారు. కాగా, ఈ యేడాది అనేక ఐటీ సంస్థలు బైబ్యాక్ వైపు మొగ్గుచూపాయి. ఇన్ఫీకి ప్రధాన పోటీదారు అయిన టీసీఎస్ మెగా బైక్యాక్‌ను ప్రకటించింది. బహిరంగ మార్కెట్ నుంచి 16వేల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటిం చింది. ఇదేబాటలో విప్రో, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, మైండ్‌ట్రీ సంస్థలు కూడా బైబ్యాక్‌కు ప్రకటనలు చేశాయి.

మెరిసిన బంగారం, వెండి

- పసిడి 30వేలు • సిల్వర్ 40వేలు



ముంబై: అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ సానుకూలంగా ఉండటం, దేశీయ డిమాండ్ మూలంగా బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఊర్ధ్వముఖంగా పయనిస్తున్నాయి. గురువారం మార్కెట్‌లో బంగారం పది గ్రాముల ధర 300 రూపాయలు పెరిగింది. దీంతో పసిడి మళ్లీ 30 వేల మార్కును దాటింది. అదేసమయంలో వెండి కూడా తళుక్కుమంటోంది. ఇటీవల ఒడిదొడుగుల అనంతరం సిల్వర్ 40 వేల మార్కును అధిగమించింది. గురువారం కిలో వెండిధర అంతర్జాతీయ మార్కెట్‌లో 900 రూపాయలు పెరిగి రూ. 40, 200కు చేరింది. పారిశ్రామక అవసరాలకు తోడు, కాయిన్ మేకర్స్ నుంచి డిమాండ్ వెండి ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో 99.9, 99.5 శాతం స్వచ్ఛత బంగారం ధరలు వరుసగా రూ. 30,050, 29,900గా ఉన్నాయి. జులై సమావేశంలో ఫెడరల్ రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయంచడంతో మదుపర్లు మంచి రిటర్న్లుల కోసం, భద్రతమైన పొదుపు పథకంగా బంగారంలో పెట్టుబడులను ఎంచుకుంటున్నారు.

యూఎస్ బృందానికి ఇవాంక సారథ్యం



న్యూఢిల్లీ: హైదరాబాద్ వేదికగా నవంబర్‌లో మూడు రోజుల పాటు జరగనున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సుకు హాజరయ్యే అమెరికా బృందానికి అమెరికా అధ్యక్షుడి కుమార్తె ఇవాంక ట్రంప్ సారథ్యం వహించ నున్నారు. ఈ సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కూడా వస్తున్నందున ఈవెంట్‌కు విశిష్ట గుర్తింపు లభించే అవకాశం ఉంది. వివిధ దేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులు సదసుల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. నవంబర్ 28న జరిగే ఈ ఉన్నతస్థాయి ప్రతినిధుల కార్యక్రమానికి ఇవాంక ట్రంప్ హాజరవుతారని, ఆమె అమెరికా బృందానికి నాయకత్వం వహిస్తారని న్యూఢిల్లీలో యూఎస్ అధికారులు వెల్లడిం చారు. జీఈఎస్ 2017 సదస్సుకు అమెరికాకు నేతృత్వం వహించడం తనకు లభించిన గౌరవం.

ఈ సందర్భంగా ఇండియా ప్రధాని మోడీని కలిసే అవకాశం లభిస్తుంది. అదేవిధంగా వివిధ దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను కలుసుకునే వీలుంటుంది అని గతవారం ఇవాంక ట్వీట్ చేశారు. కాగా, జీఈసీ వేడుకకు 50 మంది మహిళా ప్రతినిధులు హాజరవుతారని అమెరికా అధికారులు ఆకాంక్షించారు. భవిష్యత్ వాణిజ్యంలో మహిళలే కీలకం కానున్నారని అభిప్రాయపడ్డారు. జీఈసీలో ప్రధానంగా ఇంధన, మౌలిక, సాంకేతిక టెక్నాలజీ, డిజిటల్ ఎకానమీ, మీడియా, వ్యవసాయం తదితర రంగాల్లో పెట్టుబడులపై చర్చిస్తారు. గతంలో అమెరికాకు వెలుపల జీఈసీ సదస్సును మొరాకొ, కెన్యా, యూఏఈ, మలేషియా, టర్కీ దేశాల్లో నిర్వ హించారు. కాగా, భారత్‌లో నిర్వహించడం ఇదే తొలిసారి. కార్పొరేట్ దిగ్గజాలు మైక్రోసాఫ్ట్ ఫేస్‌బుక్, ఆపిల్, సిస్కో, గూగుల్ సంస్థలు మునుపటి సదస్సులో పాల్గొన్నాయి. ఈ యేడాది సదస్సుకూ అగ్ర సంస్థలు హాజరవుతాయని ఆశిస్తున్నట్లు యూఎస్ అధికారులు చెప్పారు.

ఇండియాకు యూఎస్ చమురు

వాషింగ్టన్: ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్‌తో భేటీ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇంధన రంగంలో కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా 100 మిలియన్ డాలర్ల విలువైన తొలి క్రూడ్‌ఆయిల్ షిప్‌మెంట్ వచ్చేనెల ఇండియాకు చేరుకోనుంది. సెప్టెంబర్ 6-14 తేదీల్లో ఒడిశాలోని పారదీప్ రేవుకు సరఫరా కానుంది. పెరుగుతున్న భారత్ చమురు అవసరాలకు అనుగుణంగా విశ్వసనీయ, దీర్ఘకాలిక చమురు సరఫరా దారుగా వ్యవహరించేందుకు అమెరికా అంగీకరించింది. 40 ఏళ్లనాటి చమురు ఎగుమతుల నిషేధాన్ని ఒబామా ప్రభుత్వం ఎత్తివేసిన రెండేళ్ల తర్వాత అమెరికా క్రూడాయిల్ ఇండియాకు సరఫరా అవుతోంది. దేశీయ ఆయిల్ దిగ్గజ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం ఈ మేరకు అగ్రరాజ్యం నుంచి నాలుగు మిలియన్ బ్యారళ్ల చమురు దిగుమతులకు ఆర్డర్ ఇచ్చాయి. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద చమురు దిగుమతి దారుగా భారత్ ఉంది. ఒపెక్ దేశాలు ఉత్పత్తుల తగ్గింపు నిర్ణయం తీసుకున్న తర్వాత అమెరికా నుంచి దిగుమతులు చేసుకుంటున్న ఆసియా దేశాలు ద. కొరియా, జపాన్, చైనా సరసన ఇప్పుడు ఇండియా చేరింది. వచ్చే 20 ఏళ్లలో ఇండియా ఇంధన వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.

డ్రాగన్‌పై వాణిజ్య అస్త్రం

- చైనా వస్తువుల్లో భద్రతా లోపాలు
- సాంకేతికతను చైనా చౌర్యం చేస్తోందన్న అనుమానం
- ఐటీ వస్తువులు నిషేధించే యోచనలో కేంద్రం



న్యూఢిల్లీ: తమ ఐటీ ఉత్పత్తులతో భారత మార్కెట్ ను కబ్జా చేస్తున్న చైనాకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. చైనా ఐటీ ఉత్పత్తుల ద్వారా భద్రతతో పాటు ఇతర కీలకమైన అంశాలు లీకౌతున్నాయని భావిస్తున్న కేంద్రం ఆదేశ ఉత్పత్తులపై పునఃసమీక్షించాలని నిర్ణయించింది. సిక్కిం సెక్టర్‌లోని డోక్లామ్ వద్ద రెండు నెలలకు పైగా ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ ఆదేశ ఐటీ ఉత్పత్తులపై నిషేధం విధించడం ద్వారా డ్రాగన్ దెబ్బతీయాలని యోచిస్తోంది. ప్రస్తుతం భారత్‌లో చైనా ఐటీ, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల విలువ 22బిలియన్ డాలర్లు ఉంటుందని భారత పారిశ్రామిక సమాఖ్య -సీఐఐ అంచనా వేసింది. స్వదేశీ వస్తువుల ఉత్పత్తి పెంచడం ద్వారా ఆర్థిక పురోభివృద్ధికి బాటలు వేయాలని భావిస్తున్న నరేంద్రమోడీ సర్కారు...మన మార్కెట్‌లో చైనా ఉత్పత్తులను దశల వారీగా నిషేధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రానిక్ మరియు తయారీరంగంలో వస్తువులను చైనా నిబంధనలకు తూట్లుపొడుస్తూ తయారు చేస్తున్నందున వాటిని నిషేదియడమే మేలని భావిస్తోంది. చైనా వస్తువుల వాడకం వల్ల సున్నితమైన సమాచారాన్ని తస్కరించే వీలుంటుందని..దీని వల్ల భద్రతా పరమైన చిక్కులువచ్చే అవకాశం ఉంటుందన్నది పరిశ్రామిక వర్గాల సమాచారం.

ఆన్ లైన్ భద్రతా బెదిరింపులపై ఆందోళన

చైనా మైబైల్ ఫోన్లు, వైద్యపరికరాలు, టెలికంనెట్ వర్క్ గేర్లు, ఇంటర్ నెట్ పరికరాల వాడకం వల్ల మన దేశానికి సంబంధించిన కీలక సమాచారం చైనా సర్వర్లుకు వెళ్లే ప్రమాదముందని ఐటీ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్యలకు సిద్ధమౌతోంది. డోక్లామ్ వివాదం మరింత ముదిరితే చైనా -భారత్‌ను సాంకేతికంగా దెబ్బతీసే అవకాశమున్నందున తక్షణ చర్యలే మేలన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. చైనా ఉత్పత్తులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడటంతో భారత్ ఆదాయం కూడా పెద్దమొత్తంలో చైనాకు వెళ్తోంది.దీంతో భారత్ వాణిజ్యలోటు రోజురోజుకూ పెరుగుతోంది.

93 ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ ఛార్జీలు

సరిహద్దుల్లో కయ్యానికి కాలుదువ్వుతున్న చైనాను ఆర్థికంగా దెబ్బతీసేందుకు భారత్ చర్యలను వేగవంతం చేసింది. ఇప్పటికే చైనా ఉత్పత్తులపై యాంటి డంపింగ్ డ్యూటీని భారత్ భారీగా పెంచేసింది. చైనాకు చెందిన వస్తువులపై 93 శాతం యాంటీ డంపింగ్ డ్యూటీ విధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకంది. 2011లో మొదటిసారిగా యాంటీ డంపింగ్ డ్యూటీని ఐదేళ్ల కాలానికి విధించగా.. ఆ కాలపరిమితిని మరో ఐదేళ్లకు పెంచుతున్నట్లు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. చైనా ఉత్పత్తుల వినియోగం తగ్గి ...దేశీయ ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. భారత్ తీసుకున్ననిర్ణయంపై చైనా ఘాటుగా స్పందించింది. యాంటీ డంపింగ్ ఛార్జీలు పెంచితే భారత్‌లో పెట్టుబడులు పెట్టబోమని హెచ్చరించింది. ఛార్జీల పెంపు అంశాన్ని పునరాలోచించుకోవాలని చైనా భారత్‌కు సూచించింది.

చైనావస్తువులు

బహిష్కరించాలని పిలుపు

చైనా నుంచి భారత్‌కు ఎదురౌతున్న ప్రమా దాలు, బెదిరింపులు,ఆక్రమణ ధోరణులు రోజురోజుకూ శృతిమించుతున్న నేపథ్యంలో చైనా వస్తువులను బహిష్కరించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.తమదేశంలో చౌకధరకు తయారైన వస్తువులను భారత్‌లో డంప్ చేయడం ద్వారా భారత ఆర్థిక శక్తిని అడ్డుకోవాలని చైనా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మన విదేశీ మారక ద్రవ్య ఖర్చులో 41శాతం చైనాకు చేరుతున్నందున... మన దేశ పరిశ్రమలు మూతపడుతున్నాయని ఆవేదన చెందారు. చైనా వస్తువులను బహిష్కరించడం ద్వారా భారత ఆర్థిక పురోగతికి తోడ్పడాలని పారిశ్రామిక వర్గాలు కూడా పిలుపునిస్తున్నాయి.

చైనా సెల్ ఫోన్లపై ఆంక్షలు

దేశీయ మార్కెట్‌ను కుదేలుచేస్తున్న చైనా మొబైల్ ఉత్పత్తులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది.చైనా ఉత్పత్తులను క్రమంగా తగ్గించడం ద్వారా భారత వాణిజ్యలోటును పెంచడంతో పాటు భద్రతా పరమైన చర్యలను తీసుకోవచ్చని కేంద్రంభావిస్తోంది. చైనా సెల్ పోన్లలో భద్రతా పరమైన ఫీచర్లు లేకపోవడం.. ఉన్న ఫీచర్లు కూడా వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించేలా ఉండటంతో మొబైల్ ఫోన్లపై ఆంక్షలు విధించారు.దీనివల్ల మేకిన్ ఇండియా కు పునరుజ్జీవం లభించినట్లవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

వాణిజ్యపంగా దెబ్బతీద్దాం..

సిక్కిం సెక్టర్‌లోని డోక్లామ్‌లో వివాదం ముదురుతున్న నేపథ్యంలో చైనాను వాణిజ్యపరంగా దెబ్బతీయాలని భారత్ భావిస్తోంది. వాణిజ్యాన్ని రాజకీయ అస్త్రంగా వాడుకుని చైనా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం ద్వారా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చైనా చేపడుతున్న కార్యక్రమాలకు బ్రేక్ వేయాలని భారత్ యోచిస్తోంది.2016 లో చైనా ఉత్పత్తులు 16 శాతం భారత్‌కు చేరగా..భారత్ ఉత్పత్తులు చైనాకు కేవలం 4 శాతం మాత్రమే చేరుకోవడం గమనార్హం. మొబైల్ ఫోన్లు,ల్యాప్ టాప్‌లు,సర్క్యూట్ బోర్డులు తదితర ఎలక్ట్రానిక్ వస్తువుల ద్వారా చైనా 2016-17లో 7.8 బిలియన్‌డాలర్లు ఆర్జించింది. చైనా బ్లాక్కెట్స్ ను నిషేధిస్తున్నట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలను అతిక్రమిస్తూ చైనా తన ఉత్పత్తులను తయారు చేస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

గ్లోబల్ రిటైల్‌లో ఇండియా టాప్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ రిటైల్ అభివృద్ధి సూచీలో ఇండియా అగ్రస్థానంలో నిలిచింది. 2017 తాజా సూచీలో చైనాను భారత్ అధిగమించింది. గ్లోబల్ రిటైల్ బ్రాండ్లకు భారత్‌లో డిమాండ్ పెరుగుతుందని తాజా నివేదిక తేల్చిచెప్పింది. ఈ యేడాది తొలి ఆరు మాసాల్లో దాదాపు 70 నూతన బ్రాండ్లు ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లలోకి ప్రవేశించాయి. ఏడు అంతర్జాతీయ బ్రాండ్లు భారతీయ మార్కెట్లోకి ప్రవేశించగా, పీఈ పెట్టుబడులు 200 మిలియన్ డాలర్లకు చేరాయని సీబీఐఈ రిటైల్ మార్కెట్ నివేదిక వెల్లడించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల గ్లోబల్ రిటైల్ ఇండెక్స్ రిపోర్టుపై అన్షుమన్ మేగజైన్ చైర్మన్ మాట్లాడుతూ, పెద్దనోట్లరద్దు తర్వాత కూడా భారత్‌లో వ్యాపార కార్యకలాపాలను విస్తరించు క ునేందుకు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. ప్రైవేటు ఈక్విటీ ప్లేయర్ల పెట్టుబడులు క్రమంగా వృద్ధిచెందు తుండటం శుభపరిణామంగా పేర్కొన్నారు. వ్యాపారాన్ని సులభతరం చేసేలా పలుచట్టాలు, విధాన నిర్ణయాలు అమలు దశలో ఉన్నాయని, రిటైల్ సెగ్మెంట్‌పై వీటి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. రిటైల్ రియల్ ఎస్టేట్‌కు కూడా డిమాండ్ పెరుగుతోందని, టైర్ -1, టైర్-2 నగరాల్లో మంచి గిరాకీ ఉందన్నారు. ఇప్పటికే చాలా వరకు అంతర్జాతీయ బ్రాండ్లు దేశీయంగా మార్కెట్‌ను విస్తరించడంపై దృష్టిసారించాయి. బిగ్‌బజార్ సైతం ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాల్లో కొత్తస్టోర్లను ప్రారంభించింది. వస్త్ర వాణిజ్య విభాగానికి చెందిన పాంటలూన్ క ూడా విస్తరణ పథంలో సాగుతోంది. ప్రధాన మార్కెట్లలో రెంటల్ ట్రెండ్స్ కూడా పురోగమన దిశలో ఉన్నాయని నివేదిక తెలిపింది. ప్రధాన మార్కెట్లయిన కన్నాట్ ప్లేస్, ఖాన్ మార్కెట్, ఢిల్లీలోని సౌత్ ఎక్స్‌టెన్షన్, కోల్‌కతాలోని పార్క్ స్ట్రీట్, ఎల్గిన్ రోడ్‌లో దుకాణ సముదాయాలకు అధికంగా డిమాండ్ ఉంది.



మోడీకి తిరుగే లేదు

- ఎన్డీయేకి 349 సీట్లు
- కాంగ్రెస్‌కి 47 వస్తే గొప్ప!
- బెస్ట్ పీఎం మోడీయే
- సీఎంల్లో మమతే బెస్ట్
- నితీష్ ఆమె తర్వాతే
- ఇండియా టుడే- కార్వీ సర్వే

న్యూఢిల్లీ: లోక్‌సభకు ఇప్పుడు ఎన్నికలు జరిగితే నరేంద్ర మోడీకి ప్రత్యామ్నాయమే లేదని రూఢి అయింది. ఇండియా టుడే తాజాగా జరిపిన పొలిటికల్ ఒపీనియన్ పోల్‌లో ఈ విషయం తేటతెల్లమైంది. భారతదేశంలో మోడీయే ఇప్పటికీ తిరుగులేని అధినాయకుడిగా చెలామణి అవుతున్నారు. జాతి మూడ్ ఎలా ఉందో తెలుసుకోవాలనే ఉద్దేశంతో చేసిన ఈ సర్వేలో..ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు గనక జరిగితే ఎన్డీయేకు 349 సీట్లు వస్తాయని తేలింది. కాంగ్రెస్ పార్టీకి కనాకష్టంగా 47 సీట్లు వస్తాయి. ఇండియా టుడే గ్రూపు-కార్వీ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. పెద్ద నోట్ల రద్దు, పాకిస్తాన్ మీద మెరుపు దాడుల వంటి పెద్ద నిర్ణయాలు ప్రధానమంత్రి మోడీ ప్రజాకర్షణను అమాంతంగా పెంచేాయని ఈ ఫలితాలు రుజువు చేాయి. పెద్ద నోట్ల రద్దుతో లాభం కన్నా నష్టమే జరిగిందని 60 శాతం మంది గట్టిగా భావిస్తున్నప్పటికీ, 2019 లోక్‌సభ ఎన్నికల్లో మోడీకి తిరుగుండదన్న అభిప్రాయాన్నే ప్రజానీకం వ్యక్తం చేయడం గమనార్హం. మూడేళ్ల తర్వాత కూడా ఎన్డీయే 300ప్లస్ సీట్లు సాధించగల స్థితిలో ఉండటం విశేషం. ఇప్పటివరకు ఉన్న ప్రధానమంత్రుల్లో నరేంద్ర మోడీయే అత్యుత్తమ ప్రధానమంత్రి అని ప్రజలు తమ మనోగతాన్ని వెల్లడించారు. 2014 ఆగస్టులో జరిపిన సర్వేలో ఇందిరాగాంధీ మోడీ కన్నా 12 పర్సంటేజీ పాయింట్లు ముందున్నారు. అయితే ఇప్పుడు మాత్రం ఇందిరాగాంధీ కన్నా మోడీ 16 పర్సంటేజీ పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు.

అయితే దక్షిణాదిన ప్రధాని మోడీ పలుకుబడి చాలా తక్కువగా ఉంది. అలాగే ముస్లిములు, క్రిష్టియన్లలో కూడా ఆయనకు పెద్దగా పలుకుబడి లేదని తేలింది. ఇందిరాగాంధీయే వారి దృష్టిలో అత్యుత్తమ ప్రధాన మంత్రి. 63 శాతం మంది ప్రజలు ప్రధాని మోడీ పనితీరు బావుందని లేదా అమోఘంగా ఉందని అభిప్రాయపడ్డారు. అయితే గత జనవరిలో జరిపిన సర్వేలో వచ్చిన ప్రజాభిప్రాయంతో పోలిస్తే.. ఈసారి ఆరు పర్సంటేజీ పాయింట్లు తక్కువ వచ్చాయి. దీన్నిబట్టి పరిస్థితి మరీ అంత ఆశాజనకంగా లేదని అనుకున్నా సబబుగానే ఉంటుంది.

ప్రధాని మోడీ గ్రామీణ భారతంలో కన్నా పట్టణ భారతం లోనే అధిక ప్రజాదరణను పొందుతున్నారు. పెద్ద నోట్ల రద్దు జరిగిన తొమ్మిది నెలల తర్వాత కూడా ఇప్పుడు 60 శాతం మంది ప్రజలు మాత్రం నోట్ల రద్దుతో కష్టాలు పడ్డట్టు చెప్పారు. లాభం కన్నా ఇబ్బందులే ఎక్కువగా మిగిలాయన్నారు. నోట్ల రద్దుతో చిన్నచిన్న వ్యాపారాలు దెబ్బతిన్నాయని, ఉద్యోగాలు పోయాయని, రైతులు కడగండ్ల పాలయ్యారని తెలిపారు. ఇదే అభిప్రాయం అటు పట్టణ ప్రాంతాల్లోను, ఇటు గ్రామీణ ప్రాంతాల్లోను వ్యక్తమైంది.

నల్లధనం మీద మోడీ ప్రభుత్వం కొరడా ఝుళిపించడాన్ని అతిపెద్ద విజయంగా ప్రజలు తేల్చారు. ఈ అంశం 23శాతం ఓట్లతో టాప్‌లో నిలిచింది. అయితే దక్షిణాది వారు మాత్రం పెద్ద నోట్ల రద్దుని అతిపెద్ద విజయంగా అభివర్ణించారు.



టాప్ 6లో జైట్లీ

మోడీ కేబినెట్లో బాగా పనిచేస్తున్న మొదటి ఆరుగురు మంత్రుల్లో అరుణ్‌జైట్లీ 28 శాతం ఓట్లతో టాప్‌లో ఉన్నారు. 26 శాతం ఓట్లతో రాజ్‌నాథ్ సింగ్ రెండో స్థానంలో వచ్చారు. 21 శాతం ఓట్లతో సుష్మ స్వరాజ్ మూడో స్థానంలోను, 16 శాతం ఓట్లతో వెంకయ్యనాయుడు నాలుగో స్థానంలోను నిలిచారు. వెంకయ్యనాయుడు ఆతర్వాత ఉపరాష్ట్రపతి అయిన విషయం తెలిసిందే. 14 శాతం ఓట్లతో నితిన్ గడ్కరీ అయిదో స్థానంలోను, చివరిగా రైల్వే మంత్రి సురేష్‌ప్రభు 10 శాతం ఓట్లతో ఆరోస్థానంలోను నిలిచారు.

పాపం రాహుల్!

ఇక కాంగ్రెస్ విషయానికొస్తే..పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ పలుకుబడి తగ్గింది. కాంగ్రెస్ నుంచి ప్రధానమంత్రి అభ్యర్థిగా ఎవర్ని ఎంచుకుంటారని అడిగితే..25 శాతం మంది మాత్రమే రాహుల్‌ని ఎంచుకున్నారు. గత సర్వేతో పోలిస్తే అయిదు పర్సంటేజీ పాయింట్లు తగ్గాయి. మరి కాంగ్రెస్‌ని ఎవరు ఉద్దరిస్తారని అడిగిన ప్రశ్నకు గాంధీ కుటుంబానికి వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 43 శాతం మంది గాంధీ కుటుంబం నుంచి కాకుండా బయటివారే కాంగ్రెస్‌కు మంచి రోజులు తేగలరని చెప్పారు.

మమత బెస్ట్‌సీఎం!

భారతదేశంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శిస్తున్న ముఖ్యమంత్రుల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అగ్రస్థానంలో నిలిచారు. ఆతర్వాతి స్థానం బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌కి ఇచ్చారు.

బాలీవుడ్‌లో అమితాబ్ బచ్చన్ హిందీ సినిమా రంగంలో అత్యధిక ప్రజాదరణ ఉన్న నటుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు 20 శాతం ఓట్లు వచ్చాయి.

అవినీతి అంతం నా పంతం

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామికవేత్తలనుద్దేశించి దేశంలోతీసుకుని వస్తున్న మార్పులకు మీరే చాంపియన్లు అని అన్నారు. స్టార్టప్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశాన్ని నీతిఆయోగ్ నిర్వహించింది. ఉపాధి ఎవరో ఇస్తారని ఎదురు చూడకుండా, స్టార్ట్ అప్‌ల ద్వారా తమకు తాము ఉపాధి పొందడమే కాకుండా, పదిమందికి ఉపాధి కల్పించే స్థితికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఎదగాలన్నదే ప్రభుత్వ అభిమతమని అన్నారు. నవభారత్ నిర్మాణం అనేది ప్రభుత్వం తీసుకునే చర్యల వల్లే సాధ్యం కాదనీ, వివిధరంగాలకు చెందిన వారంతా ఇందులో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. ప్రభుత్వోద్యోగాల కోసం మధ్యదళారులను ఆశ్రయించే పాత పద్ధతికి స్వస్తి చెప్పేందుకే,గ్రూపు-3,గ్రూపు-4 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను రద్దు చేసినట్టు చెప్పారు. వస్తుసేవా పన్నును ప్రవేశపెట్టడం తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో ప్రధానమైందని ఆయన అన్నారు. ఈ పన్నును ప్రవేశపెట్టిన తర్వాత పన్ను చెల్లింపుదారుల్లో జవాబుదారీ తనం పెరిగిందని అన్నారు. వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన చెప్పారు. గతంలో పద్మాఅవార్డులకు ఎంపిక మంత్రుల సిఫార్సులపై జరిగేదనీ, ఇప్పుడు అలాంటి పద్దతి లేదని బహిరంగ నామినేషన్ పద్దతిలోనే ఎంపిక చేస్తున్నామని ఆయన చెప్పారు.ఈఅవార్డులకు ప్రజలే సిఫార్సు చేయవచ్చుననీ, ఏ వ్యక్తి అయినా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన అన్నారు.పద్మా అవార్డుల కోసం గతంలో పైరవీలు జరిగేవన్న సంగతిని ఆయన గుర్తు చేశారు. అవినీతికి ఆస్కారం లేని రీతిలో పాలనా వ్యవహారాలో గుణాత్మకమైన మార్పులు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. నవభారత్ నిర్మాణంలో అందరినీ భాగస్వాములను చేయాలన్నదే తన తపన అన్నారు. ప్రజల్లో తిష్ఠవేసిన నిర్లిప్తతా భావాన్ని తొలగించడం కూడా ప్రధానమని ఆయన అన్నారు. దేశ ప్రజలంతా దేశాభిమానం, దేశం పట్ల భక్తి ప్రపత్తులు కలవారేనని ఆయన అన్నారు. అవినీతి మూలంగా సామాన్యులు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారనీ,అందుకే అవినీతి నిర్మూలన విషయమై దృష్టిని కేంద్రీకరించినట్టు ఆయన చెప్పారు. సబ్సిడీల సొమ్మును బ్యాంకుల్లో జమ చేసి అసలైన లబ్ధిదారులకు అది చేరేట్టు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ దిశగా ఇప్పటికే పెక్కు చర్యలు తీసుకున్నామని ఆయన అన్నారు.

అమ్మ మృతిపై కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పళనిస్వామి ఈ విషయం ప్రకటించారు. కమిషన్‌కు నేతృత్వం వహించేరిటైర్డ్ జడ్జి పేరును త్వరలో ప్రకటిస్తామన్నారు. కమిషన్ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల నుంచి, ప్రభుత్వం నుంచి వచ్చిన పలు సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం చెప్పారు. ఈ నిర్ణయంతో ఏడీఎంకే వర్గాల విలీనానికి మార్గం సుగమమైంది. ఓ పన్నీర్‌సెల్వం నేతృత్వంలోని అన్నా డీఎంకే వర్గం పళని స్వామి వర్గంతో విలీనం కావాలంటే జయ మరణంపై విచారణ జరపాలని షరతు విధించడం తెలిసిందే. ఈ విషయమై మాట్లాడిన సీఎం పురచ్చి తలైవి జయలలిత అనారోగ్యం కారణంగా ఆస్పత్రి పాలయ్యారని, డిసెంబర్ 5న మరణించారని గుర్తు చేసారు. తమిళనాడుకు ఆరు సార్లు సీఎంగా పని చేసిన జయలలిత జీవితాన్ని రాష్ట్రం కోసం త్యాగం చేసారని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం అహోరాత్రులూ శ్రమించారని చెప్పారు.

వైకాపా కుట్ర!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ సమావేశంలో పాల్గొన్న రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. హింసను ప్రేరేపించి తద్వారా శాంతిభద్రత పరిస్థితిని సృష్టించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఈ విషయాన్ని వైకాపాలోని కొందరు సన్నిహితులు తనకు తెలియజేశారని ఆయన సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఉపఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వికృత చేష్టలు చేస్తోందని చెప్పారు. ఉపఎన్నిక సమీపిస్తుండడంతో పార్టీ వ్యూహాలను ఖరారు చేసే బాధ్యతను తన తనయుడు, పంచాయితీరాజ్, ఐటిశాఖ మంత్రి నారా లోకేష్‌కు చంద్రబాబు అప్పగించారు. ఉపఎన్నిక నిర్వహణ బాధ్యతను మంత్రి అచ్చెన్నాయుడు కట్టబెట్టారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ నగర పాలక సంస్థకు జరుగుతున్న ఎన్నికల్లో పార్టీ తరపున పూర్తి బాధ్యతలను పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావుకు అప్పగించారు. జిల్లాకు చెందిన మంత్రులు యనమల రామకృష్ణుడు, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో పాటు జిల్లా ఎమ్మెల్యేలు స్థానికంగా మకాంవేసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తారు. నంద్యాల ఉపఎన్నికలో ఇప్పటికే మంత్రులు అమర్నాథ్‌రెడ్డి, ఆది నారాయణరెడ్డి, కాలువ శ్రీనివాసులు, డాక్టర్ పి.నారాయణ, శిద్ధా రాఘవరావు, ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్యులు, సీనియర్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 19న మధ్యాహ్నం నంద్యాలకు చేరుకోనున్న చంద్రబాబు మరుసటి రోజు వరకు స్థానికంగానే ఉండి ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు. స్థానిక పార్టీ నాయకత్వం ఈ మేరకు రోడ్‌షోలను ఏర్పాటు చేస్తోంది. ఉపఎన్నికలో పార్టీ వ్యూహాన్ని ఖరారు చేసేందుకు మంత్రి నారా లోకేష్ ఎన్నికలయ్యే దాకా రోజువారీ సమీక్షలను వాయిదా వేసుకోనున్నారు. ప్రతి రోజూ పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఉపఎన్నికలో జరుగుతున్న ప్రచార సరళి, పోలింగ్ రోజున ఓటర్లను ఎలా తరలించాలన్న అంశంపై పార్టీ శ్రేణులకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఉపఎన్నిక బాధ్యతలను చేపట్టిన మంత్రి అచ్చెన్నాయుడు నంద్యాలలోనే మకాంవేసి పార్టీ నేతలను సమన్వయపరుస్తారు. ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తున్న మంత్రులు, పార్టీ సీనియర్లు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై భారీ మెజారిటీ సాధించేదిశగా ఎలా ముందుకు వెళ్ళాలన్న అంశంపై చర్చించనున్నారు. ఉపఎన్నికకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెప్పించి అధ్యయనం చేస్తున్న పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఇంకా ప్రజల్లోకి ఎలా వెళ్ళాలన్న అంశంపై ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. పోలింగ్‌కు ముందు మూడు రోజులు ఎంతో కీలకమని ఈ మూడు రోజుల్లో పార్టీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని గురువారం మంత్రులు, ఆయా నియోజకవర్గంలో పర్యటిస్తున్న ముఖ్య నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు కోరినట్టు సమాచారం. ఎటువంటి పరిస్థితుల్లోనూ వైకాపా అధ్యక్షుడు జగన్ చేసే ఆరోపణలు, విమర్శలను పట్టించుకోవద్దని ఎదుటి వారిని రెచ్చగొట్టి తద్వారా తనకు లబ్ధి కలగాలన్న కుట్రతో జగన్ ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రిని నడిరోడ్డులో చంపేయండని, ఉరి తీయండని, బట్టలూడదీయాలని జగన్ చేసిన విమర్శలను తటస్థ ఓటర్లు చర్చించుకుంటున్నారని వైకాపాలోని ఒక వర్గం జగన్ చేసిన వ్యాఖ్యలతో తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చంద్రబాబు చెప్పారు. ఉపఎన్నికలో ఓడిపోతున్నామనే భయం వైకాపాను ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని వెంటాడుతోందని అందుకే ఆయన తనపై దూషణల పర్వానికి దిగారని విజ్ఞతగల ఓటర్లు ఓటువేసే సమయంలో అన్నీ ఆలోచిస్తారని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చిందని ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తూ ముందుకు సాగుతోందని ఈ అంశాలన్నింటినీ ప్రచారం నిర్వహించే సమయంలో ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేశామో నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అంతకన్నా రెట్టింపు స్థాయిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్న భరోసాను ప్రజల్లో నింపాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై ప్రజలకు తెలియజేయడంతో పాటు ఆయన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలో ఉన్నపుడు అప్పనంగా తన సొంత మనుషులకు భూములను కట్టబెట్టి ఎలా రాజకీయ లబ్ధి పొందారో ఆ విషయాలన్నింటినీ కూడా తెలియజేయాలని ఆయన నేతలను కోరారు. విజ్ఞతతో ఓటర్లు ఉన్నారని కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తెలుగుదేశం పార్టీయేనన్న విషయం నంద్యాల ఓటర్లకు బాగా తెలుసునని జగన్మోహన్‌రెడ్డి ఇచ్చే హామీలను వారు నమ్మరని తనపై, తన ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను సైతం ప్రజలు పట్టించుకోవడం లేదన్న విషయం తేటతెల్లమవుతోందని చంద్రబాబు తెలిపారు. ఉపఎన్నికల ప్రచార సరళిపై తాను ప్రతి రోజూ నివేదికలు తెప్పించుకుంటున్నానని పరిస్థితి పూర్తి ఆశాజనకంగా ఉందని గెలుపు తథ్యమని అత్యధిక మెజారిటీ సాధించడమే తన ధ్యేయమని చంద్రబాబు తెలిపారు. వైకాపా చేసే కుట్రలో పడవద్దని నేతలంతా సంయమనంతో వ్యవహరించి ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని ఎటువంటి పరిస్థితుల్లో వైకాపా వలలో పడవద్దని సూచించారు.

గెలుపు బాధ్యత నాదే

- చంద్రబాబుకు గంగుల హామీ
- నేటి నుంచి నంద్యాల్లో ప్రచారం
- పార్టీలో సీనియార్టీని గౌరవిస్తాం: సీఎం

నంద్యాల, ఆంధ్రప్రభ : అభివృద్ధే ప్రాతిపదికగా ముందుకు సాగుతున్న తెలుగుదేశం ప్రభుత్వానికి నంద్యాల ఉప ఎన్నికలో విజయం ఎంతో దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సర్కారు చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి గురువారం రెండు సార్లు ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. నంద్యాల ఉప ఎన్నికతోపాటు తాజా రాజకీయ పరిణామాలు, రాయలసీమ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో గురువారం వెలగపూడి సచివాలయంలో తెలుగుదేశం పార్టీలో అధికారికంగా చేరిన గంగుల ప్రతాపరెడ్డి ఈ నెల 18న నంద్యాల నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తనకంటూ ప్రత్యేక అనుచరవర్గం వున్న నేపథ్యంలో తెలుగుదేశంకు అత్యధికంగా ఓట్లు పోల్ అయ్యేలా ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రతాపరెడ్డి తన శైలిని ముఖ్యమంత్రికి వివరించారు. గోస్పాడు మండలంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు క్రియాశీల రాజకీయాలు నడిపిన గంగుల ప్రతాపరెడ్డికి అక్కడ గణనీయమైన అనుచరవర్గం వుంది. నంద్యాలలో పార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిని గెలిపించే బాధ్యత తనది అనే రీతిలో ఆయన ముఖ్యమంత్రికి నిర్దిష్టమైన హామీని ఇచ్చారు. ఇప్పటికే గురువారం తన అనుచరులకు ఎన్నికల ప్రచారంపై సంకేతాలిచ్చారు. ముఖ్యమంత్రితో భేటీ అయిన సందర్భంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని కూడా ప్రతాపరెడ్డి తప్పుబట్టినట్టు సమాచారం.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ టీడీపీలో చేరిన నేపథ్యంలో సీనియర్‌నాయకుడు గంగుల ప్రతాపరెడ్డి సేవలను వినియోగించుకుంటామని, సీనియార్టీకి గౌరవం ఇస్తామని అన్నారు. గ్రూపులకు, వర్గాలకు అతీతంగా నంద్యాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరగాల్సిన అవసరముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, రాయలసీమ అభివృద్ధికి కట్టుబడి వున్నామని హామీ ఇచ్చారు. గ్రేటర్‌రాయలసీమ కోసం రాష్ట్ర విభజన ఉద్యమ కాలంలో గంగుల ప్రతాపరెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డిలు నిర్వహించిన పోరాటాలను ఈ సందర్భంగా ప్రస్తుతించిన ముఖ్యమంత్రి సీమ ప్రగతి ఒక్క తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని తెలియజేశారు. 'మీరు చేసిన పోరాటం అనన్యమైనది. ఆ దిశగా మీరు చేసిన ఉద్యమానికి అనుగుణంగానే మా ప్రభుత్వం పురోగమించేందుకు సిద్ధం. ఈ క్రమంలోనే మీ సేవలను వినియోగించుకుంటాం' అని భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి గంగుల ప్రతాపరెడ్డితో అన్నారని సమాచారం. కాంగ్రెస్ పార్టీ అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిందంటూ మరోసారి ప్రస్తావించిన చంద్రబాబు, భావసారూప్యత కలిగిన నేతలుగా నవ్యాంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, నంద్యాల అభివృద్ధి, మంత్రి అఖిలప్రియతో కలిసి సంయమనంతో ముందుకు సాగాలని పేర్కొన్న ముఖ్యమంత్రి ప్రభుత్వ, పార్టీ పరంగా తమ సహకారం ఎల్లప్పుడూ వుంటుందన్నారు. గతం మరిచి అందరూ కలిసి అభివృద్ధి దిశగా పయనించాలన్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతల మధ్య నంద్యాల ఉప ఎన్నికపై లోతుగా చర్చ జరిగింది. గంగుల ప్రతాపరెడ్డి కూడా నియోజకవర్గంలో తనకు వున్న అనుబంధం, గోస్పాడుతో పాటు నంద్యాల టౌన్, నంద్యాల రూరల్ వున్న అనుచర, బంధుగణంపై ఆయన ముఖ్యమంత్రికి వివరించారు. నంద్యాల ఎంపీగా, ఆళ్ళగడ్డ ఎమ్మెల్యేగా తాను చేసిన సేవలను, అనుభవాలను సైతం గంగుల ప్రతాపరెడ్డి ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పంచుకున్నారు. వైసీపీ ఎమ్మెల్సీగా వున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి అంశం కూడా ఇరువురి భేటీలో ప్రస్తావనకు వచ్చింది. ఈ భేటీలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డితోపాటు ప్రతాపరెడ్డి సోదరుడు గంగుల సుదర్శన్ రెడ్డి, కుమారులు ఫణికృష్ణారెడ్డి, భరత్ కుమార్ రెడ్డిలు కూడా పాల్గొన్నారు.



సీమ అభివృద్ధే లక్ష్యం: ప్రతాపరెడ్డి

గంగుల ప్రతాపరెడ్డి టీడీపీలో చేరడంలో కీలకపాత్ర పోషించిన మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో తాను గంగుల ప్రతాపరెడ్డి కలిసి గ్రేటర్ రాయలసీమ కోసం ఉద్యమాలు నిర్వహించామని తెలియజేశారు. తాను, గంగుల ప్రతాపరెడ్డి దీర్ఘకాలం పాటు కాంగ్రెస్‌లో కలిసి పనిచేశామని తెలిపారు. వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డికి ఎప్పుడు ముఖ్యమంత్రి కావాలనే తపన తప్పితే రాష్ట్ర అభివృద్ధిపై దూరదృష్టి లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజన్ వున్న నాయకుడని అన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఇతర పథకాలపై కూడా జగన్మోహన్ రెడ్డికి ఒక విజన్ లేదని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతోనే గంగుల ప్రతాపరెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరారని ఏరాసు ప్రతాపరెడ్డి ప్రకటించారు. నంద్యాల నియోజకవర్గం ఉప ఎన్నికలలో కూడా గంగుల ప్రతాపరెడ్డి పాల్గొంటారని, గోస్పాడు మండలంలో మంచి పట్టు వుందన్నారు. నంద్యాలలో టీడీపీ అభ్యర్థి విజయం సాధించడం తథ్యమని ఏరాసు ప్రకటించారు.

అభివృద్ధి చూసే చేరా

మాజీ ఎంపి గంగుల ప్రతాప్‌రెడ్డి గురువారం సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. పిన్నమనేని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయనకు తెలుగుదేశం కండువా కప్పి పార్టీలోకి చంద్రబాబు నాయుడు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగులప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ముందు నుంచి చంద్రబాబు నాయుడుతో తనకు స్నేహం ఉందని అన్నారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరానని చెప్పారు. గతంలో చంద్రబాబుపై సమస్యల గురించే మాట్లాడానే తప్పా ఏనాడు విమర్శించలేదన్నారు. నంద్యాలను చంద్రబాబు మంచి అభివృద్ధి చేస్తున్నారని, మరింత అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల్లో టిడిపి గెలుపుకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. నంద్యాల అభివృద్ధి కోసం తీసుకున్న నా నిర్ణయాన్ని కార్యకర్తలు గౌరవించాలని కోరారు. నా సోదరుడికి నాకు మధ్య విబేధాలు లేవని, కుటుంబం ఒకటేగాని రాజకీయాలు వేరన్నారు. గతంలో భూమాతో విబేధాలు ఉండేవని, కాని ఆయన ఇప్పుడు లేడని, ఆ చిన్నపిల్లలతో తనకు విబేధాలు ఏముంటాయని అన్నారు. పార్టీకి స్వచ్ఛందంగా పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని గంగుల ప్రకటించారు.

హవ్వ! ఇంత నిర్లక్ష్యమా?!


(మొదటిపేజీ తరువాయి)

ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ గోదాములు, ప్రయివేట్ గోదాముల్లో సుమారుగా ఏడు వేల మెట్రిక్ టన్నుల మేరకు నిల్వలున్నాయన్నది సుస్పష్టం. నిల్వ చేసిన యూరియా విలువ అప్పటి ధర ప్రకారం (మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పేర్కొన్న ప్రకారం మెట్రిక్ టన్ను యూరియా నాటి ధర రూ.5,500/-) అక్షరాల రూ.3.85 కోట్లు అన్నది కూడా నిర్వివాదాంశం. కొనుగోలు చేసిన మొదటి ఏడాది విక్రయాలపై స్పష్టత లేనందున ఆ ఏడాది సంగతి అటుంచి గడిచిన రెండేళ్లలో విక్రయాలపై ఆరా తీస్తే ఒక్క బస్తా కూడా విక్రయించని పరిస్థితి స్పష్టమైంది. ఆ గోదాముల్లో పని చేస్తున్న కళాసీలు అయితే పనులు లేక బోరున విలపిస్తున్న పరిస్థితి. రైతుల అవసరాలకని తెచ్చిన యూరియా మూడేళ్లుగా గోదాముల్లో ముక్కితే మాకు పనులెలా దొరుకుతాయంటూ ప్రతి ఒక్కరూ వాపోతున్నారు. అందుకు తగ్గట్టుగానే ఏళ్ల తరబడి నిరుపయోగంగా వున్న యూరియా నిల్వలకు మార్క్‌ఫెడ్ ఇంత వరకు చెల్లిస్తూ వస్తున్న అద్దె అక్షరాలా కోటి రూపాయిలు దాటింది.


అదలా వుంచితే, ఏళ్ల తరబడి నిల్వ వున్న సదరు యూరియా బస్తాను పట్టుకుంటే రాలిపోయే పరిస్థితి వుందని కళాసీలు ఒక వైపు చెబుతుండగా, సరుకు కొనుగోలు చేసిన ఏడాదిలో చేపట్టిన విక్రయాల్లో చాలా వరకు సరుకు వెనక్కి వచ్చేసిందంటూ ప్రస్తుత మార్క్‌ఫెడ్ మేనేజరు చెబుతున్న వైనం పలు సందేహాలను రేకెత్తిస్తోంది. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసినప్పుడే ఆ సరుకు నాసిరకందన్న పలువురి వాదనలకు బలం చేకూర్చినట్లయింది.

పైన పేర్కొన్న నిల్వల తంతు కేవలం ఒక కంపెనీకి సంబంధించిన యూరియాతో ముడిపడి వుండగా, ఇదే మార్క్‌ఫెడ్ ఇఫ్కో కంపెనీ నుంచి కొనుగోలు చేసిన 3552 మెట్రిక్ టన్నుల యూరియాకు సంబంధించి కూడా నెలకు రూ.1,54,591/- చొప్పున ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు చెల్లిస్తోంది. ఈ తంతు కూడా గడిచిన మూడేళ్లుగా నడుస్తోందని కెఎన్ఎన్ ప్రతినిధి ప్రశ్నకు సమాధానంగా వేర్‌హౌసింగ్ మేనే జర్ దేవేంద్రనాధ్ మాలిక్ అందించిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే ఏడు వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలకు సంబంధించి మార్క్‌ఫెడ్ చెల్లిస్తున్న రూ.కోటికి పైగా మొత్తానికి 3552 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలకు చెల్లిస్తున్న అద్దె అదనం అన్న మాట. మొత్తం మీద మార్క్‌ఫెడ్ అలక్ష్య వైఖరి పుణ్యమా అని కోట్లాది రూపాయిల ప్రజా ధనం బూడిదలో పోసినట్లయింది. రెండేళ్లుగా యూరియా కొనుగోళ్లు జరగని నేపథ్యం వెనుక మార్క్ ఫెడ్ అధికారుల నిర్లక్ష్య ధోరణి బయటపడింది. వాస్తవానికి పిఏసిఎస్‌లను మోటివేట్ చేయించడం ద్వారా యూరియా కొనుగోళ్లు జరిపించాల్సిన మార్క్‌ఫెడ్ అధికారులు ఆ దిశగా అడుగులువేయలేదన్నది గోదాముల్లో మూలుగుతున్న యూరియా నిల్వలు చెప్పకనే చెప్పాయి.

త్వరలో లిక్విడేట్ చేస్తాం



నిరుపయోగంగా వున్న యూరియా నిల్వలు, ఉత్తపుణ్యానికి చెల్లిస్తున్న అద్దెల గురించి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కెయుపి రమణి వద్ద కెఎన్ఎన్ ప్రతినిధి ప్రస్తావించగా త్వరలో లిక్విడేట్ చేస్తామని చెప్పారు. గోదాముల్లో నిల్వలుంచడం, అద్దె చెల్లిస్తుండడం వాస్తవమేనని స్పష్టం చేశారు. రైతులు యూరియా కొనుగోలు చేయడం లేదని, పిఏసిఎస్ ద్వారా ఆశించిన స్థాయిలో విక్రయాలు జరగకపోవడం సమస్యగా మారిందని, విషయం ఉన్నతాధికారుల దృష్టిలో కూడా ఉందని పేర్కొన్నారు. గతంలో కొనుగోలు చేసిన యూరియా నిల్వలున్నందునే 2017-18 లో అసలు కొనుగోలు చేయలేదని స్పష్టం చేశారు.



రూ.3.5 లక్షల కోట్ల అవినీతి

(మొదటిపేజీ తరువాయి)

శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికలో భాగంగా గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన రోడ్‌షోలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వ విధానాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. వ్యక్తులు శాశ్వతం కాదని, విధానాలు సజీవంగా వుంటాయనే విషయాన్ని అవినీతి సామ్రాట్ అయిన చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. అధికారం కోసం ఇబ్బడి ముబ్బడిగా హామీలు ఇచ్చి చంద్రబాబు మాట తప్పారని అన్నారు. చంద్రబాబుది దుర్మార్గపు పాలనగా అభివర్ణించారు. మూడున్నర ఏళ్ళ తెలుగుదేశం పాలనలో రూ. 3.5 లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు బెల్ట్ షాపులు రెట్టింపు అయ్యాయని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని చంద్రబాబుకు ఉప ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా వేస్తున్న ఓటుగా గుర్తించి ధర్మాన్ని గెలిపించాలని కోరారు. అన్యాయానికి, న్యాయానికి జరుగుతున్న పోరాటంలో న్యాయాన్ని గెలిపించాలన్నారు. ఎన్నికల్లో రైతులు మొదలుకొని నిరుద్యోగుల వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. రైతులకు రుణ మాఫీ చేస్తానని మాట తప్పడమే కాకుండా డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. వరదలు పోటెత్తినప్పుడు నంద్యాల పట్టణం కుందూనది వరదతో ఇళ్ళు మునిగిపోతున్నా ఆయన పట్టించుకోలేదన్నారు. 2014 నాటికి నంద్యాలలో 21,800 రేషన్‌కార్డులు ఉంటే వాటిని 10 వేలకు తగ్గించారన్నారు. రేషన్ షాపులు కేవలం బియ్యానికే పరిమితం అయ్యాయన్నారు. గతంలో రేషన్ షాపుల్లో పేదల కోసం దివంగత నేత వైఎస్సార్ ఎన్నో వస్తువులను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. మాట తప్పడం చంద్రబాబు నైజమన్నారు. రాజకీయ నాయకుడికి విశ్వసనీయత ముఖ్యమని చెప్పుకొచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రతి ఓటరుకు రూ. 5 వేలు ఇచ్చి దేవుడు పై ప్రమాణం చేయించుకునేందుకు చంద్రబాబు నంద్యాలకు వస్తారన్నారు. అలాంటి సందర్భంలో దేవుడిని స్మరించుకొని లౌక్యంగా ఓటు వేయాలన్నారు. ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న పోరాటంలో ధర్మం వైపు నిలబడాలన్నారు. న్యాయానికి, అన్యాయానికి జరుగుతున్న పోరాటంలో ప్రజలే ఓటుతో తీర్పు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని మ్యానిఫెస్టోలో నవరత్నాలను పొందు పరచామన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి నవరత్నాలను చేరుస్తామన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ఒక మహా సంగ్రామంగా అభివర్ణించారు. త్వరలో జరుగనున్న కురుక్షేత్రానికి నంద్యాల నియోజకవర్గం నాంది పలకాలన్నారు. ఇప్పుడు నంద్యాల ఎన్నికల్లో మన అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి గెలుపొందినా నేను ముఖ్యమంత్రిని కాలేనని, కానీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన చంద్రబాబు పాలనపై తీర్పు ఇచ్చే అవకాశం నంద్యాల ప్రజలకు వచ్చిందన్నారు. మూడున్నర ఏళ్ళుగా నంద్యాల నియోజకవర్గం గురించి పట్టించుకోని తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు ఉప ఎన్నికలు రావడంతో నంద్యాల రోడ్లపై మంత్రులు తిరుగుతున్నారన్నారు. పట్టణంలో భవనాలను కూల్చి వేసి రోడ్లను త్రవ్వేసి ఇదే అభివృద్ధి అని చూపిస్తున్నారన్నారు. రోడ్ల విస్తరణ బాధితులకు అరకొరగా పరిహారాన్ని ఇస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే తప్పక న్యాయం చేస్తామన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగన్ వెంట అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, గోకుల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరంకి వద్ద కూల్చివేతలు ఆపండి

భూసేకరణ రికార్డులు సమర్పించండి - అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : నేషనల్ హైవే నిర్మాణం ,విస్తరణ పనుల నిమిత్తం కృష్ణా జిల్లా పెనుమలూరు మండలం పోరంకి గ్రామంలోని పిటిషనర్లకు చెందిన నిర్మాణాలను కూల్చరాదని , వారిని బలవంతంగా ఖాళీ చేయించరాదని భూసేకరణ , జాతీయ రహదారి అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు గురువారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణ సెప్టెంబర్ 4కు వాయిదా వేశారు. సవరించిన మార్కెట్ ధర ప్రకారం నూతన భూసేకరణ చట్టాన్ని అనుసరించి అవార్డులు జారీ చేయలేదు. తమ స్థలాలను జాతీయ రహదారి 65 (నంబర్ 9) నిర్మాణం, విస్తరణ కోసం అధికారులు సేకరించడాన్ని సవాలు చేస్తూ పోరంకి గ్రామానికి చెందిన 72 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ .. చట్ట ప్రకారం పరిహారం చెల్లించకుండా పిటిషనర్లకు చెందిన భవనాలను కూల్చివేస్తున్నారని నివేదించారు. ఇందు కోసం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదన్నారు. ఆ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ..నిర్మాణాల కూల్చివేత ,పిటిషనర్లను బలవంతంగా ఖాళీ చేయించడంపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ వరకు భూసేకరణకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

వంశధార నిర్వాసితులపై

లాఠీచార్జ్ అమానుషం



రైతు సంఘం నేతలు

అమరావతి, ఆంధ్రప్రభ : వంశధార ప్రాజెక్టు నిర్వాసితులపై ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి లాఠీచార్జీ చేయడం అమానుషమని, దీనిని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కెవివి ప్రసాద్‌లు గురువారం తెలియజేశారు. వంశధార ప్రాజెక్టులో ప్రధాన రిజర్వా యర్‌గా ఉన్న హిరమండలం పరిధిలో పాడలి, దుగ్గుపురం, తులగాం గ్రామాల్లోని పొలాల్లో ప్రజలు ఖరీఫ్ సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పచ్చని పంట పొలాలను చదును చేయడానికి ప్రొక్లైన్‌లతో అధికారులు చేరుకోగా స్థానిక రైతులు వారిని అడ్డుకోవడం జరిగిందన్నారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి రైతుల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరిస్తూ లాఠీచార్జీ చేయడం జరిగిందని, దీనితో వందలాది మంది రైతులు గాయాలపాలైయ్యారని తెలిపారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా గ్రామాలను ఖాళీ చేయించడం దుర్మార్గపు చర్యన్నారు. సామరస్య వాతావరణంలో నిర్వాసితులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాల్సిందిపోయి పోలీసులను ప్రయోగించి దౌర్జన్యాలను తెగబడుతూ వారిలో భయాందోళనలు సృష్టించేలా వ్యవహరించడం ప్రభుత్వ పెద్దలకు తగదన్నారు. ఇకనైనా తీరు మార్చుకొని తక్షణమే పోలీసులను ఉపసంహరించుకోవడంతోపాటు నిర్వాసితులతో చర్చలు జరిపి, న్యాయపరమైన వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న ప్రభుత్వాలు



దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అమరావతి, ఆంధ్రప్రభ : కార్మిక సంక్షేమానికి తూట్లు పొడుస్తూ కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షు రాలు కె.హేమలత ధ్వజమెత్తారు. గురువారం విజయవాడలో మున్సిపల్ కార్మికుల చేపడుతున్న రిలే దీక్షలకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతూ పౌర సేవల్లో నిరంతరం శ్రమించే మున్సిపల్ కార్మికుల ఉపాధికి ఎసరుపెట్టే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం దుర్మార్గపు చర్యన్నారు. ఒకవైపు దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం పెచ్చుమీరిపోతుంటే మరోవైపు మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు ప్రతి ఏటా 6 లక్షల కోట్ల రూపాయలు రాయితీలనిస్తోందని ఆరోపించారు. 18 మాసాలుగా 279 జీవో రద్దు, ఉద్యోగ భద్రత కోసం పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్మికులకు సిఐటియు అఖిల భారత కమిటీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆమె తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలను నిరసిస్తూ నవంబర్ 9, 10, 11 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మహాపడా వోను నిర్వహిస్తున్నామని, దీనిలో కార్మికలోకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కె.ధనలక్ష్మీ, మున్సిపల్ జెఏసి రాష్ట్ర నేతలు కె.ఉమా మహేశ్వరరావు, ఎ.రంగనాయకులు, యం. డేవిడ్, ఎ.గోపాల్, నాగేశ్వరరావు, కృష్ణ, ఐద్వా నాయకురాలు ఎం.విజయగీత పాల్గొన్నారు.

కల్తీలు, తూకాల్లో తేడాలపై కొరడా



పెట్రోలు బంకులో తనిఖీ చేస్తున్న మంత్రి పత్తిపాటి, జేసీ కృతికా శుక్లా

- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి వాహనాలకు జీపీఎస్
- బంగారం షాపుల దోపిడీపై నిఘా
- రాష్ట్రంలో నిరంతరం దాడుల ప్రక్రియ

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తోన్న సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు చేపడుతున్నట్లు పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావు వెల్లడించారు. మంత్రి గురువారం గుంటూరు నగరంలోని పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం నెలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రూ.600 కోట్ల సబ్సిడీతో ప్రజలకు వివిధ రకాలైన సరుకులను అందజేస్తోందన్నారు. రేషన్ షాపులకు సరుకులను పంపిణీ చేసే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం అక్రమం రవాణా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు సరుకులను చేరవేసే వాహనాలకు జీపీఎస్ వినియోగించనున్నట్లు మంత్రి చెప్పారు. దీనిద్వారా వాహనం ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపు వరకు సరుకులు చేరవేసే విషయాన్ని గమనించవచ్చన్నారు. త్వరలోనే ఈప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వస్తుందన్నారు. ఆహార పదార్థాలలో కల్తీ జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిరంతరం సంబంధిత శాఖాధికారులు దాడులు చేయడం జరుగుతుందన్నారు. గుంటూరులో కల్తీకారం నిల్వలు ఉన్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. నిల్వదారులు వాటిని పారవేయకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గతంలో మాదిరిగా 13 జిల్లాల నుంచి కల్తీనిరోధక శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులు కల్తీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తారన్నారు. దాడుల్లో కల్తీలు దొరికితే జైళ్లకు పోకతప్పదన్నారు. వ్యవస్థలో లోపాలను తొలగించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బంగారుఆభరణాల దుకాణాల్లో నాణ్యతాలోపంపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే గిఫ్ట్‌షాపులపై కూడా ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోలు బంకులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలుచేసి, తూనికలు కొలతలు, ధరలు పరిశీలించి తేడా ఉన్న వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నాలుగు పెట్రోలు బంకులను సీజ్ చేయడం జరిగిందని ఈసందర్భంగా ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఆహార పదార్థాల కల్తీ ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న వారి ఆగడాలను అరికడతామన్నారు. కల్తీలు, తూకాలపై తేడాలు వస్తే టోల్ ఫ్రీ నంబర్ 1100కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. నగరంలోని రైతు బజారు సందర్శించి తినుబండారాల నాణ్యతను పరిశీలించారు. తాగునీరు ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు విక్రయిస్తున్న దుకాణదారునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లోపంగా ఉన్న తినుబండారాల నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలునిర్వహించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రైతు బజార్లలో నాణ్యమైన కూరగాయలను నిర్ణీత ధరలకు విక్రయించాలని, ఆదేశాలను ఉల్లంఘిస్తే లైసెన్స్‌లనురద్దు చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వంచే ధృవీకరించిన సరుకులను మాత్రమే డీలర్లు సరఫరా చేయాలన్నారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే సరఫరా దారులపై వేటు తప్పదన్నారు. ముందుగా మంత్రి ప్రత్తిపాటి గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ప్రాంగణంలో 1.75 కోట్లతో నిర్మించే మినీబస్టాండ్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతుబజార్ సందర్శించి కూరగాయల ధరల పట్టికను సూచించే బోర్డులు, విక్రయదారులకు సంబంధిత శాఖ దాడిచేసిన గుర్తింపు కార్డులు, తూనికలు కొలతల శాఖ దుకాణదారులకు జారీ చేసిన లైసెన్స్ పత్రాలను పరిశీలించి ఈమూడు దుకాణాల్లో తప్పనిసరిగా ఉంచాలని ఆదేశించారు.



అంగన్‌వాడీ వంట గదిలో ఆహార పదార్థాలు రుచి చూస్తున్న మంత్రి పత్తిపాటి, జేసీ కృతికా శుక్లా

నేడు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో సీఎం భేటీ

అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం భేటీ కానున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శిస్తున్న పార్లమెంట్ కమిటీ గురువారం అమరావతికి చేరుకుంది. నేడు పోలవరం సందర్శించనున్న కమిటీ సభ్యులను సీఎం ప్రత్యేకంగా కలిసి పోలవరం నిర్మాణ పనులను వారికి వివరించనున్నారు. సీఎం భేటీ అనంతరం పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి సభ్యుల బృందం వెళ్లనుంది.

సచివాలయం సివిల్ డిస్పెన్సరీలో ల్యాబ్ ప్రారంభం

అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ సచివాలయంలో ఏర్పాటు చేసిన రక్త పరీక్షలు, బయోమెడికల్ పరీక్షలకు సంబంధించి నూతన ల్యాబ్‌ను గురువారం ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణప్రారంభించారు. సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈల్యాబ్‌ను 3వ బ్లాకు లోని సివిల్ డిస్పెన్సరీలో ఏర్పాటు చేయగా, ఈల్యాబ్‌లో సాధారణ రక్త పరీక్షలతో పాటు బయోమెడికల్ పరీక్షలు కూడా చేయనున్నట్లు వైద్యులు తెలిపారు.

సీసీఈ ఫిట్‌మెంట్ ఫార్ములా తక్షణమే అమలు చేయాలి

అమరావతి, ఆంధ్రప్రభ : డిగ్రీ అధ్యాపకులుగా పదోన్నతి పొందిన వారికి ప్రభుత్వం తక్షణమే సీసీఈ ఫిట్‌మెంట్ ఫార్ములా అమలు చేయాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం విజయవాడలో డిగ్రీ అధ్యాపకులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. భాస్కరరావు మాట్లాడుతూ, గత ఏడు సంవత్సరాలుగా ఫిట్‌మెంట్ ఫార్ములా అమలు చేయకపోవడం వల్లఅధ్యాపకులు ఎంతో ఆందోళనకు గురైయ్యారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పిఆర్‌సిలో 42శాతం ఇవ్వడంతో యుజిసి వేతనాలు అందుకున్న వారికంటే రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఎక్కువగా పెరిగాయన్నారు. వాస్తవానికి పదోన్నతి పొందితే వేతనం పెరగాల్సి ఉండగా ఇక్కడ తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫిట్‌మెంట్ ఫార్ములా అమలు పరచడం ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ సంఘం జెఏసి చైర్మన్ పి. అశోక్‌బాబు మాట్లాడుతూ, అధ్యాపకుల డిమాండ్ న్యాయమైనదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను తొందరగా పరిష్కారం అయ్యేందుకు నావంతు కృషిచేస్తానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సిలు గాదె శ్రీనివాసులు నాయుడు, ఎస్. రామకృష్ణ వి. బాలసుబ్రహ్మణ్యం, కత్తి నరసిం హారెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్. చంద్రశేఖర్, రమేష్, సునీల్‌రావు, రవి పాల్గొన్నారు.

సహకార కమిషనరేట్ వద్ద ధర్నా

అప్కాబ్ చైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర సహకార కమిషనర్ కార్యాలయం వద్ద పదవీ విరమణ చేసిన సహకార బ్యాంకుల ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. ప్రభుత్వ, కోర్టు ఆదేశాలను పాటించడం లేదంటూ ఆప్కాబ్ చైర్మన్ పిన్నమనేనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారంలోకి రాగానే 58 ఏళ్ల వయోపరిమితిని 60 ఏళ్లకు పెంచుతూ ఆదేశాలు చేసినా, సహకార శాఖలో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయకపోవడంతో 2014 జూన్ నుంచి 2017 మధ్య అనేక మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడం జరిగిందని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బ్యాంకుల నుంచి రావాల్సిన అనేక ప్రయోజనాలు తాము పొందలేక పోయామనీ, ఆర్థికంగా నష్టపోయినట్లు వాపోయారు. 2017లో పదవీ విరమణ వయస్సు పెంచుతూ ఆప్కాబ్ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా జస్టిస్ కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించి అందరికీ పదవీ విరమణ పెంపును వర్తింపజేయాలని ఆదేశించిందన్నారు. అయితే ఆప్కాబ్ యాజమాన్యం కోర్టు ఆదేశాలను పాటించకపోవడంపట్ల రిటైర్డ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

అంతేకాకుండా అటెండర్ల వయోపరిమితిని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, బ్యాంకుల్లో ఎక్కడా లేనివిధంగా 62 ఏళ్లకు పెంచడాన్ని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆప్కాబ్ చైర్మన్ పిన్నమనేని మా బ్యాంకు-మాఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు తమ వయోపరిమితిని పెంచాలని వినతిపత్రాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ విశ్రాంత అధికారులు పాటిబండ్ల నాగేశ్వరరావు, డీబీఎస్ ప్రసాద్, ఎల్‌సీఆర్ నాయుడు, పి.మారురెడ్డి, కె.కృష్ణకుమార్, పెద్ది నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



సహకార కమిషనర్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

మెడికో ఆత్మహత్య




మృతుడు యశ్వంత్

అనంతపురం క్రైమ్, కెఎన్ఎన్: అనంతపురం జిల్లా కేంద్రంలో ఐటిఐ కళాశాల వద్ద మెడికో యశ్వంత్ మహేంద్రకుమార్(24) గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు.. ఆత్మకూరుకు చెందిన యశ్వంత్ మహేంద్రకుమార్ ప్రభుత్వాస్పత్రిలోని మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్నాడు. తల్లిదం డ్రులు హిందూపురంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా యశ్వంత్ మహేంద్రకుమార్ దిగులుగా ఉండేవాడని, అతని సహ విద్యార్థులు తెలిపారు. గురువారం ఉదయం బైక్ పై వచ్చిన యశ్వంత్ ఐటిఐ కళాశాల వద్ద వాహనం పార్క్ చేసి, ట్రైన్ కింద పడి ఆత్మహత్యకు చేసుకు న్నాడు. ప్రేమ వైఫల్యమే ఆత్మహత్యకు కారణమై ఉండవచ్చని సహ విద్యా ర్థులు అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని భోరున విలపించారు.

మహిళ హత్య కేసులో

సుత్తి సైకోకి ఉరిశిక్ష

ప్రాణం పోయేవరకు ఉరి తీయండి - సంచలనాత్మక తీర్పు



ఉరిశిక్ష పడిన నిందితుడు ఉక్కపల్లి వెంకటేశ్వర్లు

నెల్లూరు లీగల్, కెఎన్ఎన్: మహిళను అత్యంత కిరాతకంగా అంతమొందించిన కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పు నెల్లూరు జిల్లాలో సంచలనాన్ని సృష్టించింది. ఇప్పటికే జంట హత్య కేసుల్లో జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న నిందితుడికి మరో కేసులో ఉరిశిక్షవిధించారు. ఏడాది పాటు జరిగిన విచారణ అనంతరం వెలువడిన తీర్పుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రాసెక్యూషన్ కథనం మేరకు మహిళా టీచర్‌ను హత్య చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు కొండాపురం మండలం యర్రబొట్లపల్లి గ్రామానికి చెందిన ఉక్కపల్లి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్‌కు ప్రాణం పోయేవరకు ఉరితీయాలని నెల్లూరు 4వ అదనపు జిల్లాకోర్టు న్యాయ మూర్తి బి శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్ కథనం మేరకు నెల్లూరు జిల్లాసంగం మండలం తరుణవాయి గ్రామంలో గిరిజన కాలనీ పాఠశాలలో రావిప్రోలు ప్రభావతి ఉద్యోగం చేసేది. ఈమె నెల్లూరు నగరం చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు సాయినగర్ ప్రాంతంలో కాపురముండేది. 2016 జూలై 9న ఉదయం 7 గంటల ప్రాంతంలో ప్రభావతి ఇంట్లో ఉండగా నిందితుడు వెంకటేశ్వర్లు ఇంటివద్దకు వెళ్లి సెటాప్ బాక్స్ అప్‌డేట్ చేయడానికి వచ్చానని తెలిపాడు. అంతట ఆమె డీటీహెచ్ వారికి ఫోన్ చేసే ప్రయత్నం చేస్తుండగా సుత్తితో ఆమె తలపై విచక్షణారహితంగా కొట్టాడు. అంతట సోదరి కుమారుడు అనంతకృష్ణ రాగా అతని తలపై సుత్తితో దాడి చేశాడు. అనంతరం పక్క గదిలో ఉన్నసోదరి కుమార్తె మాధురిని కూడా సుత్తితో కొట్టి తీవ్రగాయపరిచాడు. వారివద్ద ఉన్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ తీసుకుని వెళుతుండగా ప్రభావతి భర్త నాగేశ్వరరావు అడ్డు రాగా అతనిపై దాడి చేయబోగా అతను ఎదురుతిరిగి నిందితుడిపై తిరగబడి పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంకటేశ్వర్లును పట్టుకుని నెల్లూరు బాలాజీనగర్ పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన ప్రభావతి, అనంతకృష్ణ, మాదురిని నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ప్రభావతి మృతి చెందిందని డాక్టర్లు తెలిపారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో ఉరిశిక్షను ఖరారు చేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫిమాలిక్ కేసు వాదించారు. గతంలో నిందితుడిపై నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరు శివాలయం పూజారి దంపతులు చంద్రమౌళీశ్వరరావు, పుష్పవేణిల జంటహత్య కేసులో ప్రస్తుతం జీవితఖైదుతో జైలులో ఉండడం గమనార్హం.

హుదూద్ పనులు వేగవంతం

- హానికర రసాయనాలపై సిబ్బందికి అవగాహన
- అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్

అమరావతి, ఆంధ్రప్రభ : హుదూద్ తుఫానుకు దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్ (ఏపిడిఆర్‌పి) కి సంబంధించి రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన ప్రధానంగా ఈ పనులకు సంబంధించి పురపాలక, పంచాయతీరాజ్, రహదారుల భవనాల శాఖలు వెనుకబడటంపై సీఎస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. హుదూద్ తుఫాన్‌కు దెబ్బతిన్న విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం , తూర్పు గోదావరి జిల్లాల్లో వివిధ శాఖలు చేపట్టిన పనుల పురోగతిపై సీఎస్ సమీక్షించారు. 2220 కోట్ల అంచనా వ్యయంతో పలు ప్రాజెక్టులు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. దీనిలో 1550కోట్లను ప్రపంచ బ్యాంక్ సమకూరుస్తుండగా మిగిలిన 670కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఖర్చు చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద పంచాయతీరాజ్‌శాఖ 174 పనులను చేపట్టగా అందులో 62పనులకు సంబంధించి మాత్రమే పురోగతి ఉండటాన్ని సీఎస్ ప్రస్తావించారు. 340కోట్లతో విశాఖనగరపాలక సంస్థ(ఉడా) చేపట్టిన పనులు ఇంకా డిపిఆర్ దశలోనే ఉండడంపై అధికారులను మందలించారు. ప్రపంచ బ్యాంక్ నిధులతో వివిధ శాఖలు చేపట్టిన ప్రాజెక్ట్ పనులను ప్రతినెలా సమీక్షించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. 3నెలలకు ఒకసారి తాను సమీక్షలు నిర్వహిస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రం వివిధ పరిశ్రమలు నెలకొల్పడానికి పలువురు ముందుకు వస్తున్న నేపథ్యంలో ఆ పరిశ్రమల్లో ప్రమాదాలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. భోపాల్‌లో చోటు చేసుకున్న గ్యాస్‌లీకేజ్ ఘటనను సీఎస్ గుర్తుచేశారు. హానికరమైన రసాయనాలకు సంబంధించిన ప్రాజెక్టలపై అధికారులు ఇప్పటి నుంచే సిబ్బందికి అవగాహన కల్పించాలని, అటువంటి పరిశ్రమలు ఏ ప్రాంతంలో ఉన్నాయి, వాటి నిల్వ సామర్థ్యం వంటి వాటిని గుర్తించాలన్నారు. అనుకోని ఘటనలు జరిగినప్పుడు ఏ విధంగా స్పందించాలో అందరికి అవగాహన కల్పించాలని అన్నారు.

ఇదే స్ఫూర్తితో పనిచేయండి..

చంద్రన్న భీమా పథకానికి సంబంధించిన క్లెయిమ్‌లను పరిష్కరించడం గతంలో కంటే మెరుగవ్వటం పట్ల సిఎస్ దినేష్ కుమార్ సంతృప్తి వ్యక్తం చేశారు.

త్వరలో కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖలో కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వెల్లడించారు. గురువారం రాష్ట్ర విపత్తులశాఖ కార్యాలయంలో డైరెక్టర్‌ఆఫ్ ఫ్యాక్టరీస్ బాలకిషోర్, రాష్ట్ర విపత్తులశాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.వి. శేషగిరి బాబు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో ముందుందన్నారు. త్వరలోనే ఇక్కడ కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని ఫ్యాక్టరీల్లో రసాయనాలు, గ్యాస్ వినియోగం, స్టోరేజ్ సమాచారం విపత్తులశాఖకు నివేదిస్తామన్నారు. కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగానికి కర్మాగార శాఖ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి. శేషగిరిబాబు మాట్లాడుతూ కొన్ని ఫ్యాక్టరీస్ నుంచి విడుదలైయే రసాయనాలు, గ్యాస్ లీకేజ్‌లు వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖలో కెమికల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోట్ల శివశంకరరావు, పరిపాలనాధికారి వి.నాన్‌రాజు, నిపుణులు జివి రామా తదితరులు పాల్గొన్నారు

వంశధార నిర్వాసిత గ్రామాల్లో

మోహరించిన భద్రతా బలగాలు

శ్రీకాకుళం, కెఎన్ఎన్ బ్యూరో : వంశధార రెండవదశ నిర్మాణ పనులకు సంబంధించి చేపట్టిన మట్టితీతపనులు గురువారం భారీ పోలీసు బందోబస్తు మధ్య రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు కొనసాగించారు. బుధవారం పోలీసులకు, నిర్వాసిత గ్రామమైన పాడలి, దుగ్గుపురం ప్రజలకు మధ్య జరిగిన ఘర్షణ, పోలీసులపై రాళ్లు రువ్వడం, నిర్వాసితులపై పోలీసులు లాఠీచార్జి చేయడం, పలువురు గాయపడటం వంటి సంఘటనల నేపథ్యంలో అక్కడ నిర్వాసిత గ్రామాలలో బుధవారం సాయంత్రానికి పోలీసు బలగాలను మరికొన్ని తరలించి భద్రత పెంచారు. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ నేపథ్యంలో గురువారం కూడా హిరమండలం, పాడలి, దుగ్గుపురం తదితర ప్రాంతాలకు పోలీసు దళాలను పెద్దసంఖ్యలో తరలించారు. జిల్లా ఎస్పి సిఎం త్రివిక్రమవర్మ, ఆయా గ్రామాలలో పర్యటించారు. అల్లర్లకు సంబంధించి కొంతమందిని అరెస్టు చేసి పాతపట్నం కోర్టుకు తరలించామని, ఇంకా మరికొందరిని అరెస్టు చేయాల్సివుందన్నారు. కాగా పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి గున్నయ్య, ఇరిగేషన్ అధికారులు అక్కడ పరిస్థితులను పరిశీలించి, ప్రొక్లైనర్ల ద్వారా మట్టిపనులు గురువారం కొనసాగించారు. నిర్వాసితుల సమస్యలు ఏమైనా ఉంటే తాము నిబంధనలమేరకు అన్నింటినీ పరిష్కరిస్తున్నామని, ఇటువంటి పరిస్థితులలో రైతులకోసం చేపడుతున్న ఈప్రాజక్టును పూర్తిచేసేందుకు నిర్వాసితులు సహకరించాలని ఈసందర్భంగా ఆర్‌డిఓ కోరారు. ఇదిలా ఉండగా కొందరు ప్రతిపక్షపార్టీల నాయకులు నిర్వాసిత గ్రామాలకు వెళ్లి, బుధవారం సాయంత్రం సంఘటనలో గాయపడినవారిని ఓదార్చేందుకు ప్రయత్నించగా, వారిని అక్కడకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు పాలవలస కరుణాకర్‌ను హిరమండలంలోనే పోలీసులు అడ్డుకున్నారు. గురువారం ఉదయం శ్రీకాకుళం నుంచి హిరమండలం, ఇతర నిర్వాసిత గ్రామాలకు వెళ్లడానికి ప్రయత్నించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యన్నారాయణ మూర్తి, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి విమల, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తదితరులను పోలీసులు అడుకున్నారు. మహిళా నాయకురాలు ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వారిని బలవంతంగా వాహనాలలోకి ఎక్కించేందుకు ప్రయత్నించారు.అయితే మహిళా పోలీసులు లేకుండా తనను ఎలా అడ్డుకుంటారని విమల గట్టిగా ప్రతిఘటించడంతో మహిళా పోలీసులు వచ్చి వారిని పెద్దపాడు పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి తరువాత విడిచిపెట్టారు. కాగా నిర్వాసితులపై పోలీసులు బుధవారం లాఠీ చార్జి చేయడానికి సిపిఎం నాయకులు గోవిందరావు, తిరుపతిరావు, వైకాపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి శాంతి తదితరులు తీవ్రంగా ఖండించారు. సిపిఎం ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలో ఆపార్టీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఆ ఇంజనీర్ ఆస్తులు రూ.12 కోట్లు

- లంచం తీసుకుంటూ చిక్కితే అక్రమాస్తులకు ఎసరు
- మరో మూడు లాకర్లను తెరవాల్సి ఉంది - ఏసీబీ డీజీ ఠాకూర్ వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : పంచాయతీరాజ్ శాఖ భీమడోలు సబ్ డివిజన్ ఉప కార్య నిర్వహణాధికారి మహ్మద్ అబ్దుల్ సలీమ్ అక్రమాస్తులు రూ. కోటి 22లక్షలుగా అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్ధారించారు. బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తులు విలువ సుమారు రూ.12 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 3వ తేదీన కాంట్రాక్టర్ ఆరేటి సతీష్ నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏలూరు రేంజ్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ క్రమంలో ఇతని అక్రమాస్తుల వెలికితీతకు ఏసీబీ డీజీ ఆర్.పి.ఠాకూర్ ఆదేశాలు ఇచ్చారు. గుర్తించిన స్థిర, చరాస్తుల వివరాలను గురువారం ఠాకూర్ పత్రికలకు విడుదల చేశారు. 1986లో పంచాయతీరాజ్‌శాఖలో ఏఈగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన అబ్దుల్ సలీమ్ 2004లో ఉప కార్యనిర్వాహక ఇంజనీరుగా పదోన్నతి పొంది రావులపాలెంలోను, ప్రస్తుతం భీమడోలులోను పని చేస్తున్నారు.

స్థిరాస్తులు

ఇతని పేరిట కృష్ణాజిల్లా నూజివీడులో 50సెంట్లు, గుంటూరు జిల్లా కానుమోలు గ్రామంలో 75 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. భార్య ముంతాజ్ పేరిట విజయవాడ భవానీపురంలో 2006లో 216.28 చదరపు గజాల డూప్లెక్స్ భవనం కొనుగోలు చేశారు. తాడేపల్లి గూడెంలో భార్య ముంతాజ్ పేరిట 2012లో రెండు షాపులు కొనుగోలు చేశారు. అలాగే భార్య ముంతాజ్ పేరిట గుంటూరు జిల్లా కానుమోలు గ్రామంలో 75 సెంట్లు, ఇదే గ్రామంలో 2001 లో 97 సెంట్లు, నూజి వీడులో రెండు ఎకరాలు, 2002 లో గుంటూరు జిల్లా కానుమోలు గ్రామంలో 1.38 సెంట్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. తూర్పు గోదా వరి జిల్లా మోరంపూడిలో భార్య ముంతాజ్ పేరిట 2003లో 418 చదరపు గజాలు, 2008లో తిమ్మాపురంలో 240 చదరపు గజాలు, 2016లో ఏలూరు సమీపంలోని గొగుల పాడులో 243.66 చదరపు గజాలు, పెదపాడులో 329.66 చదరపు గజాలు కొన్నారు. కొడుకు అబ్దుల్ షఫీక్ పేరిట 2002లో గుంటూరు జిల్లా కానుమోలు గ్రామంలో ఎకరం, 2003లో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు.

చరాస్తులు

బావమరిది రహీం భాషా పేరిట హోండా సిటీ కారు, కుమార్తె అబ్దుల్ షెహనాజ్ పేరిట మారుతీ స్విఫ్ట్ కారు, తన పేరిట హోండా యాక్టివా బైకును కొనుగోలు చేశారు. వీటితో పాటు రూ.5.90లక్షల విలువైన గృహోపకరణాలు, నగదు రూ.8.66లక్షలు, రూ.19.95లక్షల విలువైన బంగారు ఆభరణాలు, భార్య వంటిపై రూ.1.54లక్షల విలువైన బంగారం, రూ.30వేల విలువైన వెండి సామాగ్రిని అధికారులు గుర్తించారు.

బ్యాంకు లాకర్లలో..

రావులపాలెం ఆంధ్రా బ్యాంకులో రూ.7.20లక్షల విలువైన బంగారం, రూ.96వేల విలువైన వెండి సామాగ్రి, తణుకు కోటక్ మహీంద్రా బ్యాంకులో రూ.22.86వేల విలువైన బంగారు నగలు, కరూర్‌వైశ్యా బ్యాంకులో రూ.16. 98లక్షల విలువైన సేల్‌డీడ్ పత్రాలు, రూ.20వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం, సలీం ఇంట్లో రూ.2.15 లక్షల విలువైన బీమా పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా పోలవరం, కాకినాడ, విజయవాడలోని వివిధ బ్యాంకుల్లో లాకర్లను తెరవాల్సి ఉంది. వీటిని విచారణ కోసం సలీంను కస్టడీకి తీసుకున్న తర్వాత తెరవనున్నట్లు ఠాకూర్ పేర్కొన్నారు.

'తెలుగుదేశం పాలనలో కాపులకు అన్యాయం'

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర జనాభాలో 30 శాతం ఉన్న కాపులకు టీడీపీ ప్రభుత్వం ఏమి చేసిందో చెప్పాలని పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతిక రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆమె విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, 2014 ఎన్నికల మేనిఫెస్టోలో కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పారన్నారు. తీరా విషయానికొచ్చేప్పటికీ మంజునాథ కమిషన్‌వేసి కాలయాపన చేస్తున్నారన్నారు. రాజకీయ రిజర్వేషన్లు లేకుండా ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తే కుదరదని ఆమె చెప్పారు.

ముస్లింలకే 'పెద్దల సభ' ఛైర్మన్

హజ్‌యాత్ర ప్రారంభించిన సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: ముస్లిం లను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పర్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు స్పష్టం చేశారు. ఇకపై రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ పదవిని ముస్లిం సోదరులకే కేటాయిస్తామని సిఎం ప్రకటించారు. గురువారం సా యంత్రం వెలగపూడి సచివాల యం లో రాష్ట్రంలో నుండి మక్కాకు వెళ్లే హజ్‌యాత్రికుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక బస్సు లను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మక్కా యాత్రకు వెళ్లాలంటే బెంగుళూరు, ముంబయి, ఢిల్లీ వెళ్లాల్సి వచ్చేదన్నారు. ముస్లిం సోదరుల కష్టాలను గుర్తించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ నుండి నేరుగా మక్కా వెళ్లేందుకు ప్రత్యేక విమానాన్ని నడిపేలా చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని హజ్‌హౌస్ నిర్మించామని వెల్లడించారు. షాదీఖానాలు, మసీదుల నిర్మాణానికి పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించినట్లు సిఎం చెప్పారు. నవ్యాంధ్రలో కూడా ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కడప, విజయవాడలో హజ్‌హౌస్ నిర్మాణాలకు రూ.12 కోట్లు చొప్పున కేటాయించామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకే హజ్‌హౌస్ హైదరాబాద్‌లోనే ఉండేదని, ప్రస్తుతం ఎపిలో రెండు ప్రాంతాల్లో హజ్‌హౌస్‌లు నిర్మిస్తున్నామన్నారు. కర్నూలులోఉర్దూ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2,844 కోట్లు కేటాయించామని, ఉర్దూ భాషాభివృద్ధికి రూ.20 కోట్లు ఇచ్చామన్నారు. భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిదగా ఎపిలో ఇమామ్‌లకు, మౌజమ్‌లకు రూ.5 వేలు, రూ 3 వేల చొప్పున చెల్లిస్తున్నట్లు వివరించారు. మక్కాను దర్శించుకోవాలనే పేద ముస్లింలకు ప్రభుత్వం అండగా నిలస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఎపి నుండి 2,810 మందికి మక్కాను దర్శించుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. మక్కాయాత్రకు బయల్దేరి వెళ్తున్న యాత్రికులు రాష్ట్రంలో సుఖసంతోషాలు ఉండాలని అల్లాను ప్రార్థించాలని ముఖ్యమంత్రి కోరారు. అనంతరం రెండు బస్సుల్లో వెళ్లిన వాటిలో ఉన్న ప్రయాణికులను సిఎం పలకరించారు. అంతకు ముందు హజ్ గైడ్ పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ హజ్‌కమిటీ ఛైర్మన్ మోమిన్ అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ ఎం.ఎ.షరీఫ్, మస్తాన్ షరీఫ్, హాజీ హసన్ భాషా, మైనార్టీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్, అదనపు కార్యదర్శి పి.ఉషాకుమారి, వక్ఫ్ బోర్డు సర్వే కమిషనర్ యూసఫ్ షరీఫ్, వక్ఫ్‌బోర్డు సిఈఓ అబ్దుల్‌ఖాదీర్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అహ్మద్ లియాకత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియంతోనే సుస్థిర వ్యవసాయం

● రైతు ఆదాయం రెట్టింపు ● బిందు, తుంపర సేద్యంతో నీటి కరవుకు చెక్ ● ప్రపంచానికి ఆదర్శంగా కడియం నర్సరీలు ● ప్రతి ఏడాది హార్టికల్చర్‌లో 33శాతం వృద్ధి సాధించాలి: సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : సుస్థిర వ్యవసాయం జరగాలన్న, కరువును అధిగమించాలన్న సేంద్రియ వ్యవసాయానికి ప్రతి రైతు మొగ్గు చూపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాధారణ వ్యవసాయం నుంచి పండ్ల తోటలు, కూరగాయల సాగుకు మళ్ళాలని సూచించారు. దీంతో వ్యవసాయం లాభసాటిగా మారడమే కాకుండా రైతు ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. అంతేకాకుండా ప్రజా ఆరోగ్యం సమకూరుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ సిద్ధార్థ కళాశాల ఆవరణలో ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన సేంద్రీయ, నర్సరీ ఎక్స్‌పో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షనేతగా ఉన్న సమయంలో తాను పాదయాత్ర నిర్వహించానని, అప్పుడు రైతులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశానన్నారు. చితికిపోయిన రైతుల జీవితాలను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ. 24వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. గతంలో కరెంటు కోసం రైతులు అర్ధరాత్రి వరకు ఎదురు చూసే పరిస్థితి ఉండేదని, ఆ క్రమంలో విద్యుత్ షాక్‌కు, పాము కాటుకు గురై అనేక మంది రైతులు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. మరోవైపు ఎరువుల కోసం లైన్‌లో నిలబడి పోలీసు లాఠీ దెబ్బలతో రైతులు అల్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అంతేకాకుండా రైతులకు సూక్ష్మ పోషకాలను కూడా ఉచితంగా అందించటమే కాకుండా వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేశామని స్పష్టం చేశారు. రోజురోజుకూ ప్రజల జీవనశైలితో పాటు ఆహార అలవాట్లు కూడా మారుతున్నాయన్నారు. ఒకప్పుడు రాగులు, జొన్నలు ఆహారంగా తీసుకునేవారని, ఇప్పుడు కూరగాయలు, పండ్లుతో పాటు మాంసాహారాన్ని కూడా అధికంగా తీసుకుంటున్నారన్నారు. మనం తీసుకునే ఆహారం జీవిత కాలంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఒకప్పుడు ఎరువులు, పురుగు మందులు వాడకుండా వ్యవసాయం చేసేవారని, ఆ తరువాత లాభాలకోసం మన భూమిని మనమే సర్వనాశనం చేసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాలు వ్యవసాయానికి అనుకూలంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 1.60 కోట్ల ఎకరాల్లో సాధారణ వ్యవసాయం చేస్తుండగా, 40 లక్షల ఎకరాల్లో 12 లక్షల మంది రైతులు పండ్ల తోటలు, పువ్వులు, కూరగాయలు పండిస్తున్నారన్నారు. ఈ 12 లక్షల మంది ఆదాయం సాధారణ వ్యవసాయం చేసేవారికన్నా అధికంగా ఉందన్నారు. హార్టీకల్చర్‌లో గత ఏడాది 17శాతం, ఈ ఏడాది 20 శాతం వృద్ధి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏడాది ఈ రంగంలో 33శాతం వృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని



స్పష్టం చేశారు. సేంద్రీయ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్‌తో దిగుబడులు పెరిగి రైతు ఆదాయం రెండింతలు అవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం రూ. 1000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిందన్నారు. శాస్త్రీయ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని, కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను గ్రహించాలన్నారు. మన రాష్ట్రంలో ఉన్న కడియం నర్సరీ దేశానికే కాకుండా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సుమారు 400 రకాల పండ్ల మొక్కలతో పాటు వందల రకాల పూల మొక్కలను తయారు చేస్తున్నారన్నారు. తాను అమరావతిని ప్రమోట్ చేస్తుంటే, కడియం రైతులు నర్సరీని ప్రమోట్ చేస్తున్నారనిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మార్చాలన్నది తన లక్ష్యమని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయంలో రాష్ట్రాన్ని నెంబర్ -1 గా నిలపాలని, ఈ మేరకు రైతుల్లో చైతన్యం రావాలని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యావంతులు, అధికారులు దీనికి కావాల్సిన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా ఉండటంతో పాటు ప్రాసెసింగ్, ఎక్స్‌పోర్ట్‌కు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి పంట ఆర్గానిక్‌గా ఉండాలన్నారు. అనంతరం నర్సరీ ఎక్స్‌పో-2017లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని, మేయర్ కోనేరు శ్రీధర్, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పంచుమర్తి అనురాధ, ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, సిఐఐ ఛైర్మన్ జెఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఐకోవా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్ మీనన్, కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ పోటీలో తిరుపతి బాల స్కేటర్

● ప్రభుత్వం రూ.16.90 లక్షల మంజూరు
● 31న గుంటూరులో పోటీ



తిరుపతి, కెఎన్ఎన్ బ్యూరో: లింబాస్కేటింగ్ క్రీడ ద్వారా పలు సంచలనాలు సృష్టిస్తున్న తిరుపతికి చెందిన పదేళ్ల బాలుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నిర్వహించే పోటీల్లో పాల్గొంటున్నాడు. ఈ నెల 31న గుంటూ రులో గిన్నిస్ బుక్ ప్రతిని ధుల సమక్షంలో నిర్వహించే పోటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 16.90 లక్షల నిధు లను మంజూరు చేసింది. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి శాసనస భ్యురాలు సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసిం హయాదవ్ మాట్లాడుతూ తిరుపతికి చెందిన లోకనాథం, పద్మ దంపతుల కుమా రుడు జి. దేవిశ్రీ ప్రసాద్ రోలర్ స్కేటింగ్‌లో చిన్ననాటి నుంచే శిక్షణ పొంది అత్యుత్త మ స్కేటర్‌గా పేరొందారు. ఇప్పటికే కార్లు, జీపుల వంటి వాహనాల కిందగా ఎక్కడా తగలకుండా అత్యంత వేగంగా లింబా స్కేటింగ్ చేసే విన్యాసంలో జాతీయ ఖ్యాతి సాధించాడు. పలు పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించిన దేవిశ్రీ ప్రసాద్‌కు అమెరి కాకు చెందిన ఇంటర్నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అరుదైన రీతిలో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ప్రస్తుతం దేవిశ్రీప్రసాద్ గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు ఆధ్వర్యంలో జరిగే పోటీలో పాల్గొనడానికి అవసరమైన సహాయం కోసం ప్రభుత్వాన్ని అభ్యర్థించాడు. స్పందించిన రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి ఎల్‌వి సుబ్ర మణ్యం పోటీ నిర్వహణ కోసం గిన్నిస్ బుక్ నిర్వాహకులకు చెల్లించడానికి రూ. 16.90 లక్షల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు ఆ పోటీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను గుంటూరులోని రామకృష్ణా హౌసింగ్ వారు చేశారు. ఈ నెల 31న ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగే ఈ పోటీని పరిశీలించడానికి లండన్ నుంచి గిన్నిస్ బుక్ ప్రతిని ధులు రానున్నారని సుగుణమ్మ తెలియజేశారు. 53 కార్ల కిందగా రికార్డు సమ యంలో లింబా స్కేటింగ్ చేసే సాహస విన్యాసాన్ని అధిగమించడానికి పోటీ పడే దేవిశ్రీ ప్రసాద్ విజయం సాధించాలని సుగుణమ్మ, నరసింహయాదవ్ తదితరులు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

కిలిమంజారోపై భారత పతాకం సిక్కోలు యువకుల విజయకేతనం



శ్రీకాకుళం,కెఎన్ఎన్ బ్యూరో : శ్రీకాకుళం యువకులు మరోసారి తమ సత్తాని ప్రపంచానికి చాటిచెప్పి, భారతకీర్తిని మరింత ఎత్తుకు తీసుకువెళ్లారు. ఈ సంవ త్సరం సీతంపేట ఆశ్రమపాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థి ఎత్తైన మంచు పర్వతం ఎవరెస్టును అధిరోహించి మనదేశ ప్రతిష్ఠను మరోసారి ఎలుగెత్తి చాటగా, ఇప్పుడు జిల్లాకు చెందిన విద్యార్థి ఆర్ చిన్నమ్మలు, యువకిశోరం మామిడి వెంకటరమణ ఆఫ్రికాఖండంలోని ఎత్తయిన కిలిమంజారా పర్వతాన్ని అధిరోహించి మన పతాకాన్ని ఎగురవేశారు. ఈనెల 10 తేదీన వారిద్దరూ బూట్స్ అండ్ క్రాపన్స్ సంస్థ తరపున పర్వతారోహణ ప్రారంభించారు. 15వ తేదీ సాయంత్రానికి వారు 19,341 అడుగుల ఎత్తుకు చేరుకుని పర్వత శిఖరాగ్రంపై భారత పతాకాన్ని రెపరెపలాడించారు. వీరితో పాటు మొత్తం 10 మంది సభ్యుల బృందం ఈ పర్వత శిఖరానికి చేరుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆఫ్రికాఖండంపై మనదేశ పతాకాన్ని ఎగురవేయడం దేశ ప్రజలకు, శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణంగా జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వీరి పర్వతారోహణకు శ్రీకాకుళం జిల్లా నుంచి కూడా అనేక మంది విరాళాలు అందించారు. సీతంపేట ఐటిడిఎ, సిక్కో లుయువశక్తి తదితర సంస్థలు దాదాపు4 లక్షల రూపాయల వరకూ విరాళాలు అందచేశారు. కిలి మంజారా పర్వతాన్ని అధిరోహించి మన జిల్లా ఖ్యాతిని చాటిచెప్పి వీరు సాధించిన కీర్తి గొప్పదని ఎంపి కింజరాపు రామ్మోహననాయుడు, జిల్లా కలెక్టర్ ధనంజయరెడ్డి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గీతా శ్రీకాంత్, దేశం పార్టీ పట్టణ నాయకులు ఎం.వెంకటేష్ తదిత రులు ప్రశంసించారు. ఈసందర్భంగా పర్వతారోహణ చేసిన వీరిరువురినీ వారు అభినందిస్తున్నారు.

శరవేగంగా మెడికల్ సీట్ల భర్తీ

● 4,050 ఎంబీబీఎస్, 1,340 బీడీఎస్ సీట్ల భర్తీకి కసరత్తు ● ముగిసిన రెండు విడతల కౌన్సెలింగ్ ● ప్రారంభమైన వైద్య విద్యా తరగతులు

అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నీట్ పరీక్ష మెరిట్ ఆధారంగా చేపడుతున్న ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. 2017-18 వైద్య విద్యా సంవత్సరానికి గాను డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా సీట్ల భర్తీకి యూనివర్శిటీ అధికారులు గత 20 రోజులుగా కసరత్తు చేస్తున్నారు. గత ఏడాది వరకు ఎంసెట్ ఆధారం జరిగిన సీట్ అలాట్‌మెంట్స్ ఈ ఏడాది నుంచి జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబుల్ ఎంట్రన్స్ టెస్ట్ ర్యాంకు ఆధారంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు మెరిట్ విద్యార్థులను కేటాయించడం జరుగుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు గాను జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షకు రాష్ట్రం నుంచి 44,640 మంది ఇంటర్మీడియట్ అర్హత గలిగిన విద్యార్థులు హాజరు కావడం జరిగింది. ఈ పరీక్షల్లో 32,392 మంది అర్హత సాధించగా, వారిని సర్టిఫికేట్‌ల పరిశీలన కోసం యూనివర్శిటీ అధికారులు పిలవడం జరిగింది. జులై 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల పాటు ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జరిపిన ధృవపత్రాల పరిశీలన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రభుత్వ, 15 ప్రైవేటు ఎంబీబీఎస్ కళాశాలల్లోని 4,050 ఎంబీబీఎస్ సీట్లకు, 2 ప్రభుత్వ, 13 డెంటల్ కాలేజీల్లోని 1,340 బీడీఎస్ సీట్లకు కౌన్సిలింగ్‌ను నిర్వహించడం జరిగింది.

ఏ,బీ,సీ కేటగిరీలకు రెండు విడతల కౌన్సిలింగ్..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్న 1,900 ఎంబీబీఎస్ సీట్లు పూర్తిగా ఏ కేటగిరీ పరిధిలోనికి వస్తాయి. అలాగే 15 ప్రైవేటు కళాశాలల్లోని 2,150 ఎంబీబీఎస్ సీట్లలో 1,075 ఏ కేటగిరీ పరిధిలోనివి కాగా 752 బీ కేటగిరీ, 323 సీ కేటగిరీలోనికి వస్తాయి. ఏ కేటగిరీలోని మొత్తం 2,975 సీట్లకు గాను



జులై 27వ తేదీన తొలిసారి కౌన్సిలింగ్ నిర్వహించి మెరిట్ విద్యార్థులకు సీట్లను కేటాయించడం జరిగింది. అలాగే బీ, సీ కేటగిరీల్లోని మొత్తం 1,075 సీట్లకు జులై 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు కౌన్సిలింగ్‌ను నిర్వహించడం జరిగింది. ఎంబీబీఎస్ రెండవ విడత కౌన్సిలింగ్‌ను ఏ కేటగిరీకి ఈ నెల 7వ తేదీన, బీ,సీ కేటగిరీలకు 11, 12 తారీఖుల్లో నిర్వహించడం జరిగింది. అలాగే రాష్ట్రంలోని రెండు ప్రభుత్వ, 13 ప్రైవేటు డెంటల్ కాలేజీల్లో 1,340 బీడీఎస్ సీట్లను కూడా రెండు విడతల కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేపట్టారు. రెండు ప్రభుత్వ డెంటల్ కాలేజీల్లో ఉన్న 140 బీడీఎస్ సీట్లు పూర్తిగా ఏ కేటగిరీ పరిధిలోనికి వస్తాయి. అలాగే 13 ప్రైవేటు కాలేజీల్లో ఉన్న 1,340 బీడీఎస్ సీట్లలో 600 ఏ కేటగిరీలోనికి, 420 బీ కేటగిరీ లోనికి, 180 సీ కేటగిరీలోనికి వస్తాయి. ఇప్పటి వరకు చేపట్టిన రెండు విడతల కౌన్సిలింగ్స్ ద్వారా ఎంబీబీఎస్‌కు చెందిన 2,883 ఏ కేటగిరీ సీట్లు, 730 బీ కేటగిరీ, 201 సీ కేటగిరీ సీట్లను మెరిట్ విద్యార్థులకు అలాట్ చేయడం జరిగింది. అలాగే బీడీఎస్‌కు చెందిన 734 ఏ కేటగిరీ సీట్లను, 294 బీ కేటగిరీ, 21 సీ కేటగిరీ సీట్లను మెరిట్ విద్యార్థులకు కేటాయించడం జరిగింది.

వచ్చే వారం మూడవ విడత కౌన్సిలింగ్ : వైఎస్ ఛాన్సలర్ టి.రవిరాజు..

దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష మెరిట్ ఆధారంగా రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియలో భాగంగా వచ్చే వారం మూడవ విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైఎస్ ఛాన్సలర్ డాక్టర్ టి.రవిరాజు తెలియజేశారు. పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఎంతో పారదర్శకంగా చేపడుతున్న వైద్య సీట్ల కేటాయింపులు నీట్ పరీక్షల్లో మెరిట్ సాధించి, యూనివర్శిటీలో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా కేటాయించడం జరుగుతోందన్నారు. గత 20 రోజుల కాలంలో ఏ,బీ,సీ కేటగిరీలకు రెండు విడతలుగా కౌన్సిలింగ్ నిర్వహించి, విద్యార్థులకు కోరుకున్న కళాశాలల్లో సీట్లను అలాట్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే కళాశాల్లో తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ఈ వారం చివరిలోగా విద్యార్థులకు కేటాయించిన కళాశాలల్లో చేరాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ కేటాయించిన కళాశాలల్లో విద్యార్థులు చేరకపోతే వారి వివరాలను సేకరించి, వచ్చే వారం మూడవ విడత కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా పూర్తి స్థాయిలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను భర్తీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కారుణ్య నియామకాలకు సీఎం గ్రీన్ సిగ్నల్

ఉద్యోగ సంఘాల నేతలు వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కాలంగా చేపట్టని కారుణ్య నియా మకాల ప్రక్రియను త్వరలో తిరిగి చేపడతామని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జెఎసీ నేత వి.అశోక్ బాబు, ఎపి ఎన్‌జివోల సంఘం ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి ఉద్యోగసంఘం నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో వెలగపూడి సచివాలయంలో సమావేశమై కారుణ్య నియామకాల ప్రక్రియ నిలిచిపోవడంతో రాష్ట్రంలో వందలాది మంది మహిళలు, మృతిచెందిన ఉద్యోగుల పిల్లలు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఉద్యోగ సంఘాల నేతల ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే కారుణ్య నియామకాలకు సంబంధించన నోటిఫికేషన్ జారీ చేయడానికి అంగీకరించారు. గతంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఆకస్మిక మరణం పొందితే వారి కుటుంబ సభ్యుల్లో భార్య లేదా, కుమారుడికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించే వారు. ఆసమయంలో సదరు అభ్యర్థి కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉండేది. అయితే గత కొంత కాలంగా అభ్యర్థుల విద్యార్హతలను కనీసం గ్రాడ్యుయేషన్ ఉండాలని నిబంధనలను సవరించడంతో కారుణ్య నియామకాలు నిలిచిపోయాయని, కొత్త నిబంధన మూలంగా వందలాది మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రికి వివరించారు. గతంలో ఉద్యోగంలో చేరిన 5 ఏళ్లకు డిగ్రీ పూర్తిచేయాలన్న నిబంధనను పునరుద్దరించి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఊరట కల్పించాలని నేతలు కోరడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి, ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో ఇస్తామని చెప్పడంతో ఉద్యోగ సంఘం నేతలు అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్‌ఆర్‌డీలో 6 పోస్టులు మంజూరు



అమరావతి, ఆంధ్రప్రభ : తిరుపతిలోని హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నూతనంగా 6 పోస్టులను మంజూరుచేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు హ్యూమన్ రిసోర్సెస్ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వాన్ని గతంలో కోరారు. ఈ నేపథ్యంలో మూడు పర్మినెంట్ పోస్టులను, మరో మూడు అవుట్ సోర్సింగ్ ద్వారా నియమించుకునే విధంగానూ ప్రభుత్వం ఈ పోస్టులను మంజూరుచేసింది. వీటిలో సెంటర్ డైరెక్టర్, మేనేజర్, అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు ప్రభుత్వ అధికారులను నిమిస్తారు. వీటిలో డైరెక్టర్ పోస్టుకు డిప్యూటీ డైరెక్టర్ లేక డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన వారిని, మేనేజర్ పోస్టుకు డిప్యూటీ తహసీల్దర్ కేడర్ వారిని, అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుకు సబ్ ట్రెజరీ ఆఫీసర్ క్యాడర్ వారిని నియమించనున్నారు.ఇక ఇద్దరు ట్రైనింగ్ అసోసియేట్స్‌తోపాటు ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు అవుట్ సోర్సింగ్ ద్వారా నియామకాలు జరుపనున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

అమరావతి, ఆంధ్రప్రభ : గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 902 మంది అభ్యర్థులు హాజరై 66.37 శాతం నమోదు అయ్యిందని కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం తెలిపారు. గురువారం విజయవాడలో నాలుగు సెంటర్లలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరిగాయి. పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు 1359 మంది అభ్యర్థులు మెయిన్ పరీక్షకు అర్హత సాధించారని వీరిలో మొదటిరోజు 902 మంది అభ్యర్థులు జనరల్ ఇంగ్లీషు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ నెల 19వ తేదీ శనివారం పేపర్-1, 21వ తేదీ సోమవారం పేపర్-2, 19వ తేదీ బుధవారం పేపర్-3, 26వ తేదీ శనివారం పేపర్-4, 28వ తేదీ సోమవారం పేపర్-5, పరీక్షలు జరగనున్నాయన్నారు. పరీక్షలు నిర్వాహనకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని ఇందుకు ఇద్దరు లైజన్ అధికారులు, నలుగురు అసిస్టెంట్ లైజన్ అధికారులను నియమించామన్నారు. పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయినట్లు కలెక్టర్ తెలిపారు.

వ్యవసాయ వర్సిటీలో వెటర్నరీ కౌన్సెలింగ్

అమరావతి, ఆంధ్రప్రభ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయంలో గురువారం వెటర్నరీ విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న బైపీసీ స్ట్రీమ్ కోర్సులకు కౌన్సిలింగ్ గుంటూరు సమీపంలోని లాం ఫాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నీట్ ర్యాంకులతో మెడికల్ కౌన్సిలింగ్ పూర్తయిన తర్వాత బైపీసీ స్ట్రీమ్ కోర్సులకు బీఎస్సీ వ్యవసాయం, హార్టీ కల్చర్, బీవీఎస్సీ, బీటెక్ ఫుడ్‌టెక్నాలజీ, బ్యాచులర్ ఆఫ్ సైన్స్ కోర్సులకు కౌన్సిలింగ్‌నిర్వహిస్తున్నట్లు వివరించారు. తొలుత వెబ్ కౌన్సిలింగ్ ద్వారా సీట్లను భర్తీ చేయాలనుకున్నామనీ, ప్రభుత్వం నూతనంగా ప్రకాశం జిల్లాలోని గుడ్లూరులో ప్రభుత్వ ఉద్యాన కళాశాలను మూడు రోజుల క్రితం మంజూరు చేయడం వలన ఈ ఏడాది మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. దీంతో ఒకసీటుకు నలుగురు అభ్యర్థులను పిలవడం జరిగిందన్నారు. అభ్యర్థులు వారి ఇష్టప్రకారం కావల్సిన కోర్సులో చేరి, భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో నిలవాలని సూచించారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఈనెల 28, 29 సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని లేకపోతే సీటు రద్దు అవుతుందన్నారు. రెండో కౌన్సిలింగ్ తర్వాత తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలను వెబ్‌సైట్లో చూసుకోవాలని సూచించారు. ప్రైవేటు కళాశాలలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరంలలో మూడు ప్రభుత్వ వెటర్నరీ కళాశాలలు ఉన్నాయనీ, వచ్చే ఏడాది నుంచి విజయనగరం జిల్లా గడివిడిలో మరో కళాశాల ప్రారంభించనున్నట్లు శ్రీవెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ జి.గంగరాజు వెల్లడించారు. బీవీఎస్సీ కోర్సు నాలుగున్నర సంవత్సరాలనీ, ఒక సంవత్సరం ఇంటర్నల్ షిప్‌తో మొత్తం ఐదున్నరేళ్లు ఉంటుందన్నారు. బీవీఎస్సీ పూర్తి చేసిన వారికి వెంటనే ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. వెటర్నరీ, ఫిషరీస్ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఈనెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. బీఎస్సీ



వ్యవసాయం కోర్సును బీఎస్సీ(ఆనర్స్) వ్యవసాయం పేరుతో డిగ్రీలు ఇస్తున్నట్లు అగ్రికల్చరల్ డీన్ తాతినేని రమేష్‌బాబు వెల్లడించారు. రాష్ట్రంలోని 5 ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో 560 సీట్లు, 6 ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద 236 సీట్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పార్వతీపురం, వెంకటరామన్నగూడెం, అనంత రాజుపేట, నూతనంగా గుడ్లూరులలో ప్రభుత్వ ఉద్యానవన కళాశాలలున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు తెలిపారు. నూతనంగా ఏర్పాటవుతున్న కళాశాలల్లో చేరుతున్న విద్యార్థులను ముందుగా మూడు నెలలు వెంకట్రామన్నగూడెంలో ఉంచి అనంతరం భవనాలు ఏర్పాటు కాగానే నూతన కళాశాలకు విద్యార్థులను పంపుతామన్నారు. ఫుడ్ టెక్నాలజీ చదివిన వారికి వెంటనే ఉద్యోగావకాశాలు లభిస్తాయనీ, ఈనెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వ్యవసాయ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్‌డి.భాస్కరరావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ పి.సాంబశివరావు, విశ్వవిద్యాలయాల పరీక్షల నియంత్రణాధికారులు ఎ.శివశంకర్, కె.గోపాల్, జె.వీ.రమణ, హేమ, వివిధ కళాశాలల సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

తెలంగాణలో 52 వేల ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ పచ్చజెండా

టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఒడిఒడిగా అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది చివరిలోపు సాధ్యమైనన్ని ఖాళీలను భర్తీ చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సత్వరమే 52వేల ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఆర్థికశాఖ ఇందుకు అనుమతులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆర్థికశాఖ అనుమతులు రాగానే పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆయా శాఖల ఖాళీల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్లను జారీ చేయనుంది. ప్రభుత్వం భర్తీ చేయాలనుకున్న ఖాళీల్లో పోలీసు శాఖలో 37,820, ఇంధనశాఖలో 12,961, విద్యాశాఖలో 12,005, గురుకుల పాఠశాలల్లో 8,511, వైద్య ఆరోగ్యశాఖలో 8,347, సింగరేణిలో 7,485, ఆర్టీసీలో 3,950, రెవెన్యూలో 2,506, వ్యవసాయ, ఉద్యానవన శాఖలో 2,435, అటవీ శాఖలో 2,033, పురపాలక పట్టణాభివృద్ధిలో 1,952, ఉన్నత విద్యలో 1,678, సాగునీటి పారుదలలో 1,058, ఆర్థికశాఖలో 720, మహిళా శిశు సంక్షేమ శాఖలో 587, రహదారులు, భవనాల శాఖలో 513, ఆబ్కారీలో 340, రవాణాలో 182, పంచాయితీరాజ్ శాఖలో 3,528 ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

ఏపీఐఐసీకి 220 ఎకరాల కేటాయింపు

అమరావతి, ఆంధ్రప్రభ : విశాఖ జిల్లాలో ఏపీ ఐఐసీకి భూములు కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పారిశ్రామిక పార్కు ఏర్పా టుతోపాటు పరిశ్రమల స్థాపనకోసం ప్రభుత్వం 220 ఎకరాల భూమిని కేటాయించింది. పద్మనాభం మండలంలోని పెంట గ్రామంలో 200 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ఉచితంగా కేటాయించింది. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటుచేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగయ్యేందుకు వీలు ఏర్పడనుంది. రాంబిల్లి మండలంలోని పూడి గ్రామంలో 21.89 ఎకరాలను కూడా ప్రభుత్వం ఏపీ ఐఐసఈకి కేటాయించింది. వీటితోపాటు కృష్ణా జిల్లాలోని వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో 10 ఎకరాలను, జీ.కొండూరు గ్రామంలో 43.50 ఎకరాలను, చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామంలోని కొండ పోరంబోకులో ఉన్న 50 ఎకరాలను కేటాయించారు.

ఆంధ్రప్రభ క్రీడాప్రభ

శుక్రవారం 18 ఆగస్టు 2017 | విజయవాడ | 10



క్వార్టర్స్‌లో సానియా

సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్

ఒహియో: భారత ఏస్ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సిన్సినాటి మాస్టర్స్ మహిళల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్ చేరింది. చైనా క్రీడాకారిణి పెంగ్ షువాయ్‌తో జోడీ కట్టిన సానియా బుధవారం ప్రి క్వార్టర్స్‌లో 7-5, 6-4తో జులియా జార్జస్ (జర్మనీ), ఓల్గా షవ్‌చుక్ (ఉక్రెయిన్) జంటపై గెలిచింది. సానియా, షువాయ్ జోడీ ఇపుడు రొమేనియాకు చెందిన కామెలియా బెగు, రలుకా ఒలరులతో తలపడుతుంది. కాగా పురుషుల విభాగంలో రామ్‌కుమార్ రామనాథన్ టోర్నీ నుంచి నిష్క్రమిం చాడు. అతను రెండో రౌండ్లో అమెరికా వైల్డ్‌కార్డ్ ఎంట్రీ డొనాల్డ్‌సన్ చేతిలో ఓడాడు. రామ్‌కుమార్ 4-6, 6-2, 4-6 తేడాతో ఓటమి చవిచూశాడు. అంతకుముందు లియాండర్ పేస్ డబుల్స్ విభాగంలో తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టాడు.




సత్తా చాటిన లక్ష్యసేన్

బల్గేరియా ఓపెన్ సిరీస్ టైటిల్ కైవసం

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ లక్ష్యసేన్.. బల్గేరియా ఓపెన్ ఇంటర్నేషనల్ సిరీస్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. బుధవారం హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో క్రొయేషియా ఆటగాడు రెండో సీడ్ జ్వొనమిర్ దుర్కిన్‌జాక్‌ను 18-21, 21-12, 21-17 తేడాతో మట్టికరిపించాడు. ఈ పోరు 57 నిమిషాల పాటు నువ్వానేనా అన్నట్లు సాగింది. ఉత్తరాఖండ్‌కు చెందిన లక్ష్యసేన్ బుధవారం 16వ పుట్టిన రోజు నాడు చిరస్మరణీయ విజయాన్ని సాధించడం విశేషం. సెమీస్‌లో అతను 21-19, 21-14తో లంక షట్లర్ కరుణరత్నేను ఓడించాడు. "లక్ష్యకు ఇది చెప్పుకోదగ్గ విజయం. అతనింకా జూనియర్. మరిన్ని టోర్నీలు గెలుచుకోగలడు. లక్ష్య.. దిగ్గజం పీటర్ గెడె వద్ద శిక్షణ పొందాడు. అతను టాప్ సీడ్ శామ్ పర్సన్స్ వంటి మేటి ఆటగాళ్లను ఓడించాడు. జూనియర్ నేషనల్స్ కూడా గెలిచాడు. ఈ ఏడాది సీనియర్ నేషనల్స్‌లో ఫైనల్ చేరాడు. అతనికి మంచి భవిష్యత్తుంది" అని కోచ్ విమల్ కుమార్ అన్నాడు.

అశ్విన్...వన్డేలకు దూరమైనట్లేనా!



టెస్టుల్లో వేగవంతంగా 250 వికెట్లు.. అరంగేట్రంలోనే ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో అరుదైన రికార్డు... వన్డేల్లోనూ నిలకడైన ప్రదర్శనతో 150 వికెట్లు.. అటు టీ20ల్లో, ఇటు ఐపీఎల్ లో చెన్నై సూపర్‌కింగ్స్ తరఫున తిరుగులేని ప్రదర్శన. లంకతో ఇటీవలే ముగిసిన టెస్టు సిరీస్‌లో అవిరామ బౌలింగ్‌తో పాటు ఐదు వికెట్ల ప్రదర్శన. ఇటు టెస్టులైనా, వన్డేలైనా దిగువ వరుసలో నమ్మకమైన బ్యాటింగ్. క్లుప్తంగా ఇవీ.. భారత జట్టుకు గత ఆరేడేళ్లుగా ఆధారపడ్డ ఆటగాడిగా పేరుతెచ్చుకున్న ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ గురించి చెప్పాలంటే. దిగ్గజ లెగ్‌స్పిన్నర్ అనిల్ కుంబ్లే తర్వాత గుర్తుకు వచ్చే టీమ్‌ఇండియా స్పిన్నర్లలో ముందు వరుస నిలబడేది అశ్విన్ ఒక్కడే. అలాంటి అశ్విన్.. అతి తక్కువ కాలంలోనే వన్డేలకు దూరమయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే లంకతో వన్డే సిరీస్‌కు అతణ్ని విశ్రాంతి పేరుతో పక్కన పెట్టారు. భవిష్యత్తు సిరీస్‌లలో ఎలా ఉన్నా 2019 ప్రపంచకప్‌లో మాత్రం అశ్విన్ ఆడే అవకాశాలు చాలా తక్కువే అని చెప్పుకోవాలి.

ఆంధ్రప్రభ క్రీడా విభాగం

ప్రపంచ కప్‌కు సమయాత్తతపై భారత జట్టు యాజమాన్యం ఇప్పటి నుంచే దృష్టి పెట్టింది. అందుకు తగ్గట్టే యువకులను పరీక్షించేందుకు రొటేషన్ విధానాన్ని అమలులోకి తెస్తోంది. దీనిలో భాగంగానే అశ్విన్‌కు విశ్రాంతినిస్తూ.. ఎడమచేతి వాటం స్పిన్నర్లు కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లను లంకతో సిరీస్‌లో పరీక్షించాలనుకుంటోంది. ప్రత్యేకించి కుల్‌దీప్‌పై చీఫ్ కోచ్ రవిశాస్త్రి ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

ఇదే తొలిసారికాదు: వన్డే జట్టులో చోటు విషయమై అశ్విన్‌లో సందిగ్ధత ఏర్పడం ఇదే తొలిసారి కాదు. ధోనీ కెప్టెన్సీలోనూ అశ్విన్ ఒక విధమైన అభద్రతా భావానికి గురైన సందర్భాలు లేకపోలేదు. జట్టు నుంచి ఉద్వాసనకు గురైనపుడల్లా తనకు కత్తిమీద సాములా అనిపించేదని అశ్విన్ అంటాడు. అతనిపుడు మరోసారి రొటేషన్ పద్ధతిలో వన్డే జట్టు నుంచి చోటు కోల్పోయాడు. వాస్తవానికి 2015 ప్రపంచకప్ తర్వాత... ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అశ్విన్ ప్రదర్శన ఏమంత మెరుగ్గా లేదు. ప్రపంచకప్ అనంతరం 15 మ్యాచ్‌ల్లో 40.58 సగటుతో 17 వికెట్లు తీశాడు. ఎకానమీ రేటు 5.6. ఇంగ్లాండ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో అత్యంత నిరాశాజనకమైన ప్రదర్శన చేశాడు. కేవలం వీటిని దృష్టిలో పెట్టుకొని అశ్విన్ వన్డే కెరీర్ ముగిసిపోయిందని చెప్పలేం. ఐతే జట్టు యాజ మాన్యం అశ్విన్ గురించి ఎలా ఆలోచిస్తుందనేదే ప్రధానం. అతని ఇటీవలి ప్రదర్శనలే వారిని ప్రత్యామ్నాయాలు వెదకడానికి కారణం కావచ్చు. అందుకు తగ్గట్టుగానే ధోనీ మొదటి ఎత్తు వేశాడు. 2016 లో ఆస్ట్రేలియాలో రెండు వన్డేలు ముగియగానే అశ్విన్‌ను తప్పించాడు. ఐతే తిరిగి ఎలాగోలా జట్టులోకి వచ్చాడు. గత ఏడాది టీ20 ప్రపంచకప్‌లో విండీస్‌తో సెమీస్‌లో అశ్విన్‌కు చేదు అనుభవం ఎదురైంది. నాలుగు ఓవర్ల కోటా అయినా పూర్తి చేయలేకపోయాడు. ధోనీ అందుకు వేరే కారణాలు చెప్పినా అశ్విన్‌పై అతనికి నమ్మకం సడలిందన్నది యదార్థం. ఇపుడు విరాట్ కోహ్లి కెప్టెన్సీలోనూ అశ్విన్ వన్డే భవిత ఊగిసలాడుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీ జరిగిన ఇంగ్లాండ్‌లోనే 2019 ప్రపంచ కప్‌ను నిర్వహించబోతు న్నారు. ప్రపంచ కప్‌కు ఆటగాళ్ల అన్వేషణ గురించి చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కె ప్రసాద్ మాట్లాడుతూ... ఛాంపియన్స్ ట్రోఫీ అక్కడ జరగడం మంచిదైంద న్నాడు. అనేక అంశాల్లో తమ కళ్లు తెరుచుకున్నాయన్నాడు. తమ నిజమైన బలం ఏమిటో తెలిసిందన్నాడు. లంక, పాక్‌లతో మ్యాచ్‌లలో అశ్విన్ వరుసగా 8.66, 8.37 ఎకానమీ రేటుతో పరుగులు సమర్పించుకున్నాడు. జట్టు ఎంపిక సమయంలో ఈ గణాంకాలు ప్రసాద్ బృందం దృష్టిలో ఉండకపోవు. ఏదేమైనా అశ్విన్ వన్డే కెరీర్ మాత్రం సందిగ్ధంలో పడిందన్నది నిర్వివాదాంశం. ఐతే టీమ్‌ఇండియా విదేశాల్లో వచ్చే ఏడాది నుంచి కఠినమైన టెస్టు సిరీస్‌లు ఆడబోతోంది. ఈ ఫార్మాట్‌లో తిరుగులేని అశ్విన్ సత్తా చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందుకు అశ్విన్ కౌంటీలో ఆడేందుకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



ఆనంద్ ఓటమి

ర్యాపిడ్‌లో 8వ స్థానం

సెయింట్ లూయిస్ (అమెరికా) : విశ్వనాథన్ ఆనంద్‌కు ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఓటమి ఎదురైంది. దీంతో అతను టోర్నీ ముగిసేసరికి సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ఆనంద్ తుది రౌండ్లో రష్యా ఆటగాడు సెర్గీ కర్జకిన్ చేతిలో ఓడాడు. టోర్నీలో ఆనంద్ ఒక విజయం, ఐదు డ్రాలు, రెండు పరాజయాలతో ఏడు పాయింట్లు సాధించాడు. ఆనంద్ ఇక బ్లిట్జ్ చెస్ విభాగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. లివోన్ ఆరోనియన్ (అర్మేనియా) 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. చివరి రోజు లివోన్ రెండు విజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. గారీ కాస్పరోవ్‌కు రెండు ఓటములు ఎదురయ్యాయి.

ఆసియాకప్‌కు అనుమతివ్వండి

ప్రభుత్వానికి బీసీసీఐ వినతి

న్యూఢిల్లీ: 2018లో ఆసియా కప్‌ను నిర్వహించేందుకు అనుమతి నివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీసీఐ కోరింది. పాకిస్థాన్ అభ్యంతరం కారణంగా అండర్ 19 ప్రపంచకప్ దేశం నుంచి తరలి వెళ్లిపోయిన నేపథ్యంలో బోర్డు ఆసియా కప్‌నిర్వహించాలనుకుంటోంది. ఈ టోర్నీలో పాక్ కూడా పాల్గొంటుంది. "అండర్ 19 ఆసియా కప్ నిర్వహణకు అనుమతి కోరుతూ మూడు మాసాల క్రితం ప్రభుత్వానికి రాశాం. కానీ ఇంకా స్పందన లేదు. దీంతో ఆ టోర్నీని మలేసియాకు తరలించాం. ఇపుడు సీనియర్ జట్ల టోర్నీని నిర్వహించాలనుకుంటున్నాం. ఐతే భారత్, పాక్‌లు లేకుండా ఆసియా కప్ ఉండబోదు" అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు.



ఆఖర్లోనూ అదరగొట్టారు

● విజయంతో ఐరోపా పర్యటనను ముగించిన హాకీ జట్టు

ఆమ్‌స్టీల్‌వీన్: భారత హాకీ జట్టు ఐరోపా పర్యటనను విజయంతో ముగించింది. బుధవారం ఉత్కంఠభరితంగా సాగిన చివరి మ్యాచ్‌లో భారత యువ జట్టు 4-3తో ఆస్ట్రియాపై సంచలన విజయం సాధించింది. రమణ్ దీప్ సింగ్, చింగ్లేశన సింగ్ రెండేసి గోల్స్ కొట్టి జట్టును గెలిపించారు. రమణ్‌దీప్ 25, 32 నిమిషాల్లో, చింగ్లేశన 37, 60 నిమిషాల్లో ఆ గోల్స్ సాధించారు. ఆస్ట్రియా తరఫున ఒలివర్ బైండర్ (14వ నిమిషం), మైకేల్ కార్వర్ (53వ ని.), పాట్రిక్ (55వ ని.) గోల్స్ స్కోర్ చేశారు.

నిదానంగా ఆరంభించి..: భారత్ తన పోరును నిదానంగా ఆరంభించింది. భారత ఆటగాళ్లు బంతిని ఎక్కువగా తమ వద్దే ఉంచుకుని ప్రత్యర్థి సర్కిల్‌లోకి చొచ్చుకొని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఐతే ఒలివర్ ద్వారా ఆస్ట్రియా తొలి గోల్ సాధించి మొదటి అర్ధం ముగిసేసరికి 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధంలో భారత్ దూకుడు పెంచింది. 25వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రమణ్‌దీప్ గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని సమం చేశాడు. అమిత్ రోహిదాస్ అందించిన బంతిని రమణ్‌దీప్ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. మరోసారి అందివచ్చిన అవకాశాన్ని రమణ్‌దీప్ సద్వినియోగం చేసుకొని భారత్ ఆధిక్యాన్ని 2-1కి పెంచాడు. ఆట తుది 15 నిమిషాలకు చేరుకునేసరికి భారత్ 3-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. కానీ 53, 55 నిమిషాల్లో ఆస్ట్రియా వరుసగా గోల్స్ స్కోరును 3-3తో సమం చేసింది. దీంతో భారత ఆటగాళ్లు మరో గోల్ కోసం విపరీతంగా కష్టపడ్డారు. ఎట్టకేలకు మరో పది సెకన్లలో మ్యాచ్ ముగుస్తుందనగా చింగ్లేశన సంచలన రీతిలో నాలుగో గోల్ సాధించి జట్టును గెలిపించాడు. గుర్జంట్ సింగ్ కొట్టిన క్రాస్ హిట్‌ను అతను గోల్‌గా మలిచాడు. ఐరోపా పర్యటనలో భారత జట్టు 5 మ్యాచ్‌లలో 3విజయాలు,2 ఓటములు తన ఖాతాలో వేసుకుంది. నెదర్లాండ్స్‌పై రెండు స్ఫూర్తిదాయక విజయాలను సాధించింది.

భారత్ తొలి ప్రత్యర్థి ఆసీస్

ICC UNDER19 CRICKET WORLD CUP NEW ZEALAND 2018

● జనవరి 14న మాజీ చాంపియన్ల పోరు
● ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్
● ఫైనల్ ఫిబ్రవరి 3న ● న్యూజిలాండ్ ఆతిథ్యం

దుబాయ్: ఐసీసీ అండర్ 19 ప్రపంచ కప్‌లో మాజీ చాంపియన్లు భారత్, ఆస్ట్రేలియా 2018 జనవరి 14న తలపడతాయి. టోర్నీకి న్యూజిలాండ్ ఆతిథ్యమివ్వ నుంది. ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 3న టారంగాలో జరుగుతుంది. ఐసీసీ గురువారం టోర్నమెంట్ షెడ్యూలు విడుదల చేసింది. భారత్, ఆసీస్ గ్రూప్ బిలో ఉన్నాయి. ఈ గ్రూపులో జింబాబ్వే, ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ పపువా న్యూగినియా కూడా చోటుచేసుకు న్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ వెస్టిండీస్, ఆతిథ్య జట్టు న్యూజిలాండ్ గ్రూప్ ఏలో జనవరి 13న తొలి పోరులో ఢీకొంటాయి. టోర్నీలో మొత్తం 16 జట్లు పోటీ పడతాయి. క్రైస్ట్‌చర్చ్, క్వీన్స్‌టౌన్, టారంగా, వాంగెరీలలోని ఏడు వేదికలు మ్యాచ్ లకు ఆతిథ్యమిస్తాయి. 2016లో జరిగిన టోర్నీలో భారత్ రన్నరప్‌గా నిలిచింది.


ఇదీ ఫార్మాట్: ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాలలో నిలిచిన జట్లు సూపర్‌లీగ్ దశకు చేరుకుంటాయి. తక్కిన 8 జట్లు ప్లేట్ డివిజన్ పోటీలకు సమాయత్తమవుతాయి. ఫైనల్, సెమీఫైనల్స్, సూపర్ లీగ్ క్వార్టర్ ఫైనల్స్ సహా మొత్తం 20 మ్యాచ్‌లుంటాయి. మ్యాచ్‌లన్నీ టీవీలో ప్రసారమవుతాయి. ఫైనల్ టారంగాలోని బే ఓవల్ మైదానంలో జరుగుతుంది. సూపర్ లీగ్ సెమీస్ రెండిటిని క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లే ఓవల్‌లో నిర్వహిస్తారు.

గ్రూప్ ఏ: వెస్టిండీస్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, కెన్యా.
గ్రూప్ బి: భారత్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, పపువా న్యూగినియా.
గ్రూప్ సి: బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, నమీబియా, కెనడా.
గ్రూప్ డి: శ్రీలంక, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఐర్లాండ్.



విరాట్ నెంబర్ 1

న్యూఢిల్లీ: దేశంలో నెంబర్ వన్ క్రీడాకారుడిగా భారత క్రికెట్ జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లి నిలిచాడు. ఇండియా టుడే సర్వేలో అతను 23 శాతం ఓట్లతో నెంబర్ వన్ స్థానం దక్కించుకున్నాడు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, సైనా నెహ్వాల్... టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జాలకు తొలి ఐదు స్థానాల్లో చోటు లభించింది.







రూట్ సెంచరీ

ఇంగ్లాండ్ 215/2

బర్మింగ్‌హామ్: గులాబీ రంగు బంతితో వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి డేనైట్ టెస్టులో ఇంగ్లాండ్ టీ విరామానికి 55 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 215 పరుగులు చేసింది. జాయ్‌రూట్ (103, 145 బంతుల్లో, 19 ఫోర్లు) సెంచరీ చేశాడు. ఓపెనర్ కుక్ 85 పరుగులతో ఆడుతున్నాడు.

పోరాడి ఓడిన తలైవాస్

అహ్మదాబాద్: మ్యాచ్ అంటే అదీ.. నరాలు తెగే ఉత్కంఠ పోరులో దబాంగ్ ఢిల్లీ కేసీ కేవలం ఒకేఒక్క పాయింట్ తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ప్రొ కబడ్డీ అంతర్ జోనల్ పోరులో గురువారం తమిళ తలైవాస్‌పై దబాంగ్ ఢిల్లీ 30-29 తేడాతో విజయం సాధించింది. టోర్నీకి కొత్త జట్టయినా తలైవాస్ ఈ పోరులో తుదికంటూ పోరాడింది. ఇరాన్‌కు చెందిన మెరాజ్ షేక్, అబోల్ ఫజల్ కలసి 20 పాయింట్లు సాధించి దబాంగ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. విజయం కోసం రెండు జట్లు తహతహలాడడంతో పోరు రసవత్తరంగా సాగింది. రెండు జట్లు తొలి రెండు నిమిషాల్లోనే విజయవంతమైన రెయిడ్‌తో పాయింట్లు సాధించాయి. ఐదు నిమిషాలకే దబాంగ్ 5-2 ఆధిక్యంలో నిలిచింది. ఓ దశలో రెండు జట్ల మధ్య పాయింట్ల అంతరం ఒకటి రెండుకు మించలేదు. ఆట 33వ నిమిషానికి దబాంగ్, తలైవాస్ 21-21తో సమవుజ్జీలుగా నిలిచాయి. తర్వాత తలైవాస్ ఆధిక్యాన్ని 25-22కు పెంచుకుంది. ఆ జట్టు తరఫున అజయ్ కుమార్ పది పాయింట్లు సాధించాడు. చివరి 40 సెకన్లలో ఆట స్వరూపం మారిపోయింది. దబాంగ్ 30-28 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. చివర్లో అజయ్ ఠాకుర్ ర్యాపిడ్ పాయింట్ స్కోరు చేసినా తలైవాస్ గెలుపునకు అది చాలలేదు. గుజరాత్, బెంగాల్ మధ్య జరిగిన పోరు 26-26తో టైగా ముగిసింది.

ఒకే ఒక్క పాయింట్ తేడాతో దబాంగ్ గెలుపు



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: M Satish Chandar, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ప్రజాసేవే లక్ష్యం

కృష్ణా జిల్లాను నెం.1 గా మార్చిన కలెక్టర్



కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతంతో ఆంధ్రప్రభ సంభాషణ

డూ ఆర్ డై... మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపు ఇది. మందలో ఒకడిగా ఉండకు.. వందలో ఒకడిగా ఉండు... ఇది స్వామి వివేకానంద ఇచ్చిన స్ఫూర్తి... ఈ రెండు నినాదాలకు నిలువెత్తు నిదర్శనం ప్రస్తుత కృష్ణాజిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం. ఆయన నిత్యం పనిచేస్తూనే ఉంటారు. రోజుకు 18 గంటలపాటు పనిచేస్తూ... అన్ని విషయాల్లోనూ జిల్లాను నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లాలని తపనపడుతున్నారు. రాష్ట్రంలో 13వ స్థానంలో ఉన్న జిల్లాను..పదమూడులోని మూడుని చెరిపేసి.. మొదటి స్థానానికి తీసుకెళ్లారంటే ఆయన పనితీరును అర్థం చేసుకోవచ్చు. మిగిలిన అధికారులు ఆయనను పని రాక్షసుడంటారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చి అసాధారణ స్థాయికి ఎదిగిన వ్యక్తి కలెక్టర్ లక్ష్మీకాంతం. భార్య శోభాలతా, కుమార్తె, కుమారుడు ఆయన కుటుంబం. పట్టుదలగా చదువుకున్న నాటి రోజులనుండి...అంతకంటే పట్టుదలగా పనిచేస్తున్న నేటి సంగతుల వరకు ...అనేక విషయాలను ఆయన ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు. ఆ విశేషాలు మీకోసం-

సైకిల్ కోసమే స్కాలర్‌షిప్ సాధించా..

ఏడో తరగతి చదివే రోజుల్లో... మా ఇంటి నుంచి పాఠశాల చాలా దూరంలో ఉండేది. ప్రతీరోజు అంత దూరం నడుచుకుంటూ వెళ్లాలంటే చాలా కష్టంగా ఉండేది. సైకిల్ ఉంటే బాగుంటుందని అనిపించింది. ఇంట్లో కొనే పరిస్థితి లేదు. దాంతో సైకిల్ కోసమే మెరిట్‌స్కాలర్‌షిప్ సాధించాను. రూ.500 స్కాలర్‌షిప్ రాగా రూ.350తో హెమిల్‌టన్ సైకిల్ కొనుక్కున్నా.

ఆ తరువాత కూడా అలా వచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని ఇంట్లో అవసరాలకు ఇచ్చి..మిగిలిన డబ్బుతో విజ్ఞాన యాత్రలకు వెళ్లేవాడిని. చదువుకునే రోజుల్లోనే సంపాదన వస్తే అదో సంతృప్తి. నా తొలి సంపాదన కూడా అదే. ఆ తరువాత ప్రతీ ఏటా చదువులో టాపర్‌గా నిలుస్తూ శ్రీవెంకటేశ్వరయూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్ పొందాను. అప్పటి నుంచే గోల్డ్ మెడల్స్ సాధించడం ప్రారంభమయ్యింది.

నిరంతర కృషి... ప్రజల్లోనూ ప్రభుత్వం నుండీ గుర్తింపులు

ఏపీపీఎస్సీలో స్టేట్‌టాప్ ర్యాంకు రావడంతో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే ఆ వృత్తి ద్వారా చేయగల సర్వీసు చాలా తక్కువ అనిపించింది. నా భార్య, తోటి లెక్చరర్ల ప్రోత్సాహంతో గ్రూప్స్‌కు సిద్ధమయ్యా. సివిల్స్‌లోనూ రాష్ట్ర టాపర్‌గా నిలవగలిగాను. తొలి పోస్టింగ్‌తో నెల్లూరుజిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా చేరాను. ఆ సమయంలో ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. జిల్లాలో 24 వేల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో రికార్డు సృష్టించడంతో ప్రభుత్వం నుండి రెండు గోల్డ్ మెడల్స్ అందుకున్నాను. అప్పట్లో జనాభా పెరుగుదల అధికంగా ఉంది. అయితే ప్రస్తుతం జనాభా పెరుగుదల అవసరం ఉంది. కావలిలో అప్పట్లోనే 7 వేల చెట్లు నాటించడం జరిగింది. ఆ చెట్లు నేడు పెద్దపెద్ద వృక్షాలుగా మారాయి. 100 చెరువులను పూడికతీయించాము. మంచినీటి సమస్య ఉండటంతో అక్కడున్న ఓ భావిని పెద్దది చేయించడంతో ప్రస్తుతం దానికి లక్ష్మీకాంతం గుంటగా పిలుచుకుంటున్నారు. దివంగత బాలయోగి స్పీకర్‌గా ఉన్న సమయంలో కాకినాడ ఆర్డీవోగా పోస్టింగు ఇప్పించారు. అలాగే చిత్తూరులో వెలుగుప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశాను. కుప్పంలో స్వయం సహాయ సంఘాల ఏర్పాటు, కానుగ చెట్ల నుంచి బయోడీజిల్ తయారీ... వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అనంతరం కర్నూలులో అర్బన్ సెంటర్లు పెంచాం. కల్తీల నియంత్రణకు కృషి చేశాము. ఈ రెండు అంశాలకు రెండు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. తొలిసారి సస్టయిన్డ్ మెరిటోరియల్ సర్వీస్ అవార్డు వచ్చింది. అనంతరం గుంటూరు ఆర్డీవోగా పనిచేశా. ఈ జిల్లాలో మారుమూల గ్రామాల్లో 10వేలమంది ప్రజలకు వైద్యసహాయం అందేలా మెగా వైద్యశిబిరం నిర్వహించాం. అప్పట్లో అదో సంచలనం. 2007లో కడప సీఈవోగా విధులు నిర్వర్తించాను ఆదర్శగ్రామాలను తీర్చిదిద్దడంతోపాటు, నిర్మల్ గ్రామాలకు సంబంధించి శుభ్రం అవార్డులు సాధించాము. అనంతరం ఉమ్మడి సచివాలయంలో పనిచేశాను. ఈ సమయంలో విపత్తులకు సంబంధించి ప్రపంచబ్యాంకు నుంచి రూ.500 కోట్ల నిధులు వచ్చేవిధంగా కృషిచేయటం జరిగింది. తర్వాత కర్నూలు అదనపు జాయింట్ కమిషనర్‌గా వరదల సమయంలో పనిచేశాం. అనంతరం టిటిడిలో పనిచేసిన సమయంలో రూములు బ్లాక్ చేసే విధానానికి స్వస్తిపలికి 48 గంటల విధానాన్ని ప్రవేశపెట్టాం.

సేవలో...ఎంతో సంతృప్తి

కలెక్టర్‌గా గ్రీవెన్స్‌లో సుదీర్ఘకాలంగా ఉద్యోగాలు, బదిలీలకు సంబంధించి న్యాయపరంగా ఉన్న అంశాలను 24 గంటల్లో పరిష్కరించాను. ఆ సమయంలో వారి కళ్లల్లో కనిపించిన ఆనందం ఎప్పటికీ మర్చిపోలేను. గ్రీవెన్స్‌పై నమ్మకం పెంచాం. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో నా సొంత డబ్బుతో పాటు కుటుంబ సభ్యులు, బంధువుల సాయంతో 40 అంగన్‌వాడీ బిల్డింగ్‌లను నిర్మిస్తున్నాం. అన్నదాన కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. మనిషికి కడుపునిండా అన్నం పెట్టడమే పెద్ద సేవ. దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలకు చేయూతనివ్వాలనుకుంటున్నాను. నా జీతం లోంచి ప్రతినెలా ఐదు శాతం డబ్బుని పేదల కోసం ఖర్చుచేస్తున్నాను. వృత్తిలో అయి నా... వ్యక్తిగతంగా అయినా సేవాకార్యక్రమాలు చేసినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలే నిది.

లక్ష్యముంటేనే జీవితంలో ముందడుగు సాధ్యం

ప్రతీ వ్యక్తి జీవితంలో ఏదైనా సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకోవాలి. అప్పుడే ఆ లక్ష్యసాధనకు ప్రయత్నం ప్రారంభమవుతుంది. అలా లక్ష్యాలు నిర్దేశించుకుంటేనే ఉన్నత స్థానానికి చేరుకోగలం. మంచి సమాజాన్ని నిర్మించాలనే దృఢనిశ్చయంతో అదే లక్ష్యంతో పనిచేస్తున్నాను. పొగ, కరువు, బహరంగ మలమూత్రవిసర్జన రహిత జిల్లాగా, అలాగే పౌష్టికాహారలోపం లేని, రక్తహీనతలేని, బాలకార్మిక వ్యవస్థలేని జిల్లాగా రూపుదిద్దడమే...ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకున్నా. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో లక్షవేపచెట్లు నాటడాన్ని టార్గెట్‌గా నిర్ణయించుకున్నాం. దీంతోపాటు కోట్లాది మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏ బాధ్యతలో ఉన్నా అక్కడి ప్రజల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నదే నా తపన.

-కొప్పాడ దామోదరరావు(అమరావతి, ఆంధ్రప్రభ)

కీళ్లనొప్పులకు... సనాతన క్రియ!

గురు కాలమ్

సనాతన క్రియలో...విపరీతంగా బాధించే కీళ్లనొప్పులను తగ్గించే ప్రక్రియలు ఉన్నాయి. ఆయుర్వేద ఔషధాలకు తోడుగా ఈ ఆసనాలను ఆచరించి...నొప్పుల నుండి బయటపడవచ్చు. మీకు దగ్గరలో ఉన్న ధ్యాన ఫౌండేషన్ నుండి వీటిని నేర్చుకుని ఆచరించడం మంచిది.



ప్రారంభిక్ ముద్ర

నేలమీద కూర్చుని కాళ్లను దగ్గరగా పెట్టి ముందుకు చాపాలి. వెన్ను నిటారుగా ఉండేలా చూసుకోవాలి. చేతులను కాస్త వెనక్కుపెట్టి...అరచేతులను నేలకు ఆనించాలి. చేతుల వేళ్లు అటువైపు చూస్తున్నట్టుగా ఉంటాయి. ఇప్పుడు శరీరంలో..భుజాలు, మోకాళ్లు, మోచేతులు, మణికట్టు మొదలైన ప్రదేశాల్లో ఉన్న అన్ని జాయింట్లను వదులుగా సడలించాలి.

శ్రోణి చక్రాసనం

ప్రారంభిక్ ముద్రలో లాగే కాళ్లను చాపుకుని కూర్చోవాలి. కుడికాలుని పైకి మడిచి...దాన్ని వీలయినంత వరకు పైకి వంచుతూ ఎడమతొడమీదకు చేర్చాలి. ఇప్పుడు కుడి మోకాలిని కుడిచేత్తోనూ, కుడికాలి పాదాన్ని ఎడమ చేత్తోనూ పట్టి ఉంచాలి. ఈ స్థితిలో కుడి మోకాలిని మృదువుగా గడియారంలో ముల్లులు తిరిగే దిశలో తిప్పాలి. అలాగే దానికి వ్యతిరేక దిశలోనూ తిప్పాలి. ఒక్కోదిశలో ఏడుసార్లు తిప్పాలి. మోకాలిని గుండ్రంగా తిప్పే సమయంలో...శ్వాసని పీల్చుకుంటూ వదులుతూ ఉండాలి. రెండింటికీ సమాన సమయాన్ని కేటాయించాలి. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఎడమకాలిని పైకి మడిచి కూడా చేయాలి.

అర్థటిట్లి (సగం సీతాకోకచిలుక) ఆసనం

శ్రోణి చక్రాసనంలో వలెనే కాళ్లను చాపుకుని కూర్చుని....కుడికాలిని మడిచి...దాన్ని వీలయినంతవరకు వంచుతూ ఎడమతొడమీదకు చేర్చాలి. కుడి మోకాలిమీద కుడిచేతిని, కుడిపాదంపై ఎడమచేతిని ఉంచి...శ్వాసని పీల్చుకుంటూ కుడి మోకాలి భాగాన్ని పైకి వంచుతూ...వీలయినంతవరకు ఛాతీవద్దకు తీసుకువెళ్లాలి. ఈ స్థితిలో కొంతసమయం అలాగే ఉండి...తిరిగి శ్వాసని వదులుతూ...కుడిమోకాలిని కిందకు తీసుకువచ్చి సౌకర్యంగా కూర్చోవాలి. ఇలా ఏడుసార్లు చేసి రెండవకాలితోనూ ఇలాగే ఏడుసార్లు చేయాలి.

సుప్త ఉదరాకర్షణాసనం

నేలమీద వెల్లకిలా నిటారుగా పడుకోవాలి. చేతులను తలకిందగా ఉంచుకోవాలి. పాదాలను నేలమీద ఆనిస్తూ... కాళ్లను పైకి మడవాలి. నిదానంగా శ్వాసని తీసుకుంటూ కాళ్లను ఎడమవైపుకి వంచాలి. ఇదే సమయంలో తలను కుడివైపుకి తిప్పాలి. కాసేపు ఇదే స్థితిలో ఉండి...తిరిగి సాధారణ స్థితికి వచ్చి విశ్రాంతి తీసుకోవాలి. తరువాత ఇదే విధంగా కాళ్లను కుడివైపుకి తలను ఎడమవైపుకి వంచుతూ కూడా చేయాలి. ఒక్కో వైపు మూడుసార్లు చొప్పున చేయాలి. అయితే ఇలా తిరిగేటప్పుడు వెన్నెముక ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూసుకోవాలి. ఎలాంటి నొప్పి ఉన్నా వెంటనే ఆపేయాలి. ఆసనాలు వేస్తున్నప్పుడు ఎలాంటి నొప్పి ఉన్నా..దాన్ని కొనసాగించకుండా నిలిపివేయటం మంచిది.



ఈ ఆసనాలు వేయటం ముగించాక శవాసనంలోకి రావాలి. శరీరాన్ని పూర్తిగా సడలించి....ప్రశాంతంగా ఉండి...అన్ని జాయింట్లపైనా..మనసులోనే దృష్టిని నిలుపుతూ...అక్కడ స్వస్థత చేకూరుతున్నట్టుగా భావించాలి. బలహీనంగా ఉన్న కీళ్లపై మరింతగా స్పృహని నిలుపుతూ...ఆ భాగం ఆరోగ్యవంతంగా మారినట్టుగా ఊహించాలి.




యోగి అశ్వినీ

పిన్నీసే...బాసూ!

సేఫ్టీ స్టైల్స్

శ్రీశ్రీ... కాదేదీ కవితకనర్హం అన్నట్టుగా...ఇప్పుడు మనం కాదేదీ...ఫ్యాషన్‌కి అనర్హం అనుకోవాల్సిందే. ఈ ప్రపంచంలో ఉన్న ఎలాంటి వస్తువుతోనైనా కొత్తరకపు ఫ్యాషన్లను సృష్టిస్తున్నారు ఆ రంగపు నిపుణులు. దుస్తుల ధారణలో ఉపయోగపడే సేఫ్టీ పిన్నులను (పిన్నీసులను) వందలు వేలల్లో వాడేసి...ఔరా అనిపించేలా...కొంగొత్త రూపకల్పనలు చేశారు వారు. దుస్తులపైనే కాదు...గడియారాలు, ఆభరణాల్లోనూ కూడా వీటిని వాడుతూ....ఇదేం వాడకంరా..బాబూ అనిపించేలా చేశారు. పెద్దగా శ్రమలేకుండా పిన్నీసులను గుచ్చుతూ బట్టలపై వినూత్న డిజైన్లు వేశారు. అలాగే ఒకదానితో ఒకటి అనుసంధానించుకుంటూ పోయి...వింత గొలిపే ఆభరణాలు తయారుచేశారు. ధరించినవారికి ఎంతవరకు సౌకర్యవంతంగా ఉన్నాయో కానీ..ఇవన్నీ చూపులకు మాత్రం చాలా చిత్రంగా ఉన్నాయి కదూ.







చింతన

కల్లుకుండ నుంచి పుట్టిన సురాభాండేశ్వరుడు

అంతర్యామి అయిన పరమాత్మ ఎక్కడైనా, ఏ సమయంలోనైనా, ఏ రూపంలోనైనా ప్రత్యక్షం కావచ్చు. ఇందుగలడందు లేడని సందేహం వలదని పోతనామాత్యులు ప్రహ్లాదుని చేత చెప్పించారు. విష్ణువు స్తంభం నుంచి ఉద్భవించాడు. అలాగే శివుడు ఒకానొక పర్యాయం కల్లుకుండ నుంచి ఉద్భవించాడు. ఆయనే సురాభాండేశ్వరుడు.



పరమాత్మ ఒక్కొక్క ప్రయోజనం నిమిత్తం ఒక్కో రూపంతో దర్శనమిస్తుంటాడు. వీటిలో కొన్ని అవతారాలుగా ప్రసిద్ధం అయ్యాయి. అంతర్యామి అయిన పరమాత్మ ఎక్కడైనా, ఏ సమయంలోనైనా, ఏ రూపంలోనైనా ప్రత్యక్షం కావచ్చు. ఇందుగలడందు లేడని సందేహం వలదని పోతనామాత్యులు ప్రహ్లాదుని చేత చెప్పించారు. విష్ణువు స్తంభం నుంచి ఉద్భవించాడు. అలాగే శివుడు ఒకానొక పర్యాయం కల్లు కుండ నుంచి ఉద్భవించాడు. ఆయనే సురాభాండేశ్వరుడు. భక్తుల కోసం భగవంతుడు ఎన్ని విచిత్రమైన, కష్టమైన పనులు చేయలేదు? ఒక పక్క భక్తుడైన అర్జునుని కోసం, ధర్మ సంస్థాపన కోనం కృష్ణుడు రథం నడిపాడు. బాణపు దెబ్బలు తిన్నాడు. భక్తుల శపథం కోసం తన మాటను తానే భంగపరచుకున్నాడు. మరో పక్క శివుడు తన భక్తుని కోసం కల్లు కుండ నుంచి ఉద్భవించాడు, భక్తుడు ఇచ్చిన మాంసాన్ని తిన్నాడు. మైల గుడ్డల మధ్య నివసించాడు. మానవుల శ్రేయస్సే కాదు దేవతల శ్రేయస్సు, సకల లోకాల సంక్షేమం చూడడం కోసం వారు ఎన్నో మహత్కార్యాలు చేశారు. అందువల్లనే లోక రక్షకులయ్యారు.

లోకాలను దగ్ధం చేసే విధంగా పరిణమించిన గరళాన్ని శివుడు ఏమాత్రం భయపడకుండా మింగేశాడు. అంతకు ముందు దేవతల క్షేమం తద్వారా మానవుల క్షేమం కోనం అమృతాన్ని సాధించేందుకు క్షీర సాగరాన్ని మథిస్తున్నపుడు మంధర పర్వతం మునిగిపోతుంటే శ్రీ మహావిష్ణువు దాని కింద కూర్మావతార రూపుడై ఉండి అది నిలిచేలా చేశాడు. ఇక అమ్మవారు లోక కంటకులు, రుషుల యాగాలు చెడగొట్టేవారు, దేవతల శత్రువులు అయిన ఎంత మంది రాక్షసులనో సంహరించింది. ఇలా దేవతలు, వారి అవతారాలు లోకోపకారం చేస్తూనే ఉన్నాయి. ఒక్క శివ కేశవులే కాదు ఇతర దేవతలు వారి వారి అంశలతో భూమి మీద జన్మిస్తూనే ఉన్నారు. ఉదాహరణకు భారతంలో ధర్మరాజాదులు దేవతల అంశలతో పుట్టిన వారు. రామాయణంలో వానరుల్లో ఎంతో మంది దేవతా అంశల వారు ఉన్నారు. సురభాండేశ్వరుని విషయానికి వస్తే ఆయన కల్లుకుండలో పుట్టడానికి కారణం గురించి ఒక కథ ఉంది. ఒక మహిళ కల్లు అమ్మేది. అది ఆమె వృత్తి. ఆమె గొప్ప శివ భక్తురాలు. అందరూ శివాలయాలకు దర్శనానికి వెళ్ళడం, పూజలు చేయడం అవీ చూసేది. తనకు ఎప్పుడూ కల్లు అమ్ముకోవడమే జీవనోపాధిగా ఉన్నందున అది విడిచి ఎక్కడికి వెళ్ళడానికి వీలు పడటం లేదని బాధపడేది. అయితే కొద్ది తీరిక ఉన్నా శివుణ్ని ధ్యానించుకుంటూ ఉండేది. ఇలా చేయగా చేయగా ఒక రోజు శివుడు ఆమె ఎదురుగా ఉన్న కల్లు కుండలోనుంచే ఆవిర్భవించి ఆమెకు మోక్షాన్ని ఇచ్చాడు. కల్లు కుండ నుంచి ఆవిర్భవించాడు కనుక ఆయనను సురా భాండేశ్వరుడు అన్నారు. సుర అంటే కల్లు, భాండం అంటే కుండ. కల్లు కుండ నుంచి పుట్టిన ఈశ్వరుడు అని దీని పూర్తి అర్థం. కల్లు కుండ నుంచి ఆయన ఇక్కడ స్వయంభూగా వెలిసాడు. అదృష్టవశాత్తు ఆ వెలసిన ప్రదేశం తెలుగు రాష్ట్రాల్లోని తెలంగాణలో కరీంనగర్ జిల్లా మంథనిలో ఉండడం విశేషం.

అలాగే వారణాసిలో సైతం సురాభాండేశ్వరుడు ఉన్నాడని, మంథని వారణాసితో సమానమైనదని కూడా అంటారు. ఎలాగైనా మంథని ప్రాంతం పవిత్రమైనది, చారిత్రక ప్రాశస్త్యం కలది. దీని అసలు పేరు మంత్ర కూటమని, అక్కడ వేదాంగాలు చదివినపడితులు నిత్యం మంత్రాలను మథనం చేసే వారని తద్వారా ఆ ప్రాంతానికి మంథని అనే పేరు వచ్చిందని చెబుతారు. క్రీస్తు శకం 788 - 820 మధ్యకాలంలో ఆది శంక రులు ఈ ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడి వేద విద్యకున్న స్థానాన్ని చూసి ప్రశంసిం చారని చెబుతారు. స్కాంద పురాణంలో ఈ ప్రాంతం పేరు ఉందని, గౌతమ మహర్షి ఇక్కడ ఉండేదని అంటారు. ఆ తర్వాత కాలంలో ఇది కొంత కాలం పశ్చిమ చాళుక్యుల రాజ్యంలో ఒకభాగంగా ఉండేదని అంటారు. ఇది మన దేశపు భక్తి తత్త్వానికి ప్రతీక. పరమేశ్వరుడు భక్తులను రక్షించడం కోసం ఎక్కడి నుంచైనా అవతరించగలడని, అవతరిస్తాడని తెలిపే కథ ఇది.

ఇక్కడ కల్లు భాండం నుచి శివుడు అవతరిస్తే థాయ్‌లాండ్‌లో ఒక సన్యాసి, ఆయన మిత్రుడు మరి కొందరు కలిసి బీరు సీసాలతో బుద్ధుని ఆలయం నిర్మించారు. కొందరు మన ప్రపంచంలో ఎన్నో వింతలు విశేషాలు ఉన్నాయి. ప్రతిది మనల్ని ఆశ్చర్యానికి గురిచేసేదే. అందులో ఈ ఆలయం ఒక్కటి. బీరుసీసాలతో ఏకంగా గుడినే కట్టేశారు. చాలా అందంగా బీరుసీసాలతో తయారుచేయబడిన ఆలయం ఎక్కడుందో తెలుసా థాయిలాండ్‌లో. దీని గురించి మరిన్ని విషయాలు మీకోసం....


బీర్‌సీసాలతో దేవాలయాన్ని నిర్మించాలనే ఆలోచన ఒక సన్యాసికి వచ్చింది. వచ్చిందే తడవుగా అతని స్నేహితులతో తన ఆలోచనను పంచుకుని ముందుగా ఖాళీసీసాలతో వారి గుడిసెలను అలంకరించేవారు. ఆ ఆలోచన తర్వాత ఆనోట ఈనోట ప్రజలందరికీ చేరి ప్రజలు వారి ఖాళీ సీసాలు దానం చేయడం ప్రారంభించారు. ఫలితంగా గుడి కట్టడానికి కావలసినన్ని సీసాలు దొరికాయి. గుడి కట్టడానికి వేర్వేరు ఆకారాలు, బ్రాండ్లు ఉన్న కొన్ని మిలియన్ ఖాళీ సీసాలను సేకరించగలిగారు. ఈ ఆలయంలో రెండు పెద్ద బుద్ధుని బొమ్మలు ఉన్నాయి. వారు ఖాళీసీసాలను మాత్రమే కాకుండా బంగారు గాజు మొజాయిక్‌ని కూడా ఉపయోగించారు. అక్కడి బుద్ధుడుని బుద్దై అని పిలుస్తారు.ఈ దేవాలయాన్ని తయారుచేయడానికి ప్రతి దానిలో దాదాపు ఖాళీ సీసాలను వాడటం జరిగింది. మొత్తం సీసాలు ఉపయోగించి అద్దాలను పగలగొట్టి సాధ్యమైనంత వరకు ఉత్తమ రూపంలో అందరినీ ఆశ్చర్యపరిచేలా అందంగా కనిపించే విధంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. ఇది వాస్తుశిల్పికి గొప్ప సవాలుగా ఉండేది. స్నానపు గదులు నుండి శ్మశానం వరకు, మొత్తం ఆలయం బీర్ సీసాలతో తయారు చేయబడింది.

- సేకరణ: జి.పి

ధర్మం-మర్మం

పంచభూతాల సృష్టి ఎలా జరిగింది?

తామస అహంకారం నుండి శబ్ద తన్మాత్రము (శబ్దం యొక్క సూక్ష్మ అవస్థ) పుట్టగా దాని నుండి ఆకాశం పుట్టింది. ఆకాశం యొక్క గుణము శబ్దం. ఆకాశం నుంచి స్పర్శ తన్మాత్రము దాని వల్ల వాయువు పుట్టాయి. వాయువు గుణం స్పర్శ. ఈ వాయువు నుండి రూపతన్మాత్రం దాని నుండి తేజస్సు పుట్టాయి. తేజస్సు (అగ్ని) యొక్క గుణము రూపము. తేజస్సు నుండి రసతన్మాత్రము దాని నుండి జలం పుట్టింది. జలం యొక్క గుణం రసం. జలము నుండి గంధతన్మాత్రము దాని నుండి భూమి పుట్టింది. భూమి గుణము గంధము. ఈవిధంగా పంచభూతములు ఆకాశం, గాలి, అగ్ని, జలము, భూమి పుట్టాయి.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

జ్ఞాని మళ్లీ అజ్ఞాని కాడు



శ్రీ రమణాశ్రమం

వి: ఎన్నో జన్మలుగా వాసనలెన్నో కూర్చుకొన్న మనోవానరాన్ని సర్వ సంగ పరిత్యాగియైన శుకబ్రహ్మర్షియే జయించాడు గాని నిర్వికల్ప సమాధిలో ఉండని తాను బ్రహ్మ అను దృఢజ్ఞానమున్న జనకుడు జయింపలేదు.

జ్ఞా: కోలయాడిన కోతి ఆడునట్లు దృఢజ్ఞానియైన జనకుడే మనస్సును జయించినాడుగాని బాహ్యసంగరహితుడై అరణ్యమే శరణ్యముగా నున్న శుకుడు కాదు.

వి: దృగ్రూపముగనున్ననే దృశ్యము పోవునుగాని దృశ్యమందుండియే దృశ్యాన్ని ఎలా నిరాకరింపగలము? విషాన్ని హరించేందుకు విషమే త్రాగితే అది మరణహేతువు గదా?

జ్ఞా: విషము హరించేందుకు వేరొక విషమయమైన ఔషధాన్ని సేవించినట్లు భయంకరమైన విషమేంద్రియ కరణాదులను నిశ్శంకమైన దృఢజ్ఞానముచేత సంహరించినవాడే సమర్థుడు గాని సదా సమాధి నిష్ఠలో ఉండి విషయ మృగములెక్కడ మీదికి రాగలవో అని భయపడేవారికి ఆ భీతియే ఫలితం గాని బ్రహ్మానంద మెప్పుడు లభించదు. బాగా యోచించి చూడాలి.

వి: సన్న్యాసియై సదా సమాధి నిష్ఠలో ఉండే వాడిని చలింపచేసే విషయాలు సంసార వ్యాపారంలో ఉన్నవానిని ఏమీ చేయవు? మహాప్రవాహంలో పడిన ఎండుటాకు కదలకుండా నిలువగలదా?

జ్ఞా: దృఢజ్ఞానం లేనివాడు ఎంతకాలము అంతర్దృష్టిలో ఉన్నా కరణాలు వానిని బహిర్ముఖుని చేసి పలు బాధల పాలు చేస్తాయి. మహాప్రవాహంలో పెద్దరాయి కించిత్తైనను చలించనట్లు విషయాది వికారము లెన్ని వచ్చినా, సహింపరాని దుఃఖాలను కలిగించినా నిశ్చలంగా ఉన్న వానికే బ్రహ్మానందానుభవంగాని, దార్ఢ్యము లేనివాని అజ్ఞానము ఒక్కనాటికి పోదు.

వి: ఎంత దార్ఢ్యమున్నను నిస్సంగుడై సదా బ్రహ్మానుసంధానము చేయకపోతే మాయాంధకారకూపంలోపడిపోతాడనేందుకు సందేహం లేదు

జ్ఞా: బ్రహ్మ కంటె వేరుగా మాయ అనేది ఒకటి ఉన్నదిగదా. సదానిష్ఠలో నుండి దానిని పోగొట్టవలెను? తన నీడ తన్నెదుర్కొని యుద్ధము చేసినట్లు లేని మాయను, లేని అహంతను కల్పించుకొని సదానిష్ఠలో ఉండాలని చెబుతారు .

వి: 'నేతి' చేయక, ఏకాగ్రచిత్తుడు కాక, సాక్షిగా నుండక సహజ జ్ఞానము పొందటం ఎలా?

జ్ఞా: "నేతి" చేయగా పుట్టలో నుండి ఉసుళ్లు బయలుదేరునట్లు అనేక విషయాలు వెలువడుతూనే ఉంటాయి. కొట్టిన కొద్దీ పైకెగిరే బంతివలె మనస్సును ఏకాగ్రం చేయను చేయను చంచలమవుతుంది. సాక్షిగా ఉండను ఉండను వంకర లాగినకొలది చుట్టుకుపోయే కుక్కతోకవలె శరీరాదికములే తాను అనే భ్రాంతి వస్తూనే ఉంటుంది. అందువలన అవిద్యఅగు అహంత, మిథ్య అయిన మాయ శుక్తికా రజతమువలె సర్వదా మిథ్యయని తలచి తానే బ్రహ్మమని విచార జ్ఞానముచే నిశ్చయించి గంభీరముగ ఉండుటే బ్రహ్మానందం.

వి: ఏ సాధనము చేయక విచారజ్ఞానం వలన తానే బ్రహ్మమని అంటే దుఃఖమయమైన విషయాదికములను జయింపగలవా? అఖండానందమైన ఆత్మలో ఐక్యమవగలమా?

జ్ఞా: బ్రతికియున్న పశువే పులిని చంపలేదు. చచ్చిన పశువు చంపుతుందా? అలాగే నిత్యంగా, నిష్కళంగా, అఖండానందంగా ప్రకాశిస్తున్న ఆత్మను విషయాదులేమి చేయగలవు? బలిసిన పశువైనా పులియెదుట బడుటకు జంకునట్లు దృఢజ్ఞానము వలన పూర్ణుడైన జ్ఞాని సన్నిధికి విషయాలు రానే రావు. వచ్చినా పులిని ఎదుర్కొను పశువు ఎట్లు అపాయం పొందుతుందో అలాగే నశించిపోతుంది.

వి: అజ్ఞానితో చేరిన సుజ్ఞాని సైతం విషయాదులలో చిక్కి మనశ్చాంచల్యములో చిక్కి దుఃఖమయమై పోతే?

జ్ఞా: దృఢజ్ఞాని అనేకులగు అజ్ఞానులచే చుట్టుకొనబడినా పూర్వజ్ఞానం నుండి జారకుండా ఉంటాడు . దార్ఢ్యము లేనివాడు ఏకాంతంగా ఉన్నా జారిపోతాడు.


- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

భగవద్గీత

వివిధాలైన యోగ పద్ధతులు



అధ్యాయం 4

శ్లోకం 29:

అపానే జుహ్వతి ప్రాణం
ప్రాణేపానం తథాపరే।
ప్రాణాపానగతీ రుధ్వా
ప్రాణాయామపరాయణాః॥

తాత్పర్యం

ప్రాణాయామం ద్వారా సమాధిలో నిలువగోరు ఇంకొందరు ప్రాణాన్ని అపాననంలో, అపానాన్ని ప్రాణంలో అర్పింప యత్నించి, శ్వాసను సంపూర్ణంగా బంధించి, అంత్యమున సమాధిమగ్నులవుతారు. మరికొందరు ఆహారాన్ని నియమించి ప్రాణవాయువును ప్రాణవాయువునందే యజ్ఞంగా అర్పిస్తారు.

భాష్యం


శ్వాసను నియమించే ఈ యోగ పద్ధతిని ప్రాణాయామం అంటారు. అందులో దేహంలోని వాయువులని నియమించి వాటిని విరుద్ధ దశలో ప్రసరింపచేసేందుకు ప్రయత్నం చేస్తారు. అలా కుంభక యోగం ద్వారా యోగులు అనేక సంవత్సరాలు వారి జీవనాన్ని పొడిగించుకోగలరు. అయితే కృష్ణ చైతన్యంలో ఉన్న వ్యక్తి భగవత్సేవలో నిమగ్నుడగుట వలన సహజంగానే ఇంద్రియాలను నియంత్రించిన వాడై కృష్ణుని శాశ్వత ధామానికి వెడతాడు గనక ఇక్కడ జీవితకాలాన్ని పొడిగించుకోవాలని ప్రయత్నించడు. మిత ఆహారాన్ని స్వీకరించమనే యోగ నియమాన్ని, కేవలం కృష్ణప్రసాదాన్నే స్వీకరించే భక్తుడు అప్రయత్నముగానే పాటించినవాడవుతాడు. అలాంటి ఇంద్రియ నిగ్రహం లేనిదే ఎవ్వరూ ఈ భౌతిక బంధనం నుండి ముక్తులు కాలేరు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

వేదాలు వల్లించిన మహిషం

మహానుభావులు ఏమి చేయాలనుకున్నా చేయగలరు. ఇటువంటి కథలు మనకు పురాణాల్లో ఎన్నోఉన్నాయి. పాండురంగని అంకిత భక్తుడు జ్ఞానదేవ్, షిర్డిసాయి అటువంటి లీలలు చేసి చూపారు. జ్ఞానదేవ్ దున్నపోతు చేత వేదాలే వల్లింపజేశాడు. షిరిడి సాయి ఒక పనిపిల్ల నుంచి ఈశావాస్యోపనిషత్తు భావం వెల్లడింపజేసారు.



దున్నపోతు వేదాలు వల్లించటమా? ఇది నిజమా? ముమ్మాటికీ నిజమే. అలా పలికించినది ఎవ్వరో కాదు పాండురంగని భక్తుడు జ్ఞానదేవ్. ఒక సందర్భంలో పాండురంగడే "నన్ను జ్ఞానదేవుని వేరు చేసి చూడవద్దు. ఇద్దరం ఒక్కటే" అని నామదేవ్‌కు చెపుతాడు. ఒక పర్యాయం వేదపండితులకు జ్ఞానదేవులకు ఒక విషయంలో భేదాభిప్రాయాలు వచ్చాయి. ఆ సందర్భంగా "జ్ఞానదేవ్ అని నీవు ఎందుకు పేరు పెట్టుకున్నావు?" అని వారు ప్రశ్నించారు. "అన్ని ప్రాణులలో ఉన్న చైతన్యం ఒక్కటే అటువంటప్పుడు నేను జ్ఞానదేవ్ అని పేరు పెట్టుకుంటే తప్పేమిటి?" జ్ఞానదేవులు ఎదురు ప్రశ్నించారు. ఆ పండితులు ఒక దున్నపోతును చూపి దీనిలోను, నీలోను ఉన్న చైతన్యం ఒక్కటేనా? అని ప్రశ్నించగా జ్ఞానదేవులు అవును అని సమాధానమిచ్చారు. అయితే ఈ దున్న చేత మాట్లాడించు అని చెప్పగా మాట్లాడటమేమిటి వేదములే వల్లిస్తుంది అని చెప్పి తన హస్తాన్ని ఆ దున్నపై పెట్టగానే అది స్వరయుక్తంగా వేదాలు పఠించింది. అదిగాంచిన ఆ పండితులు జ్ఞానదేవులు సామాన్య మానవుడు కాడని తెలుసుకొని అతని పాదాలపై పడి క్షమాపణలు వేడారు.

మహనీయులు

జ్ఞానదేవ్ ఉపన్యాసాలకు అసంఖ్యాక భక్తులు హాజరై శ్రద్ధా, భక్తులతో వినేవారు. జ్ఞానదేవ్ ఉపన్యాసాలను సచ్చిదానంద బాబా గ్రంథస్తం చేసారు. దానికి 'భావార్థ దీపిక' అని నామకరణం చేశారు. ఆ తరువాత కాలంలో దానికే 'జ్ఞానేశ్వరి' అని పేరు పెట్టారు.

సాయిబాబా తన భక్తులను జ్ఞానేశ్వరిని చదవమని చెప్పి అనేక మందిచే పారాయణ చేయించారు కూడా.

పని పిల్లలో ఈశావాస్యోపనిషత్తు భావం

ఈశావాస్యోపనిషత్తులో మనిషికి ఆత్మ జ్ఞానం కలిగించే శ్లోకాలు ఉన్నవి. ఒక సారి షిరిడి సాయి భక్తుడైన దాసుగణు ఈ ఈశావాస్యోపనిషత్తుకు మరాఠీ వ్యాఖ్యానం చేయదలచి కొన్ని శ్లోకాలను తర్జుమా చేశారు. దానితో అతనికి ఏ మాత్రం సంతృప్తి కలుగలేదు. దానిలోని భావం గ్రహించాలంటే సద్గురు కృప అవసరమని గ్రహించి బాబా చెంతకేగి అతని సందేహం చెప్పగా "నీ తిరుగు ప్రయాణములో కాకా సాహెబ్ పనిపిల్ల నీ సంశయాన్ని తీరుస్తుంది " అని చెప్పాడు . అది విన్న దాసగణు బాబా అనుమతి పొంది తిరుగు ప్రయాణమై కాకాసాహెబ్ దీక్షిత్ ఇంటిలో బస చేసాడు. ఆ మరుసటిరోజు ఉదయాన్నే కాకా పనిపిల్ల తన పనులు చేసుకొంటూ శ్రావ్యమైన కంఠంతో ఒక చక్కని పాట పాడసాగింది. ఆ పాట ఒక ఎఱ్ఱని చీర, దానిపై ఉన్న చేతి పని గురించి. ఆ పనిమనిషి కట్టుకున్నవి చింకి బట్టలు మాత్రమే. కాని వర్ణించినది ఒకసుందరమైన చీర గురించి. ఆ మరునాడు రావుబహదూర్ ప్రధాన్ ఒకకొత్త పంచెల జతను దాసగణుకు బహూకరించగా దాసగణు ఆ పనిపిల్లకు కూడ ఒక చీరనివ్వమనగా అతను ఆమెకు కూడా ఒక చీరను బహూకరించారు. ఆ చీర కట్టుకొని ఆ పనిపిల్ల సంతోషంతో ఆడిపాడింది. ఆ తరువాత రోజు ఎప్పటి వలెనే చింకి గుడ్డలు కట్టుకొని పనిచేయసాగింది. అయినా ఆమె ఆనందంలో ఏమాత్రం మార్పులేదు. మొదట ఆమె చింకి గుడ్డలను కట్టుకొన్నా మంచి చీర గురించి సంతోషంగా పాడింది. కొత్త చీర లభించిన తర్వాత దానిని ధరించినా అంతే సంతోషంగా ఉండేది. ఆ తరువాత ఆ చీరను పెట్టెలో దాచి పెట్టి చింకి బట్టలు ధరించినా ఆమె సంతోషంగానే ఉంది.

దీనికి కారణమేమిటి? చీరా? కాదు. పనిపిల్ల మనస్సు. ఉన్నప్పుడు లేనప్పుడు, ఎప్పుడు సంతోషంగానే ఉండాలనే భావాన్ని చక్కగా తెలియచేసింది. ఈశావాస్యోపనిషత్తు భావం ఇదే.

కొంతమంది వేదపండితులు బాబా ప్రతినిత్యం ఎంతోమంది కళాకారులను ఆదరించి వారికి బహుమతులు ఇస్తారని విన్నారు. బాబా చెంతకు వెళ్లి బాబా ముస్లిం అని భావించి నేరుగా ఆయనను అడగక వేదాలలో పరబ్రహ్మన్ని దక్షిణ కోరుతూ ఉన్న వేదములోని రుక్కులను వల్లించసాగారు. మధ్యమధ్యలో వారు మరచిపోయిన వేదభాగాలను బాబా వారికి గుర్తు చేయగా వారు సిగ్గుపడిరి. బాబా వారి గర్వమును గుర్తించి "మీరు పొగిడిన ఆ పరబ్రహ్మనే సంభావనను అడగండి" అని అన్నారు. వారు సిగ్గుతో తలదించుకోగా బాబా వారికి భారీగా సంభావన ఇచ్చి సత్కరించి పంపారు.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

దినఫలాలు

మేష రాశి
విద్యా ప్రయత్నాలు అనుకూలం. కుటుంబ సఖ్యత పెరుగుతుంది. శారీరిక శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. రుణ ఒత్తిడులు, క్రమ క్రమంగా తగ్గుతాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి
వాహన నిర్ణయాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయం పర్వా లేదు.

మిథున రాశి
దూరప్రయాణాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు.మానసిక రుగ్మ తలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి
ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగుతాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి
స్థిరాస్థి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అయోమయం పరిస్థితులున్నా అధిగమించ గలుగుతారు.

కన్యా రాశి
విదేశీ లావాదేవీలు అనుకూలం స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి
వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి
ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించు కోలేకపోతారు.

ధనూ రాశి
గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలోని మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి
రుణప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభ రాశి
ఒత్తిడులు ఉద్యోగపరంగా పెరుగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

మీన రాశి
విద్యాప్రయత్నాలు కలసి వస్తాయి. నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి. కాబట్టే జాగ్రత్తలు తప్పనిసరి.ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.

శ్రీ నూకల సూర్యనారాయణ




ఒక వ్యక్తిని కుబేరుల లిస్ట్‌లోకి చేర్చడానికి చాలా అంశాలుంటాయి. బ్యాంక్ బ్యాలెన్స్ ఉంటే సరిపోదు. స్థూల ఆదాయం కంటే నికర ఆదాయం పెరగడం చాలా ముఖ్యం. ఒక వ్యక్తిని సంపన్నుడు అని ఎలా నిర్ణయిస్తారంటే అతని వద్ద ఉన్న స్థిర, చరాస్తుల ద్వారా అని గుర్తుంచుకోవాలి.

ఇన్‌కమ్ పెంచుకోండి!

సొంతిల్లు

సొంతిల్లు అనేది ఎవరికైనా జీవిత స్వప్నం. అది ఎన్నో అంశాలతో ముడిపడి ఉంటుంది. ఒకసారి ఏదో విధంగా సొంతిల్లు సాధిస్తే దాని విలువ ఏళ్లు గడిచేకొద్దీ పెరుగుతూ ఉంటుంది.

విద్య



చదువుకునేటప్పుడు ఏదో ఒకటి, ఎంతో కొంత శాతంతో పాసవుతారు. అది సరే కానీ భవిష్యత్తులో మీ గురించి చెప్పుకోవడానికి బాగా ఉండేలా మంచి చదువులు పూర్తి చేసేందుకు ప్రయత్నించండి. మీ కెరీర్ ఆసాంతం పనికొచ్చేలా ఏవైనా కోర్సులు లాంటివి ఉంటే వాటిని ఎంచుకోండి. అవసరమైతే సర్టిఫికేషన్ కోర్సులను సైతం పూర్తి చేయండి. అలాగే ఉద్యోగం వేటలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయక మంచి జీవనశైలిని అలవర్చుకోండి.

రిటైర్‌మెంట్



ఇప్పుడున్న పరిస్థితులను చూస్తే ఇదివరకటి లాగా ఎక్కువ ఏళ్లు బతికే అవకాశం లేదనే చాలామంది అనుకుం టారు. ఆ విధంగా చూస్తే భవిష్యత్తులో 50 ఏళ్లకే ఉద్యోగాలు మానేసి ఇంట్లో కూర్చున్నా ఆశ్చర్య పోనక్క ర్లేదు. అలా కనుక అయితే పదవీ విరమణ తర్వాత జీవితం కూడా చాలా ఉంటుంది. యుక్తవ యసులో, బాగా సంపా దించే వయసులో పొదుపు చేసిన డబ్బే ప్రణాళికతో వ్యవహరిస్తే భవిష్యత్తు నికర ఆస్తుల విలువను పెంచుతుంది.

ఫైనాన్స్



ఈ రోజుల్లో బ్యాంకుల్లో, ఆర్థిక సంస్థల్లో అప్పులు తెచ్చుకోవడం సులువైంది. అదే విధంగా బాండ్ పేపర్ మీద ఒప్పందం రాసుకుని అప్పులు ఇవ్వడం ఎక్కడ చూసినా మామూలే. ఎక్కువ డబ్బు ఉంటే వడ్డీకి అప్పులివ్వడం ద్వారా కూడా మీ సంపదను పెంచుకునేందుకు ఒక మార్గంగా పనికొస్తుంది. అయితే మీరు అప్పు చేసి పెట్టుబడి పెట్టడం మాత్రం మంచిది కాదని గుర్తుంచుకోండి. స్థిరాస్థి కోసం అప్పు విషయంలోనైతే రాబడిని పోల్చుకుని ముందుకు సాగడం సూచనీయం.

వైద్యం



జీవితంలో కొంత వయసు వచ్చిన తర్వాత ఆరోగ్యం మీద శ్రద్ధ చూపేవారు ఎంతోమంది. ఒక వయసు వచ్చిన తర్వాత అనారోగ్యం వస్తే అప్పుడు బాధపడాల్సి వస్తుంది. అందుకే మంచి జీవనశైలి గురించి ఇప్పటి నుంచే కృషి చేయాలి. లేకపోతే మీ దగ్గర ఎంతో డబ్బు ఉండొచ్చు కానీ సుఖ, సంతోషాలు ఉండవు.




స్టాక్ మార్కెట్

చాలామంది ఉద్యోగులు మంచి పెట్టుబడులు రావడానికి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడుతుంటారు. ఇది రిస్క్‌తో కూడుకున్న పెట్టుబడి మార్గం కాబట్టి ఎక్కువమంది మొగ్గు చూపరు. ఒక మంచి విశ్లేషణతో ఉండి, సరైన మార్గాన్ని అనుసరిస్తే ఎక్కువ రాబడుల అవకాశం ఉంటుంది. మార్కెట్ నిపుణులు చెప్పేదేమంటే మీ సొంత విశ్లేషణ ఉండాలి. ఎవరైనా పెట్టుబడి సలహాదారులు మీ పెట్టుబడులను వివిధ రకాల వాటిలో పెట్టమని చెబుతారు. మీ రాబడిని, అవసరాలను బట్టి ప్లాన్ వేసుకోవాల్సింది మీరే.



గడువు ముగిసినా ఐటీఆర్ ఫైల్

ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేయడానికి ఆగస్టు ఐదో తేదితో గడువు ముగిసింది. అయితే మీరు మీ ఆదాయపన్ను రిటర్నులు సమర్పించలేదా? ఆందోళన చెందాల్సిన పనిలేదు. 2016-17 ఆర్థిక సంవత్సరానికి గాను ఆగస్టు 5 తర్వాత కూడా ఐటీఆర్ ఫైల్ చేయొచ్చు. కాకపోతే సెక్షన్ 139 (1) ప్రకారం చేసే రిటర్నుల ఫైలింగ్ కాస్తా.. 139(4) ప్రకా రం చేయాల్సి ఉంటుంది. ఆలస్యంగా ఆదాయపన్ను రిటర్నులు ఎలా ఫైల్ చేయొచ్చో చూద్దాం.



ఏయే మార్గాల్లో మీరు ఆదాయాన్ని పొందారనే దాన్ని బట్టి ఐటీ రిటర్ను లు దాఖలు చేయాల్సి ఉంటుంది. 2018 మార్చి 31లోపు ఐటీ రిటర్నులు సమర్పించొచ్చు. టీడీఎస్ పోనూ మీరు ఇంకా పన్ను చెల్లించాల్సి వస్తే నెలకు 1శాతం చొప్పున పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఐటీఆర్‌ను రెండు రకా లుగా ఫైల్ చేయవచ్చు. ఒకటి ఆన్‌లైన్ కాగా.. ఎక్స్ ఎల్ లేదా జావా యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకొని, వాటిలో వివరాలను నింపి అప్‌లోడ్ చేయడం రెండోది. ఆన్‌లైన్‌లో ఐటీ రిటర్నులు ఎలా ఫైల్ చేయాలో చూద్దాం. దీన్ని వ్యక్తిగతంగా పన్నులు కట్టేవారు మాత్రమే ఈ విధానంలో ఐటీఆర్ సమర్పించొచ్చు. 2016-17లో అయితే ఫారం 1, 4 ఎస్‌ను ఉపయోగించాలి.

స్టెప్ 1: www.incometaxindiaefiling.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి.

స్టెప్ 2: Login Here పై క్లిక్ చేసి మీ పాన్, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ, క్యాప్చా కోడ్ ఇచ్చి సబ్‌మిట్ బటన్ క్లిక్ చేసి అకౌంట్లోకి లాగిన్ కావాలి.

స్టెప్ 3: ఈ ఫైల్ ట్యాబ్ మీద క్లిక్ చేసి ప్రిపేర్ అండ్ సబ్‌మిట్ ఐటీఆర్ ఆన్‌లైన్ ఆప్షన్ సెలక్ట్ చేసుకోవాలి.

స్టెప్ 4: తుది గడువు ముగిశాక ఐటీ రిటర్నులు సమర్పిస్తున్నారు కాబట్టి అందుకు తగిన ఫారం, అసెస్‌మెంట్ ఇయర్ ఎంపిక చేసే విషయంలో జాగ్రత్త వహించాలి.

స్టెప్ 5: పైన తెలిపిన వివరాలు ఇచ్చాక ఐటీఆర్ ఫారం పేజి ఓపెన్ అవుతుంది.

స్టెప్ 6: ఐటీఆర్ ఫారం నింపేటప్పుడు రిటర్న్ ఫైల్డ్ అండర్ సెక్షన్ దగ్గర సరైన ఆప్షన్ సెలక్ట్ చేసుకోవాలి. లేదంటే ట్యాక్స్ రిటర్న్ ఫైల్ చేయడం కుదరదు. తుది గడువు ముగిశాక ఫైల్ చేస్తున్నారు కాబట్టి ఆఫ్టర్ డ్యూ డేట్ 139 (4)ను ఎంపిక చేసుకోవాలి.

స్టెప్ 7: మీరు ఇచ్చిన సమాచారం సరిచూసుకోవాలి. ప్రివ్యూ అండ్ సబ్‌మిట్ మీద క్లిక్ చేసి చెక్ చేసుకోవచ్చు.

స్టెప్ 8: ఫైనల్ సబ్‌మిషన్ పూర్తయ్యాక మీ ఐటీఆర్‌ను వెరిఫై చేయడం మర్చిపోవద్దు. వెరిఫై చేస్తేనే మీ ఐటీఆర్ వ్యాలిడి అవుతుంది.

స్టెప్ 9: ఐటీఆర్‌ను వెరిఫై చేయడానికి ఆరుమార్గాలున్నాయి. ఆధార్ ద్వారా ఈ వెరిఫై చేయొచ్చు. నెట్ బ్యాంకింగ్ లేదా ఓటీపీ ద్వారా కూడా చేసుకోవచ్చు. లేదంటే బెంగళూరులోని సీపీసీకి ఐటీఆర్-వి ని పంపొచ్చు.

స్టెప్ 10: మీరు వెరిఫై చేశాక ఐటీ డిపార్ట్‌మెంట్ దాన్ని ప్రాసెస్ చేస్తుంది. ప్రాసెసింగ్ పూర్తయ్యాక మీకు మెసేజ్, ఈమెయిల్ వస్తుంది.

సురక్షితమైన పెట్టుబడికి పీపీఎఫ్

దీర్ఘకాలిక పొదుపు ఖాతాల్లో పీపీఎఫ్ ఒకటి. వేతన ఉద్యోగులకు పన్ను మినహాయింపు పొందేందుకు ఇది బాగా ఉపయోగపడుతుంది. దీనికి ప్రభుత్వ హామి ఉంటుంది. ఇది ఒక సురక్షితమైన పెట్టుబడి మార్గం. రాబడులు, పన్ను ప్రయోజనాలు ఏది చూసినా దీర్ఘకాలంలో ఇది ఒక మంచి పొదుపు పథకం. ప్రయివేటు ఉద్యోగులకు ఎవరికైతే ప్రభుత్వ పింఛను సదుపాయం ఉండదో అలాంటివారికి ఇది బాగా ఉపయుక్తంగా ఉంటుంది. అయితే పీపీఎఫ్ ఖాతాను ఎక్కడ, ఎలా తెరవాలో ఇక్కడ తెలుసుకుందాం.



అసంఘటిత రంగాల కార్మికులకు

సంఘటిత రంగాల్లోని కార్మికులకు ఉద్యోగ భవిష్య నిధి ఉంటుంది. అదే రీతిన అసంఘటిత రంగ కార్మికులకు దీర్ఘకాలంలో ఆర్థిక రక్షణ కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ సదుపాయాన్ని కల్పించారు. ఇందులో సాధారణ ప్రజలు సైతం భాగస్వాములుగా చేరవచ్చు. ప్రజలు ఎక్కువగా దీనిని పన్ను మినహాయింపు సాధనంగానే భావిస్తున్నారు. అయితే వీటిపై వడ్డీని ప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. ప్రస్తుతం వివిధ పెట్టుబడి సాధనాలపై వడ్డీ రేట్లు తగ్గుతున్న క్రమంలో దీర్ఘకాల దృష్టితో చూస్తే పీపీఎఫ్ ఇంకా ఆకర్షణీయంగానే ఉంది.

పోస్టాఫీసు

పీపీఎఫ్ ఖాతాను పోస్టాఫీసు శాఖల్లో తెరవొచ్చు. మీకు దగ్గరలోని



పోస్టాఫీసు బ్రాంచికి వెళ్లి సంబంధిత అధికారిని కలవండి. దానికి అవసరమైన ఫారంను నింపండి. ఈ ఫారం ఆన్‌లైన్‌లో సైతం అందుబాటులో ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తిచేసేందుకు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, వ్యక్తిగత గుర్తింపు, చిరునామా గుర్తింపు, పాన్‌కార్డు, డిపాజిట్ సొమ్ము అవసరం.

జాతీయ బ్యాంకులు

పీపీఎఫ్ ఖాతా తెరిచేందుకు ప్రభుత్వం అన్ని బ్యాంకులకు అనుమతి ఇవ్వలేదు. మీరు నిర్దిష్టమైన కొన్ని బ్యాంకులనే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి కూడా జాతీయ బ్యాంకులకు సంబంధించినవై ఉండాలి. దీనికి సంబంధించిన వివరాలు బ్యాంకు వెబ్‌సైట్ లేదా బ్యాంకు బ్రాంచికైనా వెళ్లి తెలుసుకోవాలి. పీపీఎఫ్ అకౌంట్లను అన్ని పోస్టాఫీసుల్లో తెరచుకునే వీలుంది. మీరు ఏదేని స్థానిక పోస్టాఫీసుకు వెళ్లండి. అక్కడ సంబంధిత అధికారిని కలవండి. అక్కడ పీపీఎఫ్ దరఖాస్తు నింపాలి. ఈ దరఖాస్తు ఇంటర్‌నెట్‌లో కూడా అందుబాటులో ఉంటుంది. రెండు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను పెట్టండి. అడ్రస్‌కు సంబంధించిన జిరాక్స్, ఐడెంటిటీ, పాన్‌కార్డ్ జత చేయండి. పోస్టాఫీసులో పీపీఎఫ్ అకౌంట్ తెరవండి. నగదు డిపాజిట్ చేయండి.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పీపీఎఫ్ అకౌంట్లను తెరవొచ్చు. పీపీఎఫ్ దరఖాస్తును నింపాలి. దీంతో పాటు బ్యాంకుకు అవసరమైన ఇతర డాక్యుమెంటులు సమర్పించాలి. అన్ని విధివిధానాలు పూర్తయిన తర్వాత బ్యాంకు మీకు పీపీఎఫ్ పాస్‌బుక్‌ను ఇస్తుంది.

40 కోట్ల టర్నోవర్‌తో స్పెన్సర్ రిటైల్ ఆన్‌లైన్ వ్యాపారం



భారతదేశంలోకెల్లా అతిపెద్ద రిటైల్ కిరాణానెట్‌వర్క్‌గల స్పెన్సర్స్ రిటైల్ క్రమంగా దేశమంతటా విస్తరిస్తూ వచ్చింది. రూ 40,355 కోట్ల టర్నోవర్‌తో ఆన్‌లైన్ వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోంది. వినియోగదారులు తమకు కావాల్సిన వస్తువులను ఆర్డర్ చేయడంతో రోజువారీ నిత్యావసర వస్తువుల విభాగంలో ఆన్‌లైన్ విక్రయాలు నిర్వహిస్తున్న తొలి ఓమ్ని చానెల్ ప్లేయర్ 'స్పెన్సర్స్ రిటైల్' నిలిచింది. హైదరాబాద్, చెన్నయ్, కొల్‌కతా, ఢిల్లీ పరిసరాల్లోని దేశ రాజధాని రీజియన్‌లో 2016లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించింది. తాజాగా విశాఖపట్నంలోనూ ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.




ఐపీవోలో పెట్టుబడులా?

చాలా కంపెనీలు ఐపీవో (ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్)లకి వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఏ కంపెనీలో షేర్లు కొనాలో తెలియక తికమకపడుతున్నారు. అటువంటి వారికి అవగాహన అవసరం. పెట్టుబడుల కోసం చాలా కంపెనీలు మొదటిసారి ప్రైమరీ మార్కెట్లోకి వస్తున్నాయి. అయితే ఈ మధ్యకాలంలో మాత్రం ఐపీవోల వైపు మొగ్గుచూపుతున్నాయి.

ఓవర్‌సబ్ స్క్రిప్షన్

ఐపీవో ఇష్యూకు ఏదైనా కంపెనీ ముందుకు వచ్చినప్పుడు మొదట్లోనే ఎన్ని షేర్లు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని ప్రస్తావిస్తారు. ప్రతి వర్గానికి అంటే బ్యాంకింగ్, ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు, దేశీయ సంస్థలు, రిటైల్ పెట్టుబడిదారులకు ఎవరెవరికి ఎన్ని షేర్లు కేటాయింపులు జరిపారనే దాన్ని ముందే వెల్లడిస్తారు.



రేటింగ్ లేదా గ్రేడింగ్

ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాల్సిన మరో అంశం ఐపీవోలకు ఇచ్చే రేటింగ్. ఇతర ఆర్థిక సాధనాల్లాగా రేటింగ్ సంస్థలు ఐపీవోలను సైతం రేట్ చేస్తుంటాయి. మంచి రేటింగ్ ఉంటే నిస్సందేహంగా ముందుకెళ్లవచ్చు. అయితే కేవలం రేటింగ్‌పైనే ఆధారపడి ముందుకు వెళ్లకూడదు.

ఇష్యూ ధర

ఒకే బాస్కెట్‌లో ఉండే లిస్టెడ్ స్టాక్‌లతో పోల్చి చూసినప్పుడు ఉండే ఇష్యూధర అదే రంగానికి సంబంధించి మార్కెట్లో ఉండే వాటితో పోల్చి చూసినప్పుడు దీని ఇష్యూ ధర ఎక్కువగా ఉంటే ఆ కంపెనీ షేర్ ధర లాభాలు గడించే అవకాశాలు తక్కువని గుర్తుంచుకోవాలి.

వాల్యుయేషన్లు

ప్రైస్ టు ఎర్నింగ్ రేషియో లేదా పీ/ఈ నిష్పత్తి అనేది కంపెనీ స్టాక్ విలువ, రాబడిన సంబంధాలను తెలియజేస్తుంది. స్టాక్ ధరను షేర్‌కు వచ్చే రాబడితో భాగిస్తే ఈ రేషియో వస్తుంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ రేషియోను సైతం చూడాల్సి ఉంటుంది.

ఇష్యూ ఉద్దేశ్యం

ఇష్యూను ఎందుకు జారీ చేస్తున్నారో అనే అంశం సైతం పెట్టుబడిదారులు గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయం. ఎందుకంటే పెట్టుబడిదారుల నుంచి సేకరించిన డబ్బులను ఏం చేస్తారో ముందు తెలుసుకోవాల్సి ఉంటుంది కాబట్టి.

కంపెనీ ఫండమెంటల్స్

కంపెనీ యాజమాన్యం, ఏ రంగంలో పనిచేస్తుంది. నిర్వహణ లాభాలు ఎలా ఉన్నాయి అనే అంశాలు, కంపెనీ పరిశ్రమ బలహీనతలను బట్టి మొత్తం మార్కెట్ సెంటిమెంటును అంచనా వేయడం వంటివి సైతం ఐపీవో పెట్టుబడులు పెట్టేందుకు గమనించాల్సిన వాటిలో ముఖ్యమైనవి.

కంపెనీ ఆర్థిక సామర్థ్యం

కంపెనీ వ్యాపారం దేనిపై నిర్వహిస్తోంది. కంపెనీ ఆర్థిక వనరులు ఏంటి అనే దాని ఆధారంగా కంపెనీ భవిష్యత్తు రాబడులు, ఆర్థిక సామర్థ్యం అనేవి ఆధారపడి ఉంటాయి. భవిష్యత్తులో కంపెనీ పనితీరును మొదట వీటిని బట్టే అంచనా వేయాల్సి ఉంటుంది. పెద్ద ఆర్థిక సంస్థలు చేసే పనిని కాకుండా ప్రత్యేకంగా కొన్ని అంశాల ఆధారంగా పనిచేస్తుందనే నమ్మకంతోనే బ్రోకరేజిలు ఇటీవల ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ఐపీవోకు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని పెద్ద ఎత్తున సూచించారు.



పవన్‌కల్యాణ్

పుట్టినరోజు కానుక

పవన్‌కల్యాణ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. రామోజీ ఫిలింసిటీలో వేసిన సెట్లో కీలక సన్నివేశాలను తీస్తున్నారు. హారిక అండ్ హాసిని పతాకంపై ఎస్.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పవన్ రాజకీయాల్లో కూడా బిజీగా ఉండటంతో షూటింగ్ నిదానంగా సాగుతోందని అంటున్నారు. సెప్టెంబర్ 2న పవన్ పుట్టినరోజు వేడుకలు పూర్తయిన తర్వాత యూరప్ షెడ్యూల్‌కు చిత్రబృందం ప్లాన్ చేసిందట. దాదాపు నెల రోజుల పాటు అక్కడ జరిపే భారీ షెడ్యూల్‌తో షూటింగ్ దాదాపుగా పూర్తవుతుందని చెబుతున్నారు. పవన్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తారని సమాచారం. పవన్, త్రివిక్రమ్‌ల కలయికలో జల్సా, అత్తారింటికిదారేది వంటి విజయవంతమైన చిత్రాలొచ్చిన సంగతి తెలిసిందే. దాంతో ఈ కాంబినేషన్‌కు ఎనలేని క్రేజ్ లభించింది. తనదైన ఫ్యామిలీ డ్రామా శైలిని సమ్మేళనపరుస్తూ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే యాక్షన్‌కు కూడా ప్రాధాన్యం ఉండటంతో పవన్ చేసే ఫైట్స్ కూడా కొత్తరకంగా ఉంటాయని అంటున్నారు. రవివర్మ, పీటర్‌హెయిన్స్ ఫైట్స్‌ను కంపోజ్ చేస్తున్నారు. విదేశాలలో ఫైట్స్ చిత్రీకరణ చేసేటప్పుడు లోకల్ టాలెంట్‌ను ఉపయోగించుకుంటారని వినిపిస్తోంది. తమిళ సంగీత దర్శకుడు అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం కోసం పవన్ ఓ పాట పాడనున్నట్లు కొద్దిరోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కొద్దిరోజులు ఆగితే దీనిపై మరింత స్పష్టత రావచ్చు.

నాగచైతన్య విలక్షణ పాత్రలో

యుద్ధం శరణం



నాగచైతన్య, లావణ్యత్రిపాఠి

నాగచైతన్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం యుద్ధం శరణం. లావణ్యత్రిపాఠి కథానాయిక. కృష్ణ ఆర్.వి.మారిముత్తు దర్శకుడు. వారాహి చలనచిత్రం పతాకంపై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా సెప్టెంబర్ 8న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ, పూర్తిస్థాయి ఫ్యామిలీ, యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. నాగచైతన్యకు మరో విలక్షణ చిత్రమవుతుంది.

కథకు తగ్గ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీకాంత్ నెగటివ్ ఛాయలున్న పాత్రలో నటించారు. రావు రమేష్, మురళీశర్మ, రేవతి తదితరుల పాత్రలు కూడా ఆకట్టుకుంటాయి. అక్కినేని అభిమానులతో పాటు ప్రేక్షకులను మెప్పించేలా ఈ సినిమా ఉంటుంది అని చెప్పారు.

ఈ చిత్రానికి కథ: డేవిడ్ ఆర్.నాథన్, మాటలు: అబ్బూరి రవి, సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, సంగీతం: వివేక్‌సాగర్.

'ఆనందో బ్రహ్మ'లో కొత్తదనం ఉంది

- తాప్సీ

'ఝుమ్మంది నాదం'తో తెలుగు తెరకొచ్చిన సొట్టబుగ్గల సుందరి తాప్సీ....బాలీవుడ్ వెళ్లి జాతీయ స్థాయి నాయిక అయ్యింది. అక్కడ విభిన్నమైన చిత్రాలు చేస్తూ పేరు తెచ్చుకుంది. కొంత విరామం తర్వాత తాప్సీ నటించిన తెలుగు సినిమా 'ఆనందో బ్రహ్మ'. హారర్ కామెడీ తరహాతో దర్శకుడు మహి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించింది. మంచి కథలో భాగమవ్వాలనే 'ఆనందో బ్రహ్మ' అంగీకరించానని తాప్సీ చెబుతోంది. ఈ చిత్రం హారర్ కామెడీలో కొత్త అనుభూతిని ప్రేక్షకులకు అందిస్తుందని ఆమె నమ్ముతోంది. శుక్రవారం 'ఆనందో బ్రహ్మ' విడుదలవుతున్న సందర్భంగా తాప్సీ చిత్ర విశేషాలు తెలిపింది.



- నేను 'పింక్' సినిమా చేయకముందు దర్శకుడు మహీ ఈ కథను చెప్పారు. కథలోని పాత్రలు, కథనం నాకు నచ్చాయి. వందలాది హారర్ కామెడీ సినిమాలు చూసి ఉంటారు. కానీ ఈ చిత్రం భిన్నంగా సాగుతుంది. కథకు ఒక కారణం ఉంటుంది. ఇలాంటి మంచి కథలో భాగమవ్వాలనే సినిమాను ఒప్పుకున్నాను. నేను సెట్‌లోకి వచ్చేవరకు ఎవరికీ నమ్మకం లేదు. హిందీలో తీరిక లేకుండా ఉన్న నాయిక ఈ సినిమాలో ఎందుకు చేస్తుంది అనుక ...న్నారట. అయితే 'పింక్' కు ముందు ఆకట్టుకున్న కథ తర్వాత మారిపోతుందా. నాకు ఇప్పటికీ ఈ స్క్రిప్టు ఇష్టమే.
- నాతో పాటు మరో నాలుగు పాత్రల మధ్య జరిగే డ్రామా ఈ కథ. 'ఆనందో బ్రహ్మ' లో నా పాత్ర శక్తివంతమైనదేమీ కాదు. చాలా సాధారణ పాత్ర. ఇంతకంటే మంచి క్యారెక్టర్స్ గతంలో నేను చేశాను. ఎంతోమంది నాయికలు నటించారు. కథక ...ఎంచుకున్న కాన్సెప్ట్ బాగుంటుంది. చిత్రం గురించి అబద్దాలు చెప్పి తప్పుదారిలో దానికి ప్రచారం కలిగించడం నాకు ఇష్టం ఉండదు. గత రెండు మూడేళ్లుగా చేసిన ప్రతి సినిమా గురించి నిజాయితీగా చెబుతున్నాను. ఈ చిత్రానికీ అలాగే ప్రచారం చేస్తున్నాం.
- చిత్రంలో విషయం ఉందని చెప్పుకోవడం ఒక ...టే మేము ప్రేక్షకులను ఆకర్షించగలిగేది. 'ఆనందో బ్రహ్మ' లో అలాంటి కొత్తదనం ఉందని వాళ్లకు చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఏదో నటించి, వెళ్లిపోయాం, పత్రికలకు ముఖాముఖిలు ఇచ్చాం అనకుండా...ఇందులో నేనూ చొరవ చూపిస్తున్నాను. ఈ సినిమా నా బిడ్డ లాంటిది. దీన్ని జాగ్రత్తగా చూసుకోవాలి.
- నేను రిస్కు తీసుకుని చేసిన సినిమా ఇది. కొత్తగా ఏదైనా చేయాలంటే ముందు ప్రయత్నించాలి. అలాంటి ప్రయత్నమే ఇది. 'ఆనందో బ్రహ్మ' ఫలితం చూసి ఈ తరహా సినిమాలు చేయాలా వద్దా అని నిర్ణయించుకుంటాను. ఒక పెద్ద హీరో పక ...న నటిస్తే స్టార్ హీరోయిన్ అనిపించుకుంటుందా..? లేక మొత్తం కథను ముందుకు నడిపించే పాత్ర చేయడం పెద్ద హీరోయిన్ అనిపించుకుంటుందా..? సినిమాలో అన్నింటికీ తానే ముందుండి నడిపించిన నాయికే నా దృష్టిలో స్టార్ హీరోయిన్.
- శారీరక మానసిక లోపాలున్న నాలుగు పాత్రలు దెయ్యాన్ని ఎలా భయపెట్టాయన్నది చిత్రంలో ఆసక్తికర అంశం. అన్నివిధాలా బాగున్నవాళ్లు దెయ్యాలకు భయపడతారు. ఒక తాగుబోతు, చెవిటి, గుడ్డి, మానసిక స్థితి సరిగా లేని వాళ్లు ఎందుకు భయపడతారు. వాళ్ల బలహీనతే ఆయుధంగా దెయ్యాలను ఆటాడుకుంటారు.
- దర్శకుడిగా మహీ చాలా నిజాయితీగా కథను తెరకెక్కించారు. ప్రతి అంశాన్నీ సాధికారికంగా చూపి ...ంచాడు. ఎక్కడా అనవసరంగా సృజనాత్మక స్వేచ్ఛ తీసుకోలేదు. సినిమాటిక్‌గా ఉండమని మేమే అతన్ని ప్రోత్సహించాం. అతను తన దారిలోనే వెళ్లాడు. చిత్ర రూపకల్పన పట్ల మహీ దృక్పథం నన్ను ఆకట్టుకుంది.
- నన్ను ఆకట్టుకుంటే ఎలాంటి సినిమాలు చేయడానికైనా సిద్ధమే. అది మసాలా సినిమా అయినా, ఆర్ట్ చిత్రమైనా నటిస్తాను. నటిగా నాకు భాషా బేధాలు లేవు. పెళ్లికి ఇంకా చాలా సమయముంది.

వీఎస్ క్రియేటివ్ వర్క్స్ కొత్త చిత్రం ప్రారంభం



విజయ్, రాము కొప్పుల, వినాయక్, రాహుల్, పూరిజగన్నాథ్

రాహుల్ విజయ్ హీరోగా వీఎస్ క్రియేటివ్ వర్క్స్ నిర్మిస్తున్న చిత్రం గురువారం ప్రారంభమైంది. ఈ చిత్రానికి దివ్య విజయ్ నిర్మాత కాగా రాము కొప్పుల దర్శకత్వం వహిస్తున్నారు. నాయికను ఎంపిక చేయలేదు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగిన సినిమా ప్రారంభోత్సవానికి దర్శకులు వీవీ వినాయక్, పూరీ జగన్నాథ్ అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఫైట్ మాస్టర్ విజయ్ మాట్లాడుతూ...'ముప్ఫై ఏళ్లుగా చిత్ర పరిశ్రమలో ఉన్నాను. ఇప్పుడు మా అబ్బాయి కథానాయకుడిగా పరిచయం అవుతున్నాడు. దర్శకుడు రాము చెప్పిన కథ ఆకట్టుకుంది. నన్ను ఆదరించినట్లే...మా అబ్బాయిని దీవించాలని కోరుకుంటున్నా. ఈ చిత్రంతో దివ్య విజయ్ నిర్మాతగా మారుతున్నారు.' అన్నారు. దర్శకుడు రాము కొప్పుల మాట్లాడుతూ...'సుకుమార్ గారి దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేశాను. నేను చెప్పిన కథ నచ్చి విజయ్ అవకాశమిచ్చారు. స్క్రిప్టు బాగా వచ్చింది. ఏడాదిన్నరగా పూర్వ నిర్మాణ కార్యక్రమాల్లో ఉన్నాం. ఈ నెల 21 నుంచి చిత్రీకరణ ప్రారంభమవుతుంది. మూడు నెలల్లో చిత్రీకరణ పూర్తి చేస్తాం.' అన్నారు. హీరో రాహుల్ విజయ్ మాట్లాడుతూ...'మంచి కథతో తెరకు పరిచయం అవుతుండటం సంతోషంగా ఉంది. ప్రేమ, కుటుంబ కథా అంశాలుంటాయి. ప్రేమ చుట్టూ అల్లుకున్న కథ ఇది.' అన్నారు. మురళీ శర్మ, రాజేంద్రప్రసాద్, పవిత్ర లోకేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్, ఈశ్వరీ భాయి, గొల్లపూడి మారుతీరావు, సత్యం రాజేష్, జోష్ రవి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం - మణిశర్మ, సినిమాటోగ్రఫీ - ఛోటా కె నాయుడు, ఎడిటింగ్ - నవీన్ నూలి, ఫైట్స్ - విజయ్, ఆర్ట్ - చిన్నా, సాహిత్యం - శ్రీమణి, లైన్ ప్రొడ్యూసర్ - రాజు ఓలేటి.

మంచు లక్ష్మి సినిమాకు శ్రీకారం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిణిగా మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. విజయ్ యలకంటి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. మంచు మనోజ్, ఆయన భార్య ప్రణతి, మంచు లక్ష్మి తనయ విద్యా చిత్ర నిర్మాణ స్క్రిప్ట్‌ను దర్శక నిర్మాతలకు అందించారు.

నటి, నిర్మాత మంచు లక్ష్మి మాట్లాడుతూ కొంత విరాం తర్వాత మా సంస్థ నిర్మిస్తున్న చిత్రమిది. ఓ యువతి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. ఎమోషన్స్, రిలేషన్‌షిప్స్ చుట్టూ కథంతా తిరుగుతుంది. మిగతా వివరాలను త్వరలో వెల్లడిస్తాం అని చెప్పారు.



శర్వానంద్‌తో మూడవ సినిమా



రన్ రాజా రన్, ఎక్స్‌ప్రెస్‌రాజా తర్వాత యు.వి. క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం మహానుభావుడు. ఈ మూడు చిత్రాల్లో కథానాయకుడు శర్వానంద్. తాజా చిత్రానికి మారుతి దర్శకుడు. మెహరిన్ నాయికగా నటిస్తోంది. ఒక పాట మినహా షూటింగ్ పూర్తయిన మహానుభావుడు చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆగస్టు 24న ఈ చిత్రానికి సంబంధించి ఫస్ట్‌లుక్, ఫస్ట్ టీజర్ విడుదల చేయనున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ రన్ రాజా రన్, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాల తర్వాత శర్వానంద్ హీరోగా తీస్తున్న మూడవ చిత్రమిది. మారుతి చెప్పిన క్యారెక్టరైజేషన్ దాన్నుండి వచ్చే కామెడీ చాలా బాగా నచ్చింది. అందుకే వెంటనే షూటింగ్ ప్రారంభించాం. విదేశాల్లో, ఇండియాలో పలు ప్రదేశాల్లో చిత్రీకరణ జరిపాం. శర్వానంద్‌కు మా సంస్థలో మరో మంచి చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది. విజయదశమికి సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు.

దర్శకుడు మారుతి మాట్లాడుతూ భలేభలే మగాడివోయ్ చిత్ర తర్వాత నాకు బాగా నచ్చిన పాత్రతో చేస్తున్న చిత్రమిది. అన్ని పక్కా అనుకున్న తర్వాతే చిత్రీకరణ ప్రారంభించాం. శర్వానంద్ చాలా బాగా చేశాడు. పూర్తి స్థాయి కామెడీ కథతో తీశాం. థమన్ మంచి బాణీలు అందించారు. మ్యూజికల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం ఉంటుంది అన్నారు.

ఇతర పాత్రల్లో వెన్నెల కిషోర్, నాజర్, భద్రం, హిమజ, వేణు, సుదర్శన్, మధుమణి తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం నిజార్ షఫి, ఎగ్జిక్యూటివ్ ప్రొడక్ష్యసర్ ఎన్.సందీప్, నిర్మాతలు వంశి, ప్రమోద్, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం మారుతి.